ఆదివారం
గత వారంలోజులపై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
ఖమ్మం
fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
23-2-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 23 పేజీలు: 8+16 వెల: 6.50

భారత్-యుఎస్ వాణిజ్య చర్చలకు బ్రేక్
అఫ్ఘాన్‌పై పాక్ వైమానిక దాడులు 5



'ఉగ్ర' కుట్ర భగ్నం
తమిళనాడులో ఆరుగురు, బెంగాల్‌లో మరో ఇద్దరు అరెస్టు
దర్యాప్తు కోసం ఢిల్లీకి తరలింపు 2

విమెన్ వండర్స్: ఆసియాకప్ భారత్ కైవసం
ఆటలో



చేజారెన్
సూపర్ 8లో చేతులెత్తేసిన భారత్ బ్యాట్స్‌మన్
76 పరుగుల తేడాతో సఫారీల చేతిలో ఓటమి
ఆటలో



## మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ లొంగుబాటు

### సెంట్రల్ కమిటీ సభ్యుడు రాజిరెడ్డి కూడా



దేవ్‌జీ (ఫైల్)



రాజిరెడ్డి (ఫైల్)

**తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయిన మరో 20 మంది మావోలు**

దేవ్‌జీపై రూ.కోటి రివార్డు

ఆసిఫాబాద్ అటవీ ప్రాంతంలో లొంగిపోయినట్లు సమాచారం

**ధ్రువీకరించిన చత్తీస్‌గఢ్ డి. సిఎం**

**నేడు మీడియా ఎదుట ప్రవేశపెట్టనున్న తెలంగాణ పోలీసులు?**

నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత దేవ్‌జీ సారథ్యం

**దేవ్‌జీ సోదరుడి కుమార్తె భావోద్వేగ పోస్ట్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మావోయిస్టు విముక్త్ భారత్ కోసం కేంద్రం చేబట్టిన ఆపరేషన్ గడువు మార్చి 31వ తేదీ దగ్గర పడుతున్న వేళ మావోయిస్టు పార్టీకి మరోసారి భారీ ఎదురు దెబ్బ తగిలింది. ఆ పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా వున్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీతో పాటు అగ్రనేతలు మల్లారాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, నర్సింహా రెడ్డి అలియాస్ గంగన్న సహా 20 మంది తెలంగాణ పోలీసుల ఎదుట ఆదివారం నాడు లొంగిపోయినట్లు తెలిసింది. మావోయిస్టుల ఏరివేతకు ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ సరిహద్దులో గల కర్రెగుట్టల్లో కేంద్ర బలగాలు మరోసారి భారీగా కూం బింగ్ చేబట్టినక్రమంలో వీరంతా తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయేందుకు >>2

# నీటి ప్రాజెక్టులు ఆగొద్దు!

భూ సేకరణకు రూ. 600 కోట్లు

జూన్ 2 లోపు పూర్తి చేయాలి

బడ్జెట్‌లోపే అంచనాలు పంపండి

వచ్చే కేబినెట్ భేటీలో ఆమోదిస్తాం

నెలలోపు దేవాదుల పంప్ రిపేర్ చేయాలి

**అసెంబ్లీ సమావేశాల సమయంలో ఎమ్మెల్యేలు, అధికారులతో దేవాదులపై సమీక్ష నిర్వహిస్తాం**

**అన్ని ప్రాజెక్టుల భూ సేకరణ కోసం ప్రత్యేక కార్పస్ ఫండ్**

**'రామప్ప' నుంచి జంపన్న వాగుకు నీరందించే ప్రణాళికపై నివేదిక ఇవ్వాలి.. అధికారులకు సిఎం రేవంత్ దిశానిర్దేశం**

**దేవాదుల ప్రాజెక్టు పరిశీలన, అధికారులతో సమీక్ష**



ఆదివారం దేవాదుల పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రులు తదితరులు

**ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం రేవంత్ రెడ్డి దేవాదుల ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. దేవాదుల ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించిన సందర్భంగా అధికారులతో సమీక్ష నిర్వహించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జూన్ 2లోపు భూసేకరణ పూర్తి చేసేందుకు రూ.600 కోట్లు మంజూరు చేస్తామని ముఖ్య మంత్రి ప్రకటించారు. భూసేకరణలో ఆలస్యం జరగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భూసేకరణ జాప్యం కారణంగా ప్రాజెక్టు పనులు నిలిచిపోవడానికి అవకాశం ఇవ్వబోమని స్పష్టం చేశారు. ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అంచనాలను సమగ్రంగా సిద్ధం చేసి బడ్జెట్‌లో ప్రతిపాదించాలని అధికారులకు సూచించారు. అవసరమైన నిధుల వివరాలను ముందుగానే ప్రభుత్వానికి సమర్పించి ఆమోదం పొందాలని తెలిపారు. మార్చిలో మంత్రివర్గ సమావేశం నిర్వహించి పెండింగ్‌లో ఉన్న అంచనాలకు ఆమోదం తెలుపుతామని వెల్లడించారు. ప్రాజెక్టు >>2



## తగ్గనున్న వంటనూనె ధరలు

ముడి నూనెలపై దిగుమతి సుంకం 10% తగ్గింపు

మే 31 నుంచి అమలులోకి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:** దేశీయ అవసరాలకు గాను దిగుమతి చేసుకుంటున్న వంటనూనెలపై దిగుమతి సుంకాలను ప్రస్తుతం ఉన్న 20 శాతంనుంచి పదిశాతానికి తగ్గించాలని కేంద్రం నిర్ణయించింది. బేసిక్ కస్టమ్స్ డ్యూటీ ని వంటనూనెలు అంటే పామాయిల్, సోయాబీన్, సన్‌ఫ్లవర్ వంటి ముడినూనెలపై ఈ సుంకాలు తగ్గిస్తోంది. తగ్గించిన సుంకాలు వెంటనే అమలులోకి వస్తాయని అంచనా. వ్యవసాయ మౌలికవసరుల అభివృద్ధి సెస్‌కింద, >>2

# దేశం పరువు తీయొద్దు





ఆదివారం మీరట్‌లో నమోభారత్ రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రధాని మోడీ

ఎఐ సదస్సులో కాంగ్రెస్ మురికి రాజకీయాలు

కాంగ్రెస్ పార్టీ సైద్ధాంతికంగా దివాలా తీసింది

సీటు ఆక్రమించుకోండంటూ మహిళా ఎంపీలను పంపినంత మాత్రాన మీరు ప్రధాని కాలేరు..

రాహుల్‌పై ప్రధాని మోడీ ఘాటు విమర్శలు

కాంగ్రెస్‌ను విమర్శించిన ఇండియా కూటమి భాగస్వాములకు మోడీ ధన్యవాదాలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:** కృత్రిమ మేధ భవిష్యత్తుపై ప్రపంచ స్థాయి చర్చలు జరుగుతున్న వేదికను కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తమ రాజకీయ నిరసనలకు వేదికగా మార్చుకున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అంతర్జాతీయ ప్రతినిధులు, టెక్ దిగ్గజాలు పాల్గొన్న ఈ సదస్సులో కాంగ్రెస్ కార్యకర్తలు షర్ట్‌లెస్ (చొక్కాలు లేకుండా) నిరసనలు చేపట్టడంపై మోడీ అసహనం వ్యక్తం చేశారు. ప్రపంచం ముందు దేశం పరువు తీస్తున్నారని, భారతదేశం గ్లోబల్ టెక్ హబ్‌గా ఎదుగుతున్న తరుణంలో, ఇటువంటి చర్యలు దేశ ప్రతిష్ఠను దిగజార్చుతాయని ఆయన మండిపడ్డారు. సదస్సును కాంగ్రెస్ తన మురికి రాజకీయాలకు వాడుకుందని ప్రధాని మోదీ విమర్శించారు. ప్రపంచం మొత్తం భారతదేశం వైపు ఆశగా చూస్తోందని, మన యువత మేధస్సును చూసి గర్విస్తోందని ప్రధాని మోడీ చెప్పారు. కానీ >>2

**ఎఐ సదస్సులో ఆ రెండు ఆవిష్కరణలు ప్రపంచ నేతలను ఆశ్చర్యపరిచాయి** 5

**జంతువుల చికిత్సకు, పురాతన గ్రంధాల సంరక్షణ కోసం ఎఐ వినియోగం.. మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీ**

సిఎం రేవంత్‌కు 'హార్వర్డ్' ఆహ్వానం 2

**మార్చి 27న ఎఐ సింపోజియంలో సిఎం ప్రసంగించాలంటూ వినతి**

## నేడు రాష్ట్ర కేబినెట్ సమావేశం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి22:** రాష్ట్ర మంత్రివర్గం సోమవారం సచివాలయంలో సమావేశం కానుంది, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సాయంత్రం 3 గంటలకు కేబినెట్ సమావేశం కానుంది. మంత్రివర్గ భేటీలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు, శాఖలవారీగా బడ్జెట్ కేటాయింపులు, కొత్త పథకాల అమలుపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అదేవిధంగా జీహెచ్‌ఎంసీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు, రైతు భరోసా నిధులు విడుదల తదితర అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.



ఆదివారం కామారెడ్డి బయలుదేరిన బిజెపి రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావును హైదరాబాద్‌లో అరెస్టుచేసి తరలిస్తున్న పోలీసులు

కామారెడ్డి ఘర్షణల ఎఫెక్ట్:
## రాంచందర్‌రావు అరెస్టు

**బాన్సువాడ వెళ్తుండగా హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని బొల్లారం పిఎస్‌కు తరలించిన పోలీసులు**

రాష్ట్రవ్యాప్తంగా బిజెపి నేతల గృహనిర్బంధం

**అరెస్టులను తప్పుపట్టిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి22:** తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావును పోలీసులు ఆదివారం హౌస్ అరెస్ట్ చేశారు. కామారెడ్డిలో నిన్న బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తీవ్ర ఘర్షణలు చెలరేగిన నేపథ్యంలో, ఆయన అక్కడికి వెళ్లకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. బాధితులను పరామర్శించేందుకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి కామారెడ్డి, బాన్సువాడ పర్యటనకు ఆయన సిద్ధమవుతున్న సమయంలో ఇంటి వద్దే నిర్బంధించారు. శనివారం కామారెడ్డిలో భూవివాదానికి సంబంధించిన ఆరోపణలు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. స్థానిక బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిపై కాంగ్రెస్ నేత, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ భూకబ్జా ఆరోపణలు చేయడంతో వివాదం మొదలైంది. ఈ ఆరోపణలను నిరూపించాలంటూ ఎమ్మెల్యే సవాల్ విసరడంతో ఇరు పార్టీల కార్యకర్తలు పోటాపోటీగా నిరసనలకు దిగారు. ఈ క్రమంలో బీజేపీ ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు కాంగ్రెస్ శ్రేణులు చేరుకోవడంతో ఘర్షణ చెలరేగింది. ఆగ్రహించిన బీజేపీ >>2

## చంద్రబాబుకు మేమెందుకు సహకరిస్తాం

మాపై ఆరోపణలు చేస్తే అసెంబ్లీలోనే సమాధానం చెప్పినం: సిఎం రేవంత్‌రెడ్డి



ఆదివారం దేవాదుల వద్ద మీడియాతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 22:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబుకు >>2

కొత్త పాలసీపై రాష్ట్ర సర్కార్ కసరత్తు

విధివిధానాలు రూపొందిస్తున్న అధికారులు

జోన్ పరిమితులు లేకుండా కన్వర్షన్, బయో కన్వర్షన్ కమర్షియల్ ఇండస్ట్రియల్ జోన్లలో అనుమతులు

## ఫాంహౌస్‌లకు పర్మిషన్ తప్పనిసరి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి22:** హైదరాబాద్ నగరం చుట్టుపక్కల వేల సంఖ్యలో ఫాంహౌస్‌లు ఉన్నాయి. కొన్ని చాలా ఏళ్ల క్రితమే నిర్మితం కాగా.. మరికొన్ని ఇటీవలి కాలంలో పుట్టుకొచ్చాయి. రాష్ట్రంలో ఫాంహౌస్‌ల నిర్మాణానికి పర్మిషన్లు, విధి విధానాలు అంటూ ప్రత్యేకంగా ఏమీ లేవు. ఈ నేపథ్యంలోనే దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలోనే ఫాంహౌస్ నిర్మాణాలకు ప్రత్యేక విధానాన్ని తీసుకు వచ్చేందుకు సిద్ధమైంది. ఇప్పటివరకు ఫాంహౌస్‌లను నిర్మించుకునేందుకు ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో అడ్డగోలుగా నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే సమగ్ర ఫాంహౌస్ పాలసీని తీసుకువచ్చి.. వాటిపై నియంత్రణ తీసుకురావడంతో పాటు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధిని సాధించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి సంబంధించి విధివిధానాలు, ఫీజులు, అభివృద్ధి ఛార్జీలపై సంబంధిత అధికారులు కసరత్తులు ప్రారంభించారు. జోన్ పరిమితులు లేకుండా.. కన్వర్షన్, బయో కన్వర్షన్, కమర్షియల్, ఇండస్ట్రియల్ జోన్లలో కూడా ఫాంహౌస్‌లకు అనుమతులు ఇవ్వాలని సర్కార్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ఉన్న విధానాలను అధ్యయనం చేసి ఆ తర్వాత వీటికి సంబంధించి విధివిధానాలను ఫైనల్ చేయనున్నారు. ఈ ఫాంహౌస్ పాలసీ అమలుతో రాష్ట్ర ప్రభుత్వానికి నిర్మాణం, అభివృద్ధిఫీజుల రూపంలో ఆదాయం పెరగనుందని సమాచారం. కరోనా మహమ్మారి తర్వాత ఫాంహౌస్‌లకు వెళ్లడంపై మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి కుటుంబాలు బాగాఆసక్తి చూపిస్తున్నాయి. వీకెండ్ సేద తీరేందుకు ఫాంహౌస్‌లను వెళ్లే వారి సంఖ్యభారీగా పెరిగింది. అయితే >>2



ఆదివారం మీరట్‌లో నమోభారత్ రైలును ప్రారంభించిన అనంతరం విద్యార్థులతో కలిసి రైలులో ప్రయాణించిన ప్రధాని మోడీ

# దేశం పరువు తీయొద్దు

>> విపక్షాలు మాత్రం ఇలాంటి గొప్ప వేదికలపై బాధ్యతారహితంగా వ్యవహరిస్తూ దేశ అభివృద్ధికి అడ్డుపడుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. ఎఐ వల్ల ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటాయని, లేదా నిర్దిష్ట అంశాలను లేవనెత్తుతూ కాంగ్రెస్‌శ్రేణులు చొక్కాలు తీసి వినూత్న నిరసనకు దిగాయి. అయితే, టెక్నాలజీ సదస్సులో ఇటువంటి ప్రదర్శనలు అప్రస్తుతమని బీజేపీ వర్గాలు వాదిస్తున్నాయి. ఈ సమ్మిట్ కేవలం ఒక సమావేశం కాదని,ఇది భారతదేశాన్ని ఎఐక్యాపిటల్‌గా నిలబెట్టే ప్రయత్నమని బీజేపీనేతలు, ప్రభుత్వపెద్దలు అంటున్నారు. వేలకోట్ల పెట్టుబడులను ఆకర్షించే మార్గం ఇదని భవిష్యత్తు తరాలకు ఉపాధి కల్పించే దిశగా వేసిన అడుగు అనివాళ్లు చెప్పుకొస్తున్నారు.ఇలాంటివేదికల్లో భారత పరువు నిలపాల్సిన ప్రతిపక్షాలు, విశ్వవేదికల సాక్షిగా స్వదేశపరువు తీసుకోవడం విడ్డూరంగా ఉందని బీజేపీ తీవ్రంగా ఆక్షేపించింది.

# రాంచందర్‌రావు అరెస్టు

>> కార్యకర్తలు కాంగ్రెస్ నేత కారును ధ్వంసం చేసి, దాడికి పాల్పడ్డారు.పరిస్థితి చేయిదాటడంతో పోలీసులు రంగప్రవేశం చేసి, లాఠీఛార్జ్ చేసి గుంపును చెదరగొట్టారు. ఇరువర్గాలకు చెందిన పలువురిని అరెస్టు చేయడంతో పాటు, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని కూడా హౌస్ అరెస్ట్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో రాంచందర్ రావు పర్యటన ఉద్రిక్తతలను మరింత పెంచుతుందని భావించిన పోలీసులు, ఆయన్ను హైదరాబాద్‌లోనే హౌస్ అరెస్టు చేశారు. ఈ ఘటనపై బీజేపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తర్వాత రాచందర్‌రావు హౌస్ అరెస్ట్‌ను కాదని కామారెడ్డి వెళ్లేందుకు బయటకు వచ్చారు. ఆయన కామారెడ్డి బయలుదేరుతుండగా రామచందర్ రావును పోలీసులు మరోసారి అరెస్ట్ చేశారు. తార్నాకలోని ఆయన నివాసం వద్ద పోలీసులు అరెస్ట్ చేసి స్థానిక పిఎస్‌కు తరలించారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో రెండు వర్గాల మధ్య ఇటీవల ఘర్షణ జరిగింది. ఈ ఘటన నేపథ్యంలో అక్కడికి వెళ్లేందుకు రామచందర్ రావు యత్నించగా.. పోలీసులు మొదట గృహ నిర్బంధం చేశారు. అయినా కూడా ఆయన బయల్దేరడంతో అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా రామచందర్ రావు నివాసం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు, బిజెపి కార్యకర్తల మధ్య తోపురాట జరిగింది. పలువురు బిజెపి కార్యకర్తలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదే విధంగా రాష్ట్రంలో పలువురు బిజెపి నేతలను ఎక్కడికక్కడ హౌస్ అరెస్ట్ చేశారు. పలువురు బిజెపి నేతలు కామారెడ్డి వెళ్లేందుకు యత్నాలు చేశారు.

**రాంచందర్‌రావు అరెస్టును ఖండించిన మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్**

బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావును అక్రమ అరెస్టు చేయడాన్ని ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్ తీవ్రంగా ఖండించారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాన్సువాడకు బయలుదేరిన సందర్భంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావుని పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి బొల్లారం పోలీసుస్టేషన్‌కు తరలించడాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. శాంతియుతంగా బాన్సువాడ వెళ్లి, బిజెపి ఎమ్మెల్యేపై జరిగిన దాడిని ఖండిస్తూ సంఘీభావం తెలపాలన్న ఉద్దేశంతో బయలుదేరిన రాష్ట్ర అధ్యక్షుడిని అడ్డుకుని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యంపై కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ప్రత్యక్ష దాడి అన్నారు. దాడులు చేసిన కాంగ్రెస్ నేతలను వదిలేసి, బాధితుల పక్షాన నిలిచిన బిజెపి నాయకులను టార్గెట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ పక్షపాత, నిర్బంధకాండకు నిదర్శనం అన్నారు. అక్రమ అరెస్టులు, హౌస్ అరెస్టులతో భయపెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నా, బిజెపి ప్రజాస్వామ్య పోరాటం ఆగదు. ఈ అక్రమ చర్యలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పక తప్పదన్నారు.

# మేమెందుకు సహకరిస్తాం

>> తాము సహరిస్తున్నామని బీఆర్ఎస్ నేతలు చౌకబారు విమర్శలు చేయొద్దని హితవు పలికారు. అక్కడ సెటిల్ అయిన వారికి తామెందుకు సహకరిస్తామని ప్రశ్నించారు. ఆదివారం ములుగు జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించి, పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. తుపాకులగూడెం దేవాదుల ప్రాజెక్టుని సందర్శించారు. దేవాదుల పనుల పురోగతిపై అధికారులతో సీఎం రేవంత్ రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. పక్క రాష్ట్రాల వారితో చర్చించి తెలంగాణ నీటి హక్కులు కాపాడుకుంటామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతలు విలువైన సూచనలిస్తే స్వీకరిస్తామని చెప్పుకొచ్చారు. ఓటేయకపోవడం ప్రజలదే తప్పు అన్నట్లుగా బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. గోదావరి నది జలాలపై అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చిద్దామన్నారు. ప్రాజెక్టులు పూర్తి చేద్దామంటే నిధుల కొరత వచ్చిందని ప్రస్తావించారు. రాబోయే రెండేళ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని తెలిపారు. త్వరలోనే అన్ని నిధులనూ విడుదల చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేవాదుల ప్రాజెక్టు 2001లో రూ.6వేల అంచనాతో మొదలై.. రూ.18,500 కోట్లకు అంచనాలు పెరిగాయని తెలిపారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం మహా అద్భుతం అన్నారని.. తాము వచ్చినప్పటి నుంచి ఒక్క చుక్క ఎత్తిపోయలేదని చెప్పుకొచ్చారు. అయినా దేశంలోనే అత్యధిక వరి ఉత్పత్తి జరిగిందని అన్నారు. ప్రాజెక్టులు, నీళ్లపై అసెంబ్లీలో చర్చకు సిద్ధమని తెలిపారు. బీఆర్ఎస్ నేతలంతా జ్ఞానవంతులమని తాము చెప్పడం లేదని.. మీరు సూచనలు చేస్తే తీసుకుంటామని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును వదిలేయకుండా ఉపయోగంలోకి తెస్తామని స్పష్టం చేశారు. ఒక్క కాళేశ్వరం పైనే రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టులను గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికే తమపై ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహించారు. గోదావరి జలాల వివాదం రాజకీయరంగు పులుముకుందని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కృష్ణా జలాల తరలింపు అంశంపై అసెంబ్లీలో క్లారిటీ ఇచ్చామని పేర్కొన్నారు..కేసీఆర్ హయాంలో ప్రాజెక్టులు పూర్తిచేసి ఉంటే.. వివాదాలే ఉండేవి కావని చెప్పుకొచ్చారు. 960 టీఎంసీలకు సరిపడా ప్రాజెక్టులు పూర్తిచేసి ఉంటే సమస్యే ఉండేది కాదని తెలిపారు. ప్రాజెక్టులు పూర్తిచేసి తెలంగాణను సస్యశ్యామలం చేస్తామని స్పష్టం చేశారు. రూ.6 వేల కోట్ల అంచనాతో ప్రారంభించిన దేవాదుల.. ఇవాళ రూ.18 వేల కోట్ల వ్యయానికి చేరిందన్నారు. ప్రాజెక్టుల కోసం భూసేకరణకు నిధుల కొరత ఉందన్నారు. భూ సేకరణ కోసం నిధులు వెతుక్కునే పరిస్థితి వచ్చిందని తెలిపారు. రెండు, మూడేళ్లలో ప్రాజెక్టులు పూర్తి చేసేలా కృషి చేస్తామని అన్నారు. జూన్ 2వ తేదీ లోపల భూసేకరణ కోసం రూ.600 కోట్లు మంజూరు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

## పర్మిషన్ తప్పనిసరి

>> ప్రస్తుతం 100, 200 గజాల్లో కూడా ఫాంహౌస్‌లు నిర్మిస్తున్నారు. ఇలా చిన్న చిన్న స్థలాల్లో ఫాంహౌస్ నిర్మించి.. ఆ భూములను గుంటల లెక్కన రిజిస్ట్రేషన్లు చేస్తూ అక్రమాలకు తెరతీస్తున్నారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా అనుమతుల వ్యవస్థ స్పష్టంగా లేకపోవడంతో బిల్డర్లు ఇష్టం వచ్చినట్లు నిర్మాణాలు చేపడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్ నగరం బయట మొయినాబాద్, చేవెళ్ల, శంషాబాద్, శంకర్‌పల్లి, కందుకూరు, ఘట్‌కేసర్, మేడ్చల్ ప్రాంతాల్లో భారీగా ఫాంహౌస్ లేఅవుట్లు పుట్టుకొస్తున్నాయి. చట్టపరంగా మాత్రం ఆ భూములు ఇప్పటికీ వ్యవసాయ భూములుగానే పరిగణించడం గమనార్హం. కొత్తగా తీసుకొచ్చే పాలసీ ప్రకారం తక్కువలో తక్కువగా ఫాంహౌస్ నిర్మించాలంటే 1,200 చదరపు గజాల స్థలం ఉండాలి.ఆ ఫాంహౌస్‌కు కనీసం 30 అడుగుల వెడల్పైన రోడ్డు తప్పనిసరిగా ఉండాలి.మొత్తం స్థలంలో కేవలం 20 శాతం మాత్రమే కాంక్రీట్ నిర్మాణానికి అనుమతి ఉంటుంది. 1,200 చదరపు గజాల స్థలంలో 240 గజాల విస్తీర్ణంలో జీ ప్లస్ వన్ బిల్డింగ్ నిర్మించవచ్చు. మిగిలిన భూమిని పండ్ల తోటలు, కూరగాయల సాగుకు ఉపయోగించాలి. భవనం ఎత్తు 6 మీటర్లకు మించకూడదు. ఫాంహౌస్‌లు నిర్మించడం చట్టబద్ధం చేయడంతో పాటు అక్రమాలకు అడ్డుకట్ట వేయడం, ఆదాయాన్ని పెంచుకోవడం, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడమే ఈ కొత్త పాలసీ లక్ష్యంగా సర్కార్ అడుగులు వేస్తున్నట్లు సమాచారం.

## వంటనూనె ధరలు

>> సాంఘిక సంక్షేమ సర్‌ఛార్జి మొత్తం దిగుమతి సుంకాలు ఇప్పటివరకూ 27.5 శాతంగా ఉన్నాయి. ఇకపై 16.5శాతంగా ఉంటాయని తేలింది. పసుపు బఠాణీలు, శెనగల పైనా కూడా దిగుమతిసుంకాలు విధించి స్థానిక రైతులకు మేలుచేసేవిధంగా నిర్ణయించింది. కేంద్ర బడ్జెట్‌లో ఈ అన్ని ఉత్పత్తులను తగ్గిస్తామని కూడా ప్రకటించారు. వ్యక్తిగత అవసరాలకు వినియోగించే అన్ని వనరులపైనా దిగుమతి సుంకాలు 20 నుంచి 10శాతానికి తగ్గించనున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తన బడ్జెట్‌ప్రసంగంలో తెలిపిన సంగతి తెలిసిందే. పునర్వ్యవస్థీకరించిన సుంకాలన్నీ కూడా వచ్చే మేనెల ఒకటవ తేదీనుంచి అమలులోకి వస్తాయని కేంద్రంప్రకటించింది. ఇప్పటివరకూ ఈ బఠాణీలపై 30శాతంసుంకాలు విధించింది. ఇపుడు తగ్గిస్తున్న సుంకాలు దిగుమతి వ్యాపారులకు మేలుచేస్తాయని పేర్కొంటున్నారు. పప్పుదినుసులు ఎక్కువగా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లలో పండిస్తుంటారు. ఈ సుంకాలప్రభావం రైతులపైనా ఉంటుందని అంచనా.

## వారం - వర్జ్యం

23-02-2026, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శతభిషం కార్తె
షష్ఠి ఉ.9.09
భరణి సా.4.32
వర్జ్యం : రా.3.49-తె.5.20
దు.ము.12.45-1.32,
2) ము.3.06-3.53
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ప్రతి విషయంలోనూ గోప్యంగా వ్యవహరించే మీ వైఖరికి భిన్నంగా ఈరోజు ఒక కార్యక్రమాన్ని అత్యంత ఆర్భాటంగా ప్రారంభిస్తారు.

**వృషభం:**వ్యాపార పరంగా మీ వ్యూహాలు అంచనాలు మీరు ఊహించిన విధంగా వుంటాయి. కుటుంబ సమస్యలు తీరుతాయి.

**మిథునం:** పనులలో ఆటంకాలు ఎదురై చికాకు కలించవచ్చు. పట్టుదలతో ముఖ్యమైన వ్యవహారాలు పూర్తిచేస్తారు.

**కర్కాటకం:**ఆలోచనలు మాత్రం స్థిరంగా ఉండవు. గృహ, స్థలం కొనుగోలు యత్నాలను వాయిదావేస్తారు. ఋణ వత్తిడులు.

**సింహం:**పండితులు, ప్రముఖులు కలుస్తారు. టెండర్స్, కాంట్రాక్ట్స్ వర్క్ ఆర్డర్స్ లాభదాయకంగా వుంటాయి. సోదరుల కలయిక.

**కన్య :** మీ ప్రవర్తనలో గానీ, వ్యవహారాలలో గానీ దాపరికం, ఏకాంత మవసరం. ఒక వ్యవహారంలో మర్మంగా వ్యవహరిస్తారు.

**తుల :** ఋణాలు ఇవ్వటం తీసుకోవటం వంటి లావాదేవీలు జరపకండి. సంతాన విషయంలో కొంత మానసిక ఆందోళనకు గురవుతారు.

**వృశ్చికం:**మీ కుటుంబ వ్యవహారాలలో అతిగా జోక్యం చేసుకునే వారిని ఆదిలోనే త్రుంచివేయండి.క్రయ విక్రయాలలో లాభాలు.

**ధనుస్సు:** తామరాకు మీద నీటి బిందువు లాగా ఉండటంవలన లాభ పడతారు. కారణం లేని చికాకులు ఎదురు అవుతాయి.

**మకరం:** రహస్య విరోధులపై విచారణలు, అభియోగాలు సంభవం. ఉమ్మడిగా సాగించే కృషికి ప్రతిఫలం లభిస్తుంది.

**కుంభం:** ఉద్యోగ పారిశ్రామిక రంగాలలో కొన్ని చిక్కులు ఎదురవుతాయి. ఆత్మీయులతో విహారయాత్రలు చేస్తారు.

**మీనం :** రావలసిన మొత్తాలు, క్లయిములు చెల్లించవలసిన పద్దులు పరిష్కారమవుతాయి. మీ కృషి ఫలిస్తుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ లొంగుబాటు

>> సంప్రదింపులు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్న వేళ ఆసిఫా బాద్ అటవీ ప్రాంతంలో తెలంగాణ పోలీసుల ఎదుట ఆయుధాలతో లొంగిపోయినట్లు సమాచారం. అయితే వీరి లొంగుబాటును తెలంగాణ పోలీ సులు ధృవీకరించక పోగా ఛత్తీస్‌ఘడ్ డిప్యూటీ సిఎం విజయ్ వర్మ ధృవీకరించడం గమనార్హం. కాగా లొంగిపోయిన మావోయిస్టులను సోమవారం హైదరాబాద్‌లో మీడియా ఎదుట ప్రవేశపెట్టనున్నారని తెలిసింది. మరోవైపు దేవ్‌జీ లొంగుబాటుపై సోదరుడి కుమార్తె సుమ బావోద్వేగంతో కూడిన లేఖను మీడియాకు విడుదల చేశారు. మావోయిస్టుల లొంగుబాట్లు కొనసాగుతూనే వున్నాయి. ఇప్పటికే ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఎపిలతో పాటు తెలంగాణలో పదుల స ంఖ్యలో నక్సలైట్లు ఆయుధాలతో లొంగిపోతుండడం తెలిసిందే. ఈ ఏడాది మార్చి ఆఖరుకు దేశంలో నక్సలైట్లు లేకుండా చేయడం లక్ష్యంగా ఎం చుకున్నట్లు కేంద్రం ప్రకటించి అందుకు అనుగుణంగా నక్సల్స్‌కు పట్టున్న ఛత్తీస్‌ఘడ్‌లో వేల సంఖ్యలో కేంద్ర బలగాలతో కూంబింగ్ నిర్వహిస్తుండ డం విదితమే. ఈ క్రమంలో ఛత్తీస్‌ఘడ్‌తో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లతో పాటు ఎపిలోనూ ఎన్‌కౌంటర్లు జరిగి పదుల సంఖ్యలో నక్సలైట్లు మరణించారు. ఇదే సమయంలో రెండు వేల మంది వరకు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో అగ్రనేతలు పలువురు వుండగా ఎన్‌కౌంటర్లో మరణించిన వారిలో హిడ్మా సహా పలువురు కీలక నేతలున్నారు. అజ్ఞాతంలో వున్న నక్సలైట్ల కోసం కేంద్ర బలగాలతో పాటు ఆయా రాష్ట్రాల పోలీ సులు గాలింపు జరుపుతున్న వేళ మావోయిస్టు పార్టీలో మిగిలిన ఐదారు మంది అగ్రనేతలు దేవ్‌జీ, రాజిరెడ్డి, నర్సింహా రెడ్డి తదితరులు లొంగిపో యేందుకు సిద్దంగా వున్నారని, ఇందుకోసం మధ్యవర్తులతో మాట్లాడుతున్నట్లు వారం రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఒక దశలో వీరంతా హైదరా బాద్‌లో లొంగిపోయారని ప్రచారం జరిగింది. అయితే వీరంతా ఆసిఫాబాద్ అడవుల్లో తెలంగాణ పోలీసులకు లొంగిపోయారని తెలిసింది. రెండు నెలల క్రితం ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన 40 మంది నక్సలైట్లు ఆసిఫాబాద్ అడవుల్లో తెలంగాణ పోలీసులకు లొంగిపోవడం తెలిసిందే. వీరంతా ఛత్తీస్ ఘడ్ నుంచి ఆసిఫాబాద్ అడవుల్లో రాగా ఇక్కడి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు స్థానికులు తెలిపారు. అయితే వీరంతా లొంగిపోయారని మ రుసటి రోజు డిజిపి కార్యాలయంలో మీడియా సమావేశంలో డిజిపి సహా ఇతర ఉన్నతాధికారులు తెలిపారు.

తాజా లొంగుబాటు కూడా ఇదే తర హాలో జరిగిందని సమాచారం. వీరి లొంగుబాటులో ఛత్తీస్‌ఘడ్ కోబ్రా దళం అధికారులు తెలంగాణ పోలీసులకు సహకరించినట్లు తెలిసింది. కాగా లొంగిపోయిన నక్సలైట్లలో పలువురు అనారోగ్యంతో వుండడంతో ఆదిలాబాద్‌లో ఓ రహస్య ప్రాంతంలో వుంచి, వైద్యం, ఆహారం అందిస్తున్నట్లు తెలిసింది. వీరు కోలుకున్న తరువాత సోమవారం నాడు హైదరాబాద్‌లో మీడియా ఎదుట ప్రవేశపెట్టే వీలుందని తెలిసింది. కాగా దేవ్‌జీ స్వస్థలం జగిత్యాల జిల్లా కోరుట్ల. తెలంగాణలో నక్సల్స్ ఉద్యమంలో ఆయన అనేక హోదాలో పనిచేశారు. పార్టీ కార్యదర్శిగా వున్న నంబాళ్ల కేశవరావు ఎ దురు కాల్పుల్లో చనిపోయాక దేవ్‌జీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా నియమితులయ్యారు. మరోవైపు అజ్ఞాతంలో వున్న నక్స లైట్లు వెంటనే లొంగిపోవా లని డిజిపి శివధర్ రెడ్డి కోరడం తెలిసిందే. రెండేళ్ల కాలంలో 588 మంది నక్సలైట్లు లొంగిపోయారని ఆయన తెలిపారు.

**ధృవీకరించని తెలంగాణ పోలీసులు...ఇది నిజమేనని ఛత్తీస్‌ఘడ్ డిప్యూటీ సిఎం వెల్లడి**

కాగా,మావోయిస్టు పార్టీ కార్యదర్శి దేవ్‌జీ సహా ఇతర అగ్రనేతలు లొంగిపోవడంపై తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులు ధృవీకరించడ ం లేదు. ఇదంతా అవాస్తవమని వారు చెబుతున్నారు. అయితే ఛత్తీస్‌ఘడ్ డిప్యూటీ సిఎం విజయ్ వర్మ మాత్రం మావోయిస్టు పార్టీ కార్యదర్శి దేవ్‌జీ సహా ఇతర అగ్రనేతలు లొంగిపోవడం నిజమేనని తెలిపారు. వారంతా తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తమకు సమాచారం వుందని రాయ్‌పూర్‌లో ఆదివారం నాడు మీడియాతో మాట్లాడుతూ ఆయన తెలిపారు. మావోయిస్టుల ఏరివేతలో ఇది కీలక ముందడుగుగా ఆయన అభివర్ణించారు. నక్సలైట్లు ఎక్కడ లొంగిపోయినా ఒకటేనని ఆయన తెలిపారు. వచ్చే మార్చి నెలాఖరుకు నక్సలైట్లను ఏరివేస్తామన్న కేంద్ర లక్ష్యం క చ్చితంగా నెరవేరుతుందని ఆయన తెలిపారు.

**దేవ్‌జీ లొంగుబాటుపై సోదరుడి కుమార్తె బావోద్వేగ పోస్ట్**

ఇదిలావుండగా మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ లొంగపోయారన్న వార్తపై ఆయన సోదరుడి కుమార్తె సుమ ఆదివారం నాడు సోషల్ మీడియాలో బావోద్వేగంతో కూడిన పోస్ట్ వుంచడంతో పాటు మీడియాకు లేఖ విడుదల చేశారు. దేవ్‌జీ రాకకోసం తమ కుటుంబం ఎంతో కాలంగా ఎదురు చూ స్తుందని, ఇది దశాబ్దాల నిరీక్షణగా ఆమె తెలిపారు. తన కొడుకు ఎప్పటికైనా తిరిగి రావాలని వృద్ధ తల్లిదండ్రుల ఆశ అని సుమా తెలిపారు. దేవ్‌జీ తనకు అన్న అవుతాడని, ఇప్పటి వరకు తాను సోదరుడిని చూడలేదని, ఆయనను చూసేందుకు ఆసక్తిగా వున్నానని సుమా తెలిపారు.

దేవ్‌జీ మాకు కొండంత ధైర్యమని ఆమె వెల్లడించారు. దేవ్‌జీ ఇష్ట పూర్వకంగా లొంగిపోతే ఎంతో సంతోషకరమని ఆమె తెలిపారు. ఇంతకాలం అడవిబాట పట్టిన తన సోదరుడు జనజీవన స్రవంతిలోకి రావడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు ఆమె తెలిపారు.

# సిఎం రేవంత్‌కు హార్వర్డ్ వర్సిటీ ఆహ్వానం

### మార్చి 27న ఎఐ సింపోజియంలో సిఎం ప్రసంగించాలంటూ వినతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి22:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అమెరికాలోని హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ అరుదైన ఆహ్వానం అందింది. హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ తొలిసారిగా నిర్వహిస్తున్న ఏఐ పాలసీ సింపోజియంలో ప్రసంగించాలని నిర్వాహకులు ఆహ్వాన లేఖను పంపించారు. ఈ ఏడాది మార్చి 27న హార్వర్డ్ స్కూల్ క్యాంపస్‌లోనే ఈ కార్యక్రమం జరుగనుంది. భారత్ నుంచి తెలంగాణ ముఖ్యమంత్రి ఒక్కరే ఈ సింపోజియం ఆహ్వానం అందుకోవటం విశేషం. ఈ సింపోజియంలో 'ఏఐ యాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ కంప్యూట్ పవర్: ఇంపాక్ట్ ఆన్ లివబులిటీ అండ్ వర్క్‌ఫోర్స్' అనే ప్యానెల్‌లో ప్రసంగించాలని సీఎంను ఆహ్వానించారు. ఈ సెషన్‌లో డేటా సెంటర్లు, ఎనర్జీ సిస్టమ్స్, కంప్యూట్ కారిడార్స్ ప్రభావంపై ప్రధానంగా చర్చ జరగనుంది. ఏఐ ఎకోసిస్టమ్ అభివృద్ధి, ఏఐ సిటీ అభివృద్ధి లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, భూమి, విద్యుత్, నైపుణ్యాలు, నియంత్రణ, పెట్టుబడుల భాగస్వామ్యం వంటి అంశాలపై ప్రసంగించాలని సీఎంను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఇటీవల అమెరికా పర్యటనలో నిర్వాహకులు సీఎంను ప్రత్యేకంగా కలిసి సింపోజియంపై చర్చించారు. ప్రభుత్వం, పరిశ్రమ, అకాడమియా రంగాల ప్రముఖులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, ఏఐ పాలన, జియోపాలిటిక్స్, నాలెడ్జ్ ఎకానమీ, ఎనేబ్లింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అంశాలపై చర్చించేందుకు ఈ సింపోజియం నిర్వహిస్తున్నట్లు వివరించారు.



ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌తో భేటీ అయిన పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా కె శ్రీనాథ్ రెడ్డి, గవర్నింగ్ బోర్డు సభ్యుడు డాక్టర్ మధు మోహన్

## సిఎం రేవంత్‌ని కలిసిన పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాక అధ్యక్షుడు డాక్టర్ కె.శ్రీనాథ్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి22:** పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (హైదరాబాద్) వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మభూషణ్ డాక్టర్ కె శ్రీనాథ్ రెడ్డి, గవర్నింగ్ బోర్డు సభ్యుడు డాక్టర్ మధు మోహన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆదివారంనాడు మర్యాదపూర్వకంగా కలిశారు.

# నీటి ప్రాజెక్టులు ఆగొద్దు!

>> పరిధిలో పనిచేస్తున్న పంపులను అత్యవసరంగా మరమ్మతులు చేసి నెలరోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. సాగునీటి సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పంపుల మరమ్మతుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులకు స్పష్టం చేశారు.అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో కలిసి దేవాదుల ప్రాజెక్టుపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు పురోగతి, భూసేకరణ, నిధుల వినియోగం, సాంకేతిక అంశాలపై సమగ్రంగా చర్చించనున్నట్లు చెప్పారు.రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులకు భూసేకరణ వేగవంతం చేసేందుకు ప్రత్యేక కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. భూసేకరణ పరిహారం చెల్లింపులను వేగవంతం చేసేందుకు గ్రీన్ ఛానల్ విధానంలో నిధులు విడుదల చేస్తామని వెల్లడించారు. రైతులకు పరిహారం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భూసేకరణలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని, రైతులతో చర్చలు జరిపి పరస్పర అవగాహనతో ముందుకు సాగాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు.అదేవిధంగా రామప్ప చెరువు నుంచి జంపన్న వాగుకు నీరు అందించే ప్రణాళికపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ప్రణాళిక అమలైతే ఆయా ప్రాంతాల్లో సాగునీటి సౌకర్యాలు మెరుగుపడతాయని తెలిపారు.దేవాదుల ప్రాజెక్టు పూర్తయితే గిరిజన ప్రాంతాలతో పాటు రైతులకు పెద్దఎత్తున సాగునీటి సౌకర్యం లభిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రాజెక్టు పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేసి రైతులకు త్వరితగతిన ప్రయోజనం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి దేవాదుల ప్రాజెక్టును ఆదర్శంగా నిలపాలని సూచించారు.ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి దనసరి అనసూయ సీతక్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ బలరాం నాయక్, ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**లక్ష్మీపురం లిఫ్ట్ ఇరిగేషన్ పునరుద్ధరణ**

ములుగు జిల్లా అభివృద్ధికి సాగునీటి ప్రాజెక్టులు కీలకమని పేర్కొంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికు మంత్రి సీతక్క వినతిపత్రం సమర్పించారు. దేవాదుల పర్యటన సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క జిల్లాలో సాగునీటి సౌకర్యాల విస్తరణకు చర్యలు తీసుకోవాలని కోరారు.గోదావరి నది కుడి కాల్వపై కొత్త లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ఏర్పాటు చేయాలని, కన్నాయిగూడెం మండలంలోని లక్ష్మీపురం ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించేందుకు పరిపాలనా అనుమతి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తూపాకులగూడెం, దేవాదుల పరిసర గ్రామాల చెరువులకు నీరు అందించేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని తెలిపారు.ప్రస్తుతం నిలిచిపోయిన లక్ష్మీపురం ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించడంతో పాటు సమ్మక్క సాగర్ ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటర్ వద్ద గోదావరి బ్యాక్‌వాటర్‌ను వినియోగిస్తూ కొత్త లిఫ్ట్ పథకం అమలు చేయాలని ప్రతిపాదించారు.ఈ పథకం ద్వారా మొత్తం 921 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమవుతుందని తెలిపారు. సుమారు రూ.22 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ప్రణాళికను సీఎంకు అందజేశారు. లక్ష్మీపురం ఎత్తిపోతల పథకం 2007లో నిర్మాణం పూర్తయినప్పటికీ గోదావరి ప్రవాహ మార్పులు, ఇసుక పేరుకుపోవడం వల్ల ప్రస్తుతం వినియోగంలో లేకుండా పోయిందని వివరించారు. దాన్ని తిరిగి ఉపయోగంలోకి తీసుకురావడానికి మార్పులు చేయాలని కోరారు. ఈ పథకం అమలుతో చిన్న, సన్నకారు రైతులకు సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాల పునర్వ్యవస్థీకరణ, తాగునీటి లభ్యత పెంపు, రైతుల ఆర్థిక స్థితి మెరుగుదల సాధ్యమవుతుందని మంత్రి పేర్కొన్నారు. రైతుల సంక్షేమం దృష్ట్యా తక్షణమే పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో ఇరిగేషన్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఉగ్ర కుట్ర భగ్నం

### తమిళనాడులో ఆరుగురు, బెంగాల్‌లో మరో ఇద్దరు అరెస్టు

### అరెస్టయిన వారిలో బంగ్లాదేశ్ పౌరులు

### ఐఎస్ఐ, బంగ్లాదేశ్ లింకులు

### దర్యాప్తుకోసం ఢిల్లీకి తరలింపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీలో విధ్వంసం సృష్టించేందుకు పాక్ ఉగ్రవాద సంస్థ ఐఎస్ఐ సహకారంతో బంగ్లా ఉగ్రవాదులు పన్నిన కుట్రను ఢిల్లీ పోలీసులు భగ్నం చేశారు. ఈ సందర్భంగా తమిళనాడు, బెంగాల్‌లో నిర్వహించిన దాడుల్లో ఎనిమిది మంది ఉగ్రవాదులు అరెస్టయ్యారు. వీరిలో ఆరుగురు బంగ్లాదేశీయులు వుండగా ఇద్దరు స్థానికులు కావడం గమనార్హం. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సంద ర్భంగా ఢిల్లీలో ఖలీస్థాన్ ఉగ్రవాదులకు అనుకూలంగా, కాశ్మీర్ పాక్‌దేనంటూ ఢిల్లీలోని పలు మెట్రో స్టేషన్‌లలో రెచ్చగొట్టే విధంగా పోస్టర్లు వెలిశాయి. ఖలిస్తాన్ కోసం ఢిల్లీలో విధ్వంసం సృష్టిస్తామని అందులో వుండంతో దీనిపై వున్న కుట్రను చేధించేందుకు రంగంలో దిగిన ఢిల్లీ పోలీసులు మె ట్రో స్టేషన్లలో వున్న పోస్టర్లను స్వాధీనం చేసుకుని పరిశీలించగా ఇందులో పాక్ ఉగ్రవాదుల హస్తం వున్నట్లు తేలింది. పాక్ ఉగ్రవాద సంస్థ ఐఎస్ఐ సహకారంతో బంగ్లాకు చెందిన ఉగ్రమూకలు ఈ దాడులకు కుట్ర పన్నినట్లు తేలింది. వీరంతా తమిళ నాడు, బెంగాల్‌లో తలదాచుకున్నట్లు నిర్ధారణ అయ్యాక శనివారం రాత్రి ఢిల్లీ ప్రత్యేక బృందం పోలీసులు రెండు రాష్ట్రాలలో మెరుపుదాడులు నిర్వహించారు. తమిళనాడులోని తిరుప్పూరులో గల ఓ గార్మెంట్ పరిశ్రమలో పనిచేస్తున్న ఆరుగురు ఇందులో భాగస్వాములుగా తేలడంతో వారిని అరెస్టు చేశారు. వీరంతా పాక్‌కు అనుకూలంగా జీహా దిని ప్రోత్సహించడం, ఖలీస్తాన్‌కు మద్దతు తెలపడం చేస్తున్నట్లు తేలింది. పట్టుబడ్డ ఉగ్రవాదులను మిజనూర్ రహమాన్ (33), మహమ్మద్ సపెట్ (35), ఒమర్ (32), మహమ్మద్ లిటన్ (40), మహమ్మద్ జగీత్ (40), మహమ్మద్ ఉజల్ (29)గా గుర్తించారు.

వీరిని స్థానిక మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి పిటి వారంట్‌పై వెంటనే ఢిల్లీకి తరలించారు. వీరు బంగ్లాదేశీయులు కాగా బెంగాల్‌కు చెందిన ఇద్దరి సహకారంతో నకిలీ ఆధార్ కార్డు లు, ఐడి కార్డులతో భారతీయులుగా చలామణి అవుతూ తమిళ నాడులో ఉద్యోగం చేస్తున్నారు. వీరి వద్ద ఎనిమిది సెల్‌ఫోన్లతో నాటు 16 సిం కా ర్డులు, కొంత ఉగ్రవాద సాహిత్యం పట్టుబడింది. వీరికి సహకరించిన బెంగాల్‌కు చెందిన మరో ఇద్దరిని కూడా అరెస్టు చేశారు. బంగ్లాదేశీయులు ఎ ప్పటి నుంచి భారత్‌లో వుంటున్నారనే దానిపై విచారణ చేస్తున్నారు.

## ట్రంప్ రిసార్టులో కాల్పులు.. ఆగంతకుడు హతం

**ఫ్లోరిడా, ఫిబ్రవరి 22:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యాజమాన్యంలోని ఫ్లోరిడా రిసార్ట్ లో తీవ్ర కలకలం రేగింది. పామ్ బీచ్‌లోని ప్రఖ్యాత మార్‌ఎలాగో ఎస్టేట్‌లోకి షాట్‌గన్, ఇంధనం క్యాన్‌తో చొరబడేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్చి చంపారు. ఈ ఘటన గత అర్ధరాత్రి దాటాక 1:30 గంటల సమయంలో చోటుచేసుకుంది. మార్‌ఎలాగో రిసార్ట్ ఉత్తర గేటు నుంచి ఒక వాహనం బయటకు వస్తుండగా, అదే అదనుగా మరో వాహనంలో వచ్చిన ఆగంతకుడు లోపలికి ప్రవేశించాడు. అతని వద్ద షాట్‌గన్, ఇంధనంతో కూడిన క్యాన్ ఉండటాన్ని గమనించిన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు, పామ్ బీచ్ కౌంటీ షెరిఫ్ డిప్యూటీలు అతన్ని అడ్డుకున్నారు. ఆయుధాలు కింద పెట్టాలని ఆదేశించారు. ఆ వ్యక్తి ఇంధనం క్యాన్‌ను కింద పెట్టి, తన వద్ద ఉన్న షాట్‌గన్‌ను ఏజెంట్ల వైపు గురిపెట్టాడు. దీంతో అప్రమత్తమైన అధికారులు అతనిపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో అతను అక్కడికక్కడే మరణించినట్లు పామ్ బీచ్ కౌంటీ షెరిఫ్ రిక్ బ్రాడ్‌షా ధృవీకరించారు. ఈ ఘటనలో సిబ్బంది ఎవరికీ గాయాలు కాలేదు. మృతుడిని నార్త్ కరోలినాకు చెందిన 20 ఏళ్ల యువకుడిగా అనుమానిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం అతను కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఘటన జరిగిన సమయంలో ట్రంప్, ఆయన భార్య మెలానియా వైట్‌హౌస్‌లో ఉన్నారు. నిందితుడి ఉద్దేశం ఏమిటి, అతని మానసిక పరిస్థితిపై ఎఫ్‌బీఐ దర్యాప్తు చేస్తోంది. గతంలో 2024లో ట్రంప్‌పై రెండుసార్లు హత్యాయత్నాలు జరిగిన నేపథ్యంలో ఈ తాజా ఘటన భద్రతా వర్గాలను మరోసారి అప్రమత్తం చేసింది.



## ప్రజాస్వామ్యాన్ని అణచివేయాలనే చూస్తే జనమే తగిన సమాధానం చెప్తారు

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** ప్రజాస్వామ్యాన్ని అణచివేయాలనే చూస్తే ప్రజలే తగిన సమాధానం చెప్తారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో జరుగుతున్న పరిణామాలు తీవ్ర ఆందోళనకరంగా ఉన్నాయన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వం స్వయంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే, బిజెపి సీనియర్ నేత కాటిపల్లి వెంకటరమణారెడ్డిపై ఆధార రహితంగా ఆరోపణలు చేసి, ఆయన వాటిని నిరూపించాలని సవాల్ చేసిన వెంటనే హౌజ్ అరెస్టుకు పాల్పడటం ముమ్మాటికీ కక్షసాధింపు చర్యలే అన్నారు. అనవసర ఆరోపణలు చేయడం, వీటికి సమాధానం ఇవ్వమంటే అధికారాన్ని దుర్వినియోగం చేసి అరెస్టులకు దిగడం దౌర్భాగ్యకరం అన్నారు. అంతేకాకుండా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం గేటును కాంగ్రెస్ నాయకులు తమ కారుతో గుద్ది ధ్వంసం చేయడం, రాష్ట్రంలో శాంతిభద్రతల వైఫల్యానికి ఉదాహరణ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తున్నారని, ఎమ్మెల్యేకు సంఘీభావంగా కామారెడ్డికి వెళ్లేందుకు సిద్ధమైన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావుతో పాటు పలువురు ఎంపిలు, ఎమ్మెల్యేలను ఎక్కడికక్కడ హౌజ్ అరెస్టు చేయడం తెలంగాణలో అప్రకటిత అత్యవసర పరిస్థితిని తలపిస్తుందన్నారు. ఇది ప్రజాస్వామ్య హక్కులపై బహిరంగ దాడి అన్నారు.

**బిజెపి కార్యకర్తలు, హిందువులపై తప్పుడు కేసులు పెడితే సహించేది లేదు: పార్టీ రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు**

బిజెపి కార్యకర్తలు, హిందువులపై తప్పుడు కేసులు పెడితే సహించేది లేదు అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు స్పష్టం చేశారు. బాన్సువాడ ప్రజలకు, హిందూ సంఘాలకు నేను ఒకటే విజ్ఞప్తి చేస్తున్నాను, కామారెడ్డిలో బిజెపి ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డిపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేయడం, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అరాచకాలను తీవ్రంగా ఖండించాలన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన చర్య అన్నారు. బిజెపి ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డికి సంఘీభావం తెలియజేయడానికి నేను బయలుదేరగా, తనను అక్రమంగా అరెస్టు చేయడం అహంకారపూరితమైన, దుర్మార్గమైన చర్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంఐఎం చేతిలో బందీ అయింది. అసదుద్దీన్ ఓవైసి చెప్పినట్టుగా ప్రభుత్వం నడుస్తుందని, ఇటువంటి ప్రజావ్యతిరేక చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు. బిజెపి కార్యకర్తలు, నాయకులపై తప్పుడు కేసులు పెట్టాలని చూస్తే మేము ఊరుకునేది లేదన్నారు. పోలీసు ఉన్నతాధికారులు ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరించడం సరికాదని, వారు నిష్పాక్షి కంగా వ్యవహరించాలన్నారు. ప్రజలకు, కార్యకర్తలకు బిజెపి అండగా ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వం, ఎంఐఎం పార్టీ అరాచకాలను నిలదీస్తూనే ఉంటామన్నారు.

**సంఘీభావం తెలుపడం నేరమా?: ఎంపి డికె అరుణ**

సొంత పార్టీ ఎమ్మెల్యేలకు సంఘీభావం తెలిపేందుకు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు వెళ్ళడం నేరమా అని బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపి డికె అరుణ ప్రశ్నించారు. బిజెపిని అణిచివేసే కుటిల ప్రయత్నం అధికార కాంగ్రెస్ చేస్తుందని అన్నారు. బిజెపి నేతలను, కార్యకర్తలను అక్రమ అరెస్టులు చేసి, నిర్బంధించడం హేయమైన చర్యగా భావిస్తున్నాం అన్నారు.



## వరద కాలువలో తేలిన బిజెపి నేత కారు, ఆయన మృతదేహం!

### ఐదురోజుల క్రితం పెగడపల్లిలో మిస్సింగ్ కేసు నమోదు

**మల్యాల/ ప్రభాతవార్త:** మల్యాల క్రాస్ రోడ్డు సమీపంలోని ఎస్సారెస్పీ వరద కాలువలో ఆదివారం ఉదయం పెగడపల్లి మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన బిజెపి నాయకుడు తిరమని రమణారెడ్డి(50) బ్రెజ్జా కారు (టీజీ 21ఈ 5734)ప్రవాహంలో తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు ఆతికష్టం మీద క్రేన్ సహాయంతో కారును బయటకు తీయగా అందులో రమణ రెడ్డి మృతదేహం లభిం చింది. వరద కాలువలో నీటి ప్రవాహంలో కారు లోనే మృతదేహంతో బోల్తా పడి తేలి ఉండడం పలు అనుమానాలకు దారితీస్తుంది, వరద కాలువ ఇరువైపులా ఎక్కడ ప్రమాదం చోటుచేసుకున్న ఆనవాళ్లు కనిపించ లేదు, అయితే రమణారెడ్డి ఈనెల 18న సాయంత్రం ఇంటి నుండి బయలుదేరి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పెగడపల్లి పోలీస్ స్టేషన్లో కనిపించడం లేదని ఫిర్యాదు చేశారని తెలిసింది, అయితే రమణ రెడ్డి క్రిప్టోకరెన్సీ లోభారీ మొత్తంలో నష్టపోయినట్టు ప్రచారం జరుగుతుంది. ఈ నేపథ్యంలో రమణారెడ్డి కారు తో సహా వరద కాలువ నీటి మల్యాల సమీపంలో తేలడం పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి, కారు ఎక్కడి నుండి ప్రవాహంలో కొట్టుక వచ్చింది ?ఇది ప్రమాదవశాత్తూ జరిగిన సంఘటనా?,లేక హతమార్చి కాలువలో తోసేసారా? ఆత్మహత్య కు పాల్పడ్డారా? అనే సందేహాల వ్యక్తం అవుతున్నాయి, ఈ కోణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# రాష్ట్రానికి గ్రాంట్లలో కోత.. బడ్జెట్‌లోనైతే భారీ అంచనాలు

### వచ్చింది రూ.3899 కోట్లే!

### గత కొన్నేళ్లుగా తగ్గుతున్న గ్రాంట్ ఇన్ ఎయిడ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్రానికి గ్రాంట్ ఇన్‌ఎయిడ్ విడుదలలో కేంద్రం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోంది. గత నాలుగేళ్లుగా రాష్ట్రానికి రావాల్సిన గ్రాంట్ ఇన్ ఎయిడ్ నిధుల్లో కోత పడుతోంది. ఆర్థిక శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం ప్రస్తుత 2025-26 బడ్జెట్లో గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసిన మొత్తంలో ఇప్పటి వరకూ 18.49 శాతం మేర కేంద్రం నుండి సమకూరింది. ఈ విధంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ రూ.4,213 కోట్లు కేంద్రం నుండి రాష్ట్రానికి విడుదలైంది. 2024-25 వార్షిక అంచనా బడ్జెట్‌లో కేటాయించిన 21,636 కోట్ల రూపాయలతో పోలిస్తే, అక్టోబరు నెలాఖరు వరకు రాష్ట్రం కేవలం 3,899 కోట్ల రూపాయల మేర గ్రాంట్స్ ఇన్ ఎయిడ్‌ను అందుకుంది.

అదే 2023-24లో 41,259 కోట్ల రూపాయల బడ్జెట్ అంచనాకు వ్యతిరేకంగా 9,729 కోట్ల రూపాయలు, 2021-22లో బడ్జెట్‌లో 38,669 కోట్ల రూపాయలు వస్తుందని అంచనా వేయగా, కేవలం 8,619 కోట్ల రూపాయలు రాగా, ఇలా తగ్గిన కేటాయింపుల ఈ ధోరణి గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతోంది. బిజెపి లేదా దాని మిత్రపక్షాలు పరిపాలిస్తున్న రాష్ట్రాలు కేటాయింపులలో మెరుగ్గా ఉన్నాయనేది ఆర్థిక శాఖ వివరాలు స్పష్టం చేస్తున్నాయి. ఈనేపథ్యంలో 1,200 కోట్ల రూపాయలు, 1,600 కోట్ల రూపాయల మ్యాచింగ్ గ్రాంట్‌లను విడుదల చేయడంలో రాష్ట్రం జాప్యం చేయడం వల్ల రాష్ట్రం వివిధ పథకాల కింద 4 వేల కోట్ల రూపాయల నుండి 5 వేల కోట్ల రూపాయల మేర కేంద్ర నిధులను కోల్పోయే అవకాశం ఉంది. కీలకమైన గ్రాంట్లు, వాటి అమలు కోసం రాష్ట్రం 20-50 శాతం నిధులను అందించాలి.

అయితే వీటి గడువు పొడిగింపు కోసం వచ్చిన అభ్యర్థనలను కేంద్రం తిరస్కరించడంతో తెలంగాణ అభివృద్ధి ప్రాజెక్టులు ప్రమాదంలో పడ్డాయి. కాగా సీఎస్ఎస్ కింద 2022-23లో 5,387 కోట్ల రూపాయలు, 2023-24లో 6,158 కోట్ల రూపాయలు మాత్రమే తెలంగాణకు కేంద్రం నుంచి అందాయి. అయితే, రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 15,168 కోట్ల రూపాయల మేర కేటాయింపులు చేసింది. కేంద్రం తన వాటాను విడుదల చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఇంకా మ్యాచింగ్ గ్రాంట్‌లను విడుదల చేయలేదు. నిధులు అందుకోవడానికి రాష్ట్రం తన వాటాను మ్యాచింగ్ గ్రాంట్‌లలో అందించాలని కేంద్రం వైఖరి స్పష్టం చేస్తోంది. కాగా తగ్గుతున్న పన్నుల రాబడి, పెరుగుతున్న ఆర్థిక ఒత్తిళ్ల నేపథ్యంలో కేంద్రం నుండి కీలకమైన నిధులు రాకపోవడంతో రాష్ట్ర ఖజానా ఆర్థిక పరిస్థితి మరింత ఇబ్బందులు పాలవుతోంది.

# ఫెరారీ కారు.. డివైడర్ మీది నుంచి ఎగిరి..!

### జూబ్లీహిల్స్‌లో ఘోర ప్రమాదం.. అయిదుగురికి గాయాలు



ప్రమాదానికి కారణమైన ఫెరారీ కారు, ధ్వంసమైన కారు ముందుభాగం

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** అతివేగంతో అదుపుతప్పిన ఒక ఫెరారీ కారు డివైడర్ మీది నుంచి ఎగిరి అవతలి వైపు నుంచి వచ్చే వాహనాలను ఢీకొట్టిన సంఘటన జూబ్లీహిల్స్‌లో చోటుచేసుకొంది. ఈ సంఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకున్నా పలువురు గాయాలతో బయటపడ్డారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్‌లో నివసించే యువవ్యాపారి ఈమని క్రాంతిరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం 10.30 గంటల ప్రాంతంలో జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 45 మీదుగా ఫెరారీ కాలిఫోర్నియా టి కారులో కొండాపూర్ వైపు వెళ్తున్నారు. రోడ్ నంబరు 45లోని బాలకృష్ణ నివాసం వద్ద ఉన్న మలుపు నుంచి అతివేగంతో వచ్చిన ఫెరారీ కారు కాస్త ఒక్కసారిగా అదుపుతప్పింది. దీంతో క్షణాల్లో రోడ్డు మధ్యన ఉన్న డివైడర్‌పై నుంచి ఎగిరి రోడ్డు అవతలి వైపు వస్తున్న కారును బలంగా ఢీకొట్టింది. దీంతో డివైడర్ మధ్యలో ఉన్న విద్యుత్ స్థంబం సైతం నేలకొరిగింది.

మరోవైపు ఫెరారీ కారులో ఉన్న వారు సీటుబెల్టు ధరించడంతో సురక్షితంగా బయటపడ్డారు. మరోవైపు ఫెరారీ కారు ఢీకొట్టిన కారులో పీయూష్‌వర్మ మరో ఇద్దరు యువతులు ఉన్నారు. వీరందరికి స్వల్ప గాయల య్యాయి. కాగా పియూష్ నడుపుతున్న కారు వెనుక ఉన్న మరో రెండుకార్లు, ఒక ద్విచక్ర వాహనం సైతం ఈ సంఘటనలో దెబ్బతిన్నాయి. కారు నడుపుతన్న క్రాంతిరెడ్డికి జూబ్లీహిల్స్ పోలీ సులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా మద్యం సేవించలేదని గుర్తించారు.

ఈ ప్రమాదం లో మూడు కార్లు, ఒక బుల్లెట్ వాహనం తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రమాదం నేపథ్యంలో ఈ దారిలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడంతో జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని క్రమబద్ధీకరించారు. ఫెరారీ కారు అదుపు తప్ప దానికి గల కారణాలను పోలీసులు అన్వేషి స్తున్నారు. మోటారు వాహనాధికారికి పోలీసులు లేఖ రాశారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన ఫెరారీ కారు (టీఎస్ 07 హెచ్‌కె 8797) వెంకటరాజారెడ్డి పేరుతో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

## బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఎఫెక్ట్

### రాష్ట్రంలో ఒక్కసారిగా మారిన వాతావరణం

### కుమురంభీం జిల్లా జైనూర్‌లో భారీ వర్షం

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో ఏర్పడ్డ ఉపరితల ఆవర్తనం కారణంగా తెలంగాణలో ఆదివారం ఉదయం నుంచి వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు సంభవించాయి. పలు జిల్లాలలో ఈదురు గాలులు వీస్తుండగా ఇంకొన్నిచోట్ల వర్షాలు కురిశాయి, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో సాయంత్రం ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. వాహనదారులు రాకపోకలు సా గించేందుకు ఇబ్బందులకు గురయ్యారు. పోలీసులతో పాటు పౌర అధికారులు రంగంలో దిగి పరిస్థితులను చక్కదిద్దారు. తెలంగాణలో ఫిబ్రవరి 20 వ తేదీ నుంచి 24వ తేదీ వరకు పలుచోట్ల వడగళ్ల వాన కురవడంతో పాటు తుపాన్ కారణంగా ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ రెండు రోజుల క్రితమే హెచ్చరించడం తెలిసిందే. కొన్నిచోట్ల రెయిన్ అలర్ట్‌ను కూడా జారీ చేసింది. ఇందులో భాగంగా ఆదివారం నాడు రాష్ట్రంలోని ప లుచోట్ల ఓ మోస్తరు వానలు కురవగా జైనూర్‌లో భారీ వర్షం కురిసింది.

## ప్రశాంతంగా ముగిసిన టిజి సెట్-2026 పరీక్ష

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాలతోపాటు 6 నుంచి 9వ తరగతి వరకు ఉన్న ఖాళీ సీట్లను భర్తీ చేయడానికి నిర్వహించే టిజి కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టిజి సెట్)-2026 ఆదివారం ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు 94.93 శాతం మంది విద్యార్థులు హైరైనట్టు టిజి సెట్-2026 చీఫ్ కన్వీనర్, ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 492 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ ఏడాది టిజి సెట్‌కి 1.812,061 దరఖాస్తులు రాగా వారిలో ఆదివారం జరిగిన పరీక్షకు 1,72,842 మంది విద్యార్థులు హాజరయ్యారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 94.93 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

# కందనూలును కుదిపేసిన కుమ్మెర ఘటన..

### చిన్నారి చావుకు, దాడికి బాధ్యులైన వారిపై చర్యలకు డిమాండ్

### నిందితులపై కేసులు నమోదు చేశాం: డిఎస్పీ శ్రీనివాస్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం (కందనూలు) రాస్తా రోకోలతో అట్టుడికిపోతున్నది. కుమ్మెర జాతర సందర్భంగా దైవదర్శనానికి వెళ్లిన బీసీ,ఎస్సీ కులస్తులను అవమానించి దాడి చేయడంతో రెండు నెలల చిన్నారి మృతి చెందిందని ఆరోపిస్తూ అందుకు కారణమైన అగ్రవర్ణ కులస్తులను కఠినం గా శిక్షి ంచాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని కుమ్మెర గ్రామంలో ఈనెల 18న అదే గ్రామానికి చెందిన చాకలి గణేష్ కుటుంబ సభ్యులు జాతర సందర్భంగా దైవదర్శ నానికి వెళ్లారు. దైవ దర్శనం చేసుకోవడానికి రూ.100 చొప్పున చెల్లించాలని శ్రీనివాస్ రెడ్డి కోరడంతో అక్కడ వాగ్వివాదం చోటు చేసుకుంది. దర్శనం చేసుకోకుండానే చాకలి గణేష్ కుటుంబం ఇంటికి వెళ్లిపోయారు. గణేష్‌కు జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులు చెప్పడంతో అతను సోషల్ మీడియా వేదికగా ఆలయం వద్ద జరిగిన ఘటనను వైరల్ చేశారు. తదుపరి దేవాలయం వద్దకు వెళ్లి తమ కుటుంబాన్ని దర్శనం చేసుకోకుండా బూతులు తిడుతూ కుల ప్రస్తావనతో గణేష్ భార్య దళితురాలని తెలిసి కులం పేరుతో దూషించారని గణేష్ నిలదీయడంతో కొబ్బరికాయల దుకాణంలో దాడికి పాల్పడినట్లు బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. వీడియోలు సైతం వైరల్ అయ్యాయి. దాడిసమయంలో తోపులాటలో రెండు నెలల కూతురు కు కూడా గాయాలు కావడంతో అస్వస్థతకు గురై శనివారం ఉదయం మృతి చెందినట్లు బాధిత కుటుంబ సభ్యులు చెబుతున్నారు. దీంతో ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు దారితీసింది. శనివారం రాత్రి 11గంటల వరకు సుమారు 7 గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు.

**ఆందోళనలో మర్రి జనార్దన్‌రెడ్డి,మల్లన్న**

ఆదివారం ఉదయం బాధితులకు న్యాయం చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి బీఆర్ఎస్ శ్రేణులు, వివిధ దళిత, బిసి, ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో డీఎస్పీ కార్యాలయంలో డిఎస్పి శ్రీనివాస్ ను కలిసి కుమ్మెర బాధితులను ఆదుకోవాలని నిందితులను కఠినంగా శిక్షి ంచాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా నిందితులపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడం జరిగిందని దాడికి బాధ్యులైన వారిని నలుగురిని అరెస్టు చేశామని, వారిని కోర్టులో హాజరు పరుస్తామని నాగర్ కర్నూల్ డిఎస్పి బుర్రి శ్రీనివాస్ యాదవ్ మీడియాకు తెలిపారు.

# బొగ్గుల శ్రీనివాస్‌ది సుపారీ హత్యగా తేల్చిన పోలీసులు

### ఆర్థికలావాదేవీలే ప్రధాన కారణం

### నలుగురు నిందితుల అరెస్ట్

### ఖమ్మం రూరల్ ఎసిపి తిరుపతిరెడ్డి వెల్లడి

**ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 22 (ప్రభాతవార్త) :** రచయిత, యూటూబర్ బొగ్గుల శ్రీనివాస్ కారు ప్రమాద ఘటనలో మిస్టరీ వీడింది. పోలీసులు శ్రీనివాస్ ది సుపారీ హత్యగా తేల్చారు. అందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఖమ్మం రూరల్ ఏసీపీ కార్యాలయంలో ఆదివారం ఏసీపీ తిరుపతిరెడ్డి మీడియా సమావేశంలో తెలియజేశారు. కేసు వివరాలు.. బొగ్గుల శ్రీనివాస్ అనుమానాస్పద మృతి ఘటనపై పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించబడింది. దర్యాప్తులో భాగంగా మృతుడుగొల్ల అలియాస్ బొగ్గుల శ్రీనివాస్ యూట్యూబ్, ఇన్ స్టాగ్రామ్‌లలో విడియోలు చేస్తూ, హైదరాబాద్‌లో ఉంటున్నాడు. బొగ్గుల శ్రీనివాస్, కేసులో ప్రధాన నిందితుడు (ఏ1) మేకల వేణుమాధవ్‌రెడ్డి పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి వెళ్ళిన క్రమములో ఒకరికొకరు పరిచయం అయ్యారు. బొగ్గుల శ్రీనివాస్‌కు బొగ్గుల బీబీక్యూ పేరుతో జీఎస్టీ లైసెన్స్ కలదు. మేకల వేణుమాధవ్ రెడ్డి సొంతంగా మేకా ప్రాజెక్ట్స్ అనే కంపనీ పెట్టి సబ్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. బొగ్గుల బీబీక్యూ పేరు మీద ఫేక్ ఇన్ వాయిస్ అండ్ సేల్స్ ఫైల్ చేసి మంచి లాభాలు సంపాదించ వచ్చని మేకల వేణుమాధవ్‌రెడ్డి చెప్పగా, శ్రీనివాస్ సరేనని తన జీఎస్టీ లైసెన్స్ ఉపయోగించుకున్నందుకు 50శాతం ప్రాఫిట్ ఇవ్వాలని చెబుతాడు. ఈవిధంగా, వారు 202225 వరకు జీఎస్టీ ఫైలింగ్స్ తో దాదాపు రూ. 90 లక్షలు సమపాదించినారు. అందులో శ్రీనివాస్ వాటా రూ. 45 లక్షలు కాగా, మేకల వేణుమాధవ్ రెడ్డిరూ. 15 లక్షల రూపాయలు శ్రీనివాసుకు ఇచ్చాడు. ఇదే క్రమములో జీఎస్టీ ఫ్రాడ్ కు సంబంధించి మేకల వేణుమాధవ్ రెడ్డి, మృతుడు శ్రీనివాస్‌కు జీఎస్టీ డిపార్ట్‌మెంట్ నుండి నోటీస్‌లు వచ్చాయి. ఈ విషయమై వారి మధ్య వివాదాలు తలెత్తాయి. మేకల వేణుమాధవ్ రెడ్డి, ఏ2 పోకల కోటేశ్వరరావు (అశ్వారావుపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా), ఏ3 షేక్ అబ్దుల్ హాఫీజ్, ఏ4 ఎమ్.డి. అజ్మత్ అలీ ఖాన్‌లతో కలిసి మృతుడిని హత్య చేయాలని కుట్ర పన్నినట్లు దర్యాప్తులో తేలింది. ఏ3 షేక్ అబ్దుల్ హాఫీజ్, ఏ4 ఎమ్.డి. అజ్మత్ అలీ ఖాన్ లు 5 లక్షల సూఫారీ యిచ్చినారు. తేదీ 13.02.2026 రాత్రి మృతుడికి పెండింగ్‌లో ఉన్న డబ్బులు చెల్లిస్తామని నమ్మబలికి విజయవాడకు వెళ్దామని చెప్పి వాహనంలో తీసుకువెళ్లినట్లు తెలిసింది. 14వతేదీ తెల్లవారు జామున నకిరేకల్ నుండి జనగాం వైపు వెళ్ళే దారిలో కారులో నిందితులు కత్తులు, ఐరన్ రాడ్ల తో మృతుని తలపై దాడి చేసి హత్య చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. హత్య అనంతరం ఇట్టి ఘటనను రోడ్డు ప్రమాదంగా చూపించేందుకు మృతదేహంతో పాటు వాహనాన్ని పాలేరు రిజర్వాయర్‌లో పడవేసినట్లు సమాచారం. సాంకేతిక ఆధారాలు, ఇతర సాక్ష్యాల ఆధారంగా నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిసింది. హత్యలో ఉపయోగించిన ఆయుధాలు, ఇతర సాక్ష్యాలను స్వాధీనం చేసుకునే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ కేసుకు దర్యాప్తు అధికారి కూసుమంచి సీఐ. సంజీవ్ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## తల్లి పాడె మోసిన కూతుళ్లు!

### నెల వ్యవధిలోనే తల్లిదండ్రులు గుండెపోటుతో మృతి

**కోనరావుపేట రూరల్, ప్రభాతవార్త:** ఆ తల్లిదండ్రులకు ఆస్తులు, సంపదలు సంపాదించుకోకపోయినా నలుగురు కూతుళ్లు ఉన్నారు. అయితే ఆ తల్లిదండ్రులు నెల వ్యవధి రోజుల్లోనే గుండెపోటుతో మృతి చెందడంతో ఆ నలుగురు కూతుళ్లు రోడ్డున పడ్డారు. తల్లి అంతిమ సంవత్సరాలు చేసేందుకు వారి చేతిలో చిల్లిగవ్వ లేకున్నా, ఆ తల్లి పాడెను నలుగురు కూతుళ్లు మోసి దహన సంస్కారాలు చేశారు. ఈ ఘటన కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు,బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సుద్దాల గ్రామానికి చెందిన ఎగదండి నర్సవ్వ (54) అనే మహిళ గుండెపోటుతో మృతి చెందింది. నరసవ్వ భర్త బాబు ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. నెల రోజుల క్రితం ఇంట్లో గుండెపోటుతో గుండె పోటుతో మృతి చెందగా ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. భర్త మరణం తట్టుకోలేక నలుగురు కూతుళ్లను ఎలా పోషించాలని మనో వేదనతో నరసవ్వ నిత్యం పొంగిపోయేది. రోజువారీ కూలి చేసుకునేందుకు వ్యవసాయ పనులకు వెళ్లిన నరసవ్వకు శనివారం గుండెపోటు రాగా ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందింది. ఆదివారం ఆ తల్లి అంతక్రియలను కూతుళ్లు మమత, స్వప్న, శ్వేత, సింధుజ పూర్తి చేశారు. ఆ బాదిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ కుంటేల్లి నాగరాజు, ఉప సర్పంచ్ సాయి, వార్డు సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.

## నేడు పిజి ఇసెట్-2026 నోటిఫికేషన్ జారీ

### 27 నుంచి దరఖాస్తుల స్వీకరణ

### మే 28 నుంచి 31 వరకు పరీక్షలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి పిజి కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే పిజి ఈ సెట్-2026కి సంబంధించిన నోటిఫి కేషన్‌ను నేడు(సోమవారం) జారీ చేయనున్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను ఈ నెల 27 నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. నేటి నుంచి మే 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. పరీక్షలను మే 28 నుంచి 31 వరకు నిర్వహించనున్నారు.

## నేటి నుంచి టిజి ఐసెట్‌కు టిశాట్ స్పెషల్ డిజిటల్ పాఠాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** నేటి(సోమవారం) నుంచి టీజీ ఐసెట్ కోసం టిసాట్ స్పెషల్ డిజిటల్ లెసన్స్‌ను ప్రసారం చేయనుంది సీఈవో బోధనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 80 రోజులపాటు 320 ఎపిసోడ్స్‌ను ప్రసారం చేయనున్నట్టు తెలిపారు. పలు పోటీ పరీక్షలకు డిజిటల్ లెసన్స్ అందిస్తోన్న టిసాట్ నెట్వర్క్ తెలంగాణ ఐసెట్-2026 పరీక్షలకు సైతం డిటిటల్ లెసన్స్ అందిస్తోందని సీఈవో ప్రకటనలో తెలిపారు. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించే ఎం.బి.ఎ, ఎం.సి.ఎ అర్హత పరీక్ష ఐసెట్ కోసం నేటి(సోమవారం) నుంచి ప్రసారాలు మొదలౌతాయన్నారు. తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టిజి ఐసెట్)- 2026 పరీక్షను మే 13, 14 తేదిల్లో జరగనుండగా ఎనలిటిక్ ఎబిలిటీ, మాథమెటిక్స్, కమ్యూనికేషన్ ఎబిలిటీ తదితర సబ్జెక్టులపై రోజుకు రెండు సబ్జెక్టుల చొప్పున ప్రసారం చేయనున్నామని, విద్యా ఛానల్‌లో ఉదయం 5 నుండి 6 గంటల వరకు, నిపుణ ఛానల్‌లో సాయంత్రం 5 నుండి 6 గంటల వరకు డిజిటల్ లెసన్స్ ప్రసామోతాయని సీఈవో తెలిపారు. తెలంగాణాలోని విద్యార్థులు టిసాట్ డిజిటల్ లెసన్స్ సద్వినియోగం చేసుకోవాలని సీఈవో వేణుగోపాల్‌రెడ్డి సూచించారు.



# ఫ్రీ.. ఫ్రీ..ఫ్రీ.. టమాటాలు

### అన్నదాత కంట కన్నీరు

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ఫ్రీ..ఫ్రీ..ఫ్రీ.. టమాటాలు అడిగి నోళ్లకు అడిగినన్ని ఉచితం. ఒకప్పుడు సెంచరీ కొట్టి సామాన్యుడిని వణికిం చిన అదే టమాటా నేడు పాతాళానికి పడిపోయిన ధరలతో అన్నదాత కంట కన్నీరు పెట్టిస్తోంది. రెక్కలు ముక్కలు చేసుకుని, అప్పులు తెచ్చి పండించిన పంటకు కనీసం రవాణా ఖర్చులు కూడా రాకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఈ విధంగా ప్రస్తుతం టమాటా రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. అమ్మకానికి మార్కెట్‌కు తరలించిన టమాటా కోనే నాథుడు కరువయ్యాడు. కనీస గిట్టుబాటు ధర లేదు..దయనీయ స్థితిలో పంటను మార్కెట్లోనే వదిలేయలేక, ఇంటికి తిరిగి తీసుకెళ్లలేక రైతులు రోడ్ల మీద పారబోయడం, ఉచితంగా పంపిణీ చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. చేతికి అందిన పంట కుళ్లిపోతుండటంతో కొందరు రైతులు కడుపుమండి వినూత్న నిరసన తెలిపారు. వినియోదారులకు టమాటాలు ఉచిత సరఫరా చేసి ఆవేదన వ్యక్తం చేశారు.

సాధారణ సమయంలో టమాటా ధరలు సెంచరీ కొట్టినా ఇప్పుడవి నేల చూపులు చూస్తున్నాయి. రాష్ట్రంలోని మార్కెట్లలో కనీసం కిలో 2 రూపాయల ధర పలకని టమాటా ధర చూసి రైతులు బిత్తర పోతున్నారు. చేతికి అందిన ఆ పంటను ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో ఉచితంగా సరఫరా చేస్తున్నారు. ఒకటికాదు రెండు కాదు ఏకంగా 1,500 కిలోకు పైగా ఒక ట్రాలీ లోడ్ టమాటాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ ఉచిత పంపిణీ సంఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో జరిగింది. వారాంతపు సంత సందర్భంగా గూడూరు మండలం భూపతిపేట గ్రామానికి చెందిన సారయ్య, మోహన్, సురేందర్ అనే రైతులు టమాట పంటను అమ్మకానికి తీసుకువచ్చారు. అయితే ఆశించిన స్థాయిలో గిరాకీ లేకపోవడంతో పాటు ధరలు అమాంతం పడిపోయాయి. దీంతో తీవ్ర నిరాశ చెందిన రైతులు ఆ టమాటా ఇంటికి తీసుకెళ్లలేక అక్కడే ఉచితంగా పంపిణీ చేశారు.

అప్పులు చేసి కష్టపడి పంట వేస్తే ధరలు దారుణంగా పడిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వార్త

బలీయమైన విశ్వాసాలకు, నైతిక సూత్రాలకు కట్టుబడని వారు ఏ పార్టీలో ఉన్నా వారికి ఆ పార్టీకి కూడా క్షేమం కలగదు.

-ఆండర్సన్

# వన్యప్రాణులను కాపాడుకోలేమా?

అటవీ రక్షణకు వేలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా అడవులను ధ్వంసం చేసేవారిని ఉక్కుపాదంతో అణచివేస్తామని అటు కేంద్రపాలకులు, ఇటు ఆయా రాష్ట్రాల పాలకులు ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా ఆశించిన ఫలితాలు లభించడం లేదు. అంతకంతకు అటవీ విధ్వంసం పెరిగిపోతున్నది. కొందరు అధికారుల అవినీతి, నిర్లక్ష్యం, వీటన్నింటికి మించి రాజకీయ జోక్యంతో చట్టాలు నిరుపయోగం అవుతున్నాయి. అరణ్యాలను స్మగ్లర్లకు వదిలి కొందరు అధికారులు జనారణ్యాలకే పరిమితం కావడంతో పరిస్థితి అంతకంతకు దిగజారిపోతున్నది. ఒకనాడు దేశంలో కాకులు దూరని కీకారణ్యాలుగా పేరొందిన అరణ్యాలు సైతం మైదానాలుగా మారిపోతున్నాయి. ఈ అటవీ సంపదతోపాటు వీటి ఆధారంగా శతాబ్దాల తరబడి జీవనం సాగిస్తున్న పెద్ద పులులు, చిరుత పులులు, దుప్పులు, అడవి పందులు, ఏనుగులు, ఇలా ఒక్కటేమిటి సమస్త ప్రాణులు వేటగాళ్ల బారినుంచి తప్పించుకోలేక కాలగర్భంలో కలిసిపోతున్నాయి. అడవుల విస్తీర్ణం తగ్గడం, స్మగ్లర్ల కార్యకలాపాలు పెరగడంతో ఈ వన్యప్రాణులకు అటవీ ప్రాంతాల్లో ఆహారం దొరకక జనారణ్యాలపై పడుతున్నాయి. ఇటీవల కాలంలో తెలుగు రాష్ట్రాల్లోకూడా పులులు,ఎలుగుబంట్లు, ఏనుగులు, అడవిపందులు తదితర వన్యప్రాణులు ఎన్నో జనారణ్యంలోకి చొచ్చుకువచ్చి ఆహారం కోసం రైతుల పంటలపై పడుతున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం తదితర ఉత్తరాంధ్ర జిల్లాల్లో రాయలసీమలోని చిత్తూరు ప్రాంతంలో అడవి ఏనుగులు పంటలపై దాడిచేస్తున్నాయి. దీంతో ఎన్నో వ్యయప్రయాసలకు ఒర్చి సాగు చేసుకున్న పంటలు నోటికి అందుతున్న దశలో వన్యప్రాణులు ధ్వంసం చేస్తుండటంతో పురుగు మందులు, కరెంటు తీగలు పెట్టి కొందరు చంపుతున్నారు. ఇది రాను రాను పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే అంశం. ఒకనాడు ఆహారం కోసం ఆ తర్వాత సరదాగా ఆరంభమైన వన్యప్రాణుల వేట ఇప్పుడు వ్యాపారంగా మారిపోయింది. ఆదిమానవుని జీవనం వేటతోనే ఆరంభమైనట్లు చరిత్ర చెబుతున్నది. కేవలం తమ ఆకలి తీర్చుకునేందుకే ఆనాటి ఆదిమానవుడు వేటాడేవారని చరిత్ర ఆధారాలు వెల్లడిస్తున్నాయి. రాజుల కాలంలో వేటను సరదాగానో, తమ ప్రతిష్టకోసం కొనసాగించారు. ఆ తర్వాత వేట క్రమేపీ వ్యాపారంగా రూపాంతరం చెందడంతో 1526 నుండి 1857 వరకు వేటజోరుగా సాగినట్లు ఆధారాలున్నాయి. మనదేశానికి బ్రిటిష్ కాలంలో తుపాకులు రావడంతో వేట మరింత సులభం అయింది. దీంతో వన్యప్రాణులతోపాటు ప్రధానంగా పులుల సంఖ్య విపరీతంగా పడిపోయింది. స్వాతంత్ర్యం వచ్చేనాటికి దేశంలో నలభై వేలకుపైగా పులులు ఉండగా, 1972 ప్రాంతానికి మూడువేల వరకు తగ్గిపోయాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే అసలు పులుల జాతితోపాటు మరికొన్ని వన్యప్రాణుల జాతి కూడా ఆనవాళ్లు లేకుండా అంతరించిపోతుందని ఆందోళనలు వ్యక్తం కావడంతో ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని 1972 సంవత్సరంలో ప్రవేశపెట్టారు. వేటాడటం నిషేధించడం తోపాటు పులుల పెంపుదలకు కొన్ని ప్రత్యేక పథకాలు చేపట్టారు. అందులోభాగంగా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఇరవైమూడు టైగర్ ప్రాజెక్టులను ప్రారంభించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శ్రీశైలంవల్ల ఒక ప్రాజెక్టు ప్రారంభమైంది. అయినా ఆశించిన మేరకు పెద్దపులుల సంఖ్య పెరగడం లేదని చెప్పొచ్చు. ముఖ్యంగా అడవుల్లో వేట కారణంగా జింకలు,కుందేళ్లు లాంటి వన్యప్రాణుల సంఖ్య తగ్గిపోవడంతో పులులు ఆహారం దొరకక జనారణ్యంలోకి ప్రవేశిస్తున్నాయి. రైతుల పశువులు, గొర్రెలు, మేకలు లాంటి వాటిపై దాడి చేసి చంపుతున్నాయి. దాదాపు ఏడువందల కిలోమీటర్లకుపైగా ప్రయాణించి పెద్దపులి ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రికి చేరుకున్నది. ఆహారం దొరకక పశువులపై దాడి చేస్తున్న దానిని పట్టుకునేందుకు పెద్దఎత్తునే ప్రయత్నం చేశారు. అదృష్టవశాత్తు అది ఒక ఇంట్లోకి దూరడంతో మత్తుతూటతో పట్టుకొని ముందు జూకు తరలించి ఆతర్వాత అభయారణ్యాలకు పంపారు. ప్రస్తుతం సిద్ధిపేట జనగాం జిల్లాలో మరొక పెద్దపులి తిరుగుతున్నది. దాన్ని పట్టుకునేందుకు గత నెల రోజులుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇంకా ఒక కొలిక్కి రాలేదు. ఆ ప్రాంతవాసులుకు ఈ పులివల్ల ఇబ్బందులు, భయాందోళనలు కలుగుతున్న మాట వాస్తవమేకావొచ్చు. అసలు ఆ పులి ఎందుకు అరణ్యాలను వదిలి వస్తున్నదో ఆలోచించాల్సిన అవసరం ఉంది. అడవులు అంతరించడం, జనసంచారం పెరిగిపోవడం, జంతువుల సంఖ్య తగ్గిపోతుండడంతో ఆ ప్రభావం పులితోపాటు అన్ని వన్యప్రాణులపై పడుతున్నది. ఇప్పుడు వేటకు తుపాకులు కూడా అవసరం లేకుండాపోయింది. మేకనో, గొర్రెనో ఏదో పశువునో ఎరగావేసి దానికి క్రిమిసంహారక మందులు ప్యాకెట్లు కట్టి పులులను మట్టుపెడుతున్నారు.ఒకపక్క అడువులు తగ్గిపోవడం, మరొకపక్క విజృంభించిన విష ప్రయోగాలు, విద్యుత్ కంచెల ఉచ్చులతో వన్యప్రాణులు బలైపోతున్నాయి. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి. అవసరం అనుకుంటే చట్టాన్ని సవరించి మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలి. అడవులను పర్యవేక్షించాల్సిన అధికారుల కార్యాలయాలు, పరిధులు నగరాలకే పరిమితం చేయకుండా ఆయా ప్రాంతాలకు తరలించాలి. వన్యప్రాణులను కాపాడేందుకు త్రికరణశుద్ధిగా అన్ని స్థాయిల్లోనూ ప్రయత్నాలు జరగాలి. ఇందులో స్వచ్ఛంద సంస్థలు కూడా పాలుపంచుకోవాలి.

> అవసరానికి ఆదుకొనే మిత్రులున్న వ్యక్తి అదృష్టవంతుడు. కానీ మిత్రుల సహాయాన్ని స్వీకరించాల్సిన అవసరం రాని వ్యక్తి ఇంకా అదృష్టవంతుడు.



వార్విక్

> మీలో మార్పు రావడం అన్నది ఎంత కఠినమైన విషయమో తెలుసుకోండి. అప్పుడు ఇతరుల్ని మార్చడం అన్నది ఎంత కష్టమైనదో తెలిసొస్తుంది.



జాకబ్‌బ్రొనోవిస్కీ

# ఎన్నికల్లో ఏదీ మహిళా సాధికారత?

**చట్టబద్ధమైన రిజర్వేషన్లతో మహిళలకు ఒనగూడాల్సిన రాజకీయ ప్రయోజనాలు ఆచరణలో ప్రశ్నార్థకంగా మారి వారి వారి భర్తలూ, కుటుంబంలోని పురుషులే అధికార కేంద్రాలుగా మారి రాజ్యాంగ బద్ధంగా సంక్రమించిన రాజకీయ అధికారాన్ని అనుభవించలేని ఉత్సవ విగ్రహాలుగా మహిళలు మిగిలిపోక తప్పదు. ఈ నేపథ్యంలో మహిళలు తమ ఉదాసీనతతో రాజ్యాంగేతర శక్తులుగా రూపాంతరం చెందుతున్న భర్తలతో, సోదరులతో, ఇతర పురుష కుటుంబ సభ్యుల జోక్యంతో తమ అస్థిత్వానికీ, సమానత్వ సాధనకు ఒనగూడుతున్న ప్రమాదాల బారినుండి తమను తాము కాపాడుకుంటూ మేమూ పురుషులతో సమానమేనని నినదిస్తూ గెలిచి నిలుస్తారో లేదా మనుధర్మ స్మృతి మాయలోపడి పురుష ప్రపంచం నీడలోనే నిలిచి తరించే ద్వితీయ శ్రేణిపౌరులుగా తమ జీవితాలను కొనసాగిస్తారో రాబోయే కాలమే తేల్చిచెప్పాలి.**



డాక్టర్ నీలం సంపత్

తెలంగాణా రాష్ట్రంలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలలో 73,74 వ రాజ్యాంగ సవరణలను అనుసరించి నలభై ఆరుశాతం రిజర్వేషన్లను సొంతం చేసుకున్న మహిళలు ,నిన్నటికి నిన్న మున్సిపాల్టీలకు జరిగిన ఎన్నికలలో ఏభై శాతంతో ఆయా రాజకీయ పార్టీల బి.ఫాం లు అందుకున్నప్పటి నుండి ప్రచార పర్వంలో ప్రజల మధ్యకు వెళ్లేక్రమంలో బి.సి,యస్.సి, యస్.టి సామాజిక వర్గాలనే తేడా లేకుండా, ఆర్థిక మూలాలతో, విద్యార్హతలతో సంబంధం లేకుండా మెజారిటీ మహిళలు తమ తమ భర్తల పేరుని మోయాల్సి రావడం మహిళా సాధికారతను మరుగున పడేసే చర్యగా భావించక తప్పదు. మహిళా సమానత్వానికి తామే ఛాంపియన్లమని ప్రకటించుకున్న కొన్ని ప్రసార సాధనాలు సైతం బి.ఫారాలు భర్తల పేరు పైనే వచ్చినట్లు కలర్ ఇస్తూ ప్రచారం చేయడంశోచనీయమే. అంతే కాకుండా అన్ని రకాల ప్రచార సామగ్రి పైన పోటీలో వున్న భార్యల కన్నా భర్తల ఫోటోలూ,పేర్లేముందు వరసలో ఉండడం మాత్రమే కాకుండా మా ఆవిడను గెలిపిస్తే మీ వార్డు లేదా కార్పొరేట్ డివిజన్‌ల అభివృద్ధికై నేను నిరంతరం పోరాడుతానని ఎమ్మెల్యేలు, ఎంపిలుమంత్రుల సమక్షంలో ప్రసార సాధనాలలో బహిరంగ ప్రకటనలు చేస్తుండడమే కాకుండా సోషల్ మీడియా వేదికగా పులులూ, సింహాలుగా తమను తాము చిత్రీకరించుకుంటూ విస్తృత ప్రచారం చేస్తున్న వైనంతో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన మహిళలు వారి భర్తల చేతుల్లో కీలు బొమ్మలుగా కొనసాగక తప్పదనే భావన సర్వత్ర వెల్లువెత్తుతోంది.ఆకాశంలోసగం ,అవనిలో సగం అంటూ ఆధునిక ప్రపంచంలో విద్యా,వైద్య, శాస్త్ర, సాంకేతిక,పోలీస్,మిలట్రీ లాంటి విభిన్న రంగాలతో పాటు,ఐ.ఏ.యస్, ఐ.పి.యస్ ఆఫీసర్లుగా పరిపాలనా రంగంలో, సామాజిక వేత్తలుగా, న్యాయవాదులుగా, న్యాయ మూర్తులుగా, పాత్రి కేయులుగా సైతం తమ ఉనికిని అత్యంత ప్రభావ పూరితంగా చాటుకుంటున్న మహిళలు రాజకీయ రంగంలో ఎమ్మెల్యేలుగా, యం.పిలుగా ముఖ్య మంత్రులుగా, దేశాధ్యక్షులుగా ఎంతో విజయవంతంగా తమ కర్తవ్యాలను నిర్వర్తిస్తున్నప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికలలో మాత్రం తమ భర్తలు,సోదరులు ఇతర పురుష కుటుంబ సభ్యుల చేతుల్లో మర బొమ్మలుగా మారుతున్న వైనం పురుషులతోపాటు మహిళలకుసమానత్వ హక్కులకు ప్రధాన ప్రతిబంధకంగా భావించక తప్పదు. నిజానికి ఎన్నికల ముందే ఏ పదవీ లేకున్నా భార్యలపై భర్తల ఆజమాయిషీ ఇలా కొనసాగుతూ ఉంటే రేపు అధికారంలోకి వచ్చిన తర్వాత పదవుల్లో స్త్రీలు పెత్తనం మాత్రం పురుషులదే అవుతుందనే భావన నిజం కాక తప్పదనే గుసగుసలు ఊపందుకుంటున్నాయి. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలతో వారు దైనందిన జీవనంలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపట్ల వ్యక్తిగత శ్రద్ధాసక్తులను ప్రదర్శించే చట్టపరమైన బాధ్యతను నెరవేర్చాల్సిన సర్పంచులు,యం.పి.టి.సిలు, జడ్.పి.టి.సిలు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు మహిళా అభ్యర్థులుగా ఎన్నికలలో విజేతలుగా ఆవిర్భవిస్తున్న నేపథ్యంలో కనీసం వారిని ఫోన్ ద్వారా నైనా సంప్రదించే అవకాశమే లేకుండా వారి భర్తలే ఆఫీస్ వ్యవహారాలను నడిపిస్తారేమోననే భావన ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో అక్కడక్కడా కొన్నికొన్ని



స్థానిక సంస్థల ప్రధాన కార్యాలయాల్లో అధికారంలో వున్న మహిళలకు తోడుగా వారికి కేటాయించిన గదుల్లోనే ప్రత్యేక సీట్లను ఏర్పాటు చేసుకుని సమాంతర అధికారాన్ని చలాయిస్తుండడం విస్తుగొలిపేదే. ఈ చర్యలకు కొనసాగింపుగా మహిళలు వార్డ్ మెంబర్లుగా, ఛైర్మన్‌లుగా ఎన్నికైనప్పటికీ వారి భర్తలే వార్డ్ మెంబర్లుగా, ఛైర్మన్‌లుగా వ్యవహరిస్తూ రాజ్యాంగేతర శక్తులుగా మారి పాలనను కొనసాగిస్తున్న వైనం దురదృష్టకరమే. గతంలో గ్రామ సభల్లో, మండల స్థాయి సమావేశాలలో, కొన్నికొన్ని మున్సిపాలిటీల్లో రాజకీయ నేతల ఒత్తిళ్లతోనో,అధికారుల అలసత్వం లేదా పర్యవేక్షణ లోపం ఫలితంగానో గాని ఆయా అధికారిక సభలూ, సమావేశాల్లో భార్యల తరపున భర్తలే పాల్గొన్న ఉదంతాలు వంద శాతం రాజ్యాంగ నిబంధనల ఉల్లంఘనగా భావించక తప్పదు. నిన్నటికి నిన్న మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల ఫలితాల ప్రకటనల తర్వాత అందులో విజయం సాధించిన మహిళా అభ్యర్థులను అభినందించే క్రమంలో అధికార, విపక్ష శాసన సభ్యులతోపాటు మంత్రులు తదితర బడాబడా రాజకీయ నాయకులు సైతం అసలు విజేతలైన మహిళలను అలక్ష్యం చేస్తూ వారిభర్తలే గెలిచినట్లుగా వారినే హీరోలుగా వర్ణిస్తూ అభినందిస్తున్న వైనం మహిళల స్వతంత్రత, సాధికారతకు ఇబ్బందిని కలిగించేదేనని సత్యాన్ని జీర్ణించుకోక తప్పదు. నేటికీ మనుస్మృతి ఆధిపత్యం చేస్తున్న భారతీయ సమాజంలో కార్యేషు దాసి, కరణేషు మంత్రి, భోజ్యేషు మాతా,శయనేషు రంభా అనే ఆర్యోక్తిని తిరగ రాస్తూ అత్యున్నత విద్యా సముపార్జనతో ఉద్యోగ ప్రస్తానంలో కొనసాగుతున్న నేపథ్యంలో వివిధ కార్యాలయాల్లో, కార్ఖానాల్లో ఎదురౌతున్న అనేక అవరోధాలకు, అమానవీయ వేధింపులకు ఎదురొడ్డి అప్రతిహతంగా ముందుకు సాగుతున్న మహిళలు స్థానిక సంస్థల పాలనా వ్యవహారాలను నడిపించలేమనే భావంలోకి నెట్టి వేయబడడానికి కారణం పురుషాధిక్య భావజాలపు ఒత్తిళ్లా ? లేదా మహిళలకు తమ సామర్థ్యంపై తమకు విశ్వాసం లేని ఆత్మ న్యూనత భావమా? అనేది తేల్చు కోవాల్సిన బాధ్యత నిస్సందేహంగా మహిళా లోకానిదేనని చెప్పక తప్పదు. నిజానికి కుటుంబ పరమైన పెళ్లిళ్లు, పేరంటాలు, గృహ ప్రవేశాలు, నామకరణ మహోత్సవాలూ, తదితర వివిధ శుభ కార్యాల నేపథ్యంలో అచ్చు వేసి పంపిణీ చేసేఆహ్వాన పత్రికలలో భార్యలతో పాటు భర్తల ఫోటోలు సైతం ముద్రించే సాంప్రదాయాన్ని ,ఆచారాలను నేటి సమాజం ఆదరిస్తుండడం అభినందనీయమే. ఐతే రాజ్యాంగ నిబంధనల ప్రకారం జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు మహిళలైనప్పుడు వారికి జారీ చేసే బి.ఫామ్ మినహా వారిఎన్నికల ప్రచార సామగ్రిలో భాగంగా పోస్టర్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లపై భర్తల ఫోటోలే ప్రముఖంగా కనపడుతుండడమే కాదు విజయోత్సవాలలోనూ మహిళలకు తోడుగా కాదు వారే విజేతలుగా ఎన్నికైనట్లు చేస్తున్న ప్రదర్శనలతో కొన్నికొన్ని సందర్భాల్లో వారే చట్టబద్ధంగా ఎన్నికైన భావన కలిగిస్తోంది. ఇదేదీ చాలదన్నట్లు కొన్ని టెలివిజన్ ఛానల్స్ గెలిచిన మహిళా విజేతలను మొక్కుబడిగా అభినందించి వారి భర్తలతో సుదీర్ఘ ఇంటర్వ్యూలు తీసుకుంటున్న వైనం ఎన్నికైన మహిళా ప్రతినిధులు భర్తల చాటు భార్యలే తప్ప స్వతంత్రంగా ప్రజా ప్రతినిధులుగా తమ తమ రాజ్యాంగ బద్ధమైన విధులను నిర్వహించలేరేమోననే అపోహను కలిగిస్తున్న భావన ప్రజలకు కలగక తప్పదు. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే చట్ట బద్ధమైన రిజర్వేషన్లతో మహిళలకు ఒనగూడాల్సిన రాజకీయ ప్రయోజనాలు ఆచరణలో ప్రశ్నార్థకంగా మారి వారివారి భర్తలూ, కుటుంబంలోని పురుషులే అధికార కేంద్రాలుగా మారి రాజ్యాంగ బద్ధంగా సంక్రమించిన రాజకీయ అధికారాన్ని అనుభవించలేని ఉత్సవ విగ్రహాలుగా మహిళలు మిగిలిపోక తప్పదు. ఈ నేపథ్యంలో మహిళలు తమ ఉదాసీనతతో రాజ్యాంగేతర శక్తులుగా రూపాంతరం చెందుతున్న భర్తలతో, సోదరులతో, ఇతర పురుష కుటుంబ సభ్యుల జోక్యంతో తమ అస్థిత్వానికీ, సమానత్వ సాధనకు ఒనగూడుతున్న ప్రమాదాల బారి నుండి తమను తాము కాపాడుకుంటూ మేమూ పురుషులతో సమానమేనని నినదిస్తూ గెలిచి నిలుస్తారో లేదా మనుధర్మ స్మృతి మాయలోపడి పురుష ప్రపంచం నీడలోనే నిలిచి తరించే ద్వితీయ శ్రేణిపౌరులుగా తమ జీవితాలను కొనసాగిస్తారో రాబోయే కాలమే తేల్చిచెప్పాలి. •

# ప్రాణాలు పిండేస్తున్న నకిలీ వైద్యులు!

ఈ. శ్రీనివాస్ రావు

వైద్య వృత్తి ముసుగులో కొందరు మోసగాళ్లు అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అక్షరం ముక్క రాకపోయినా తెల్లకోటు తగిలించుకుని, మెడలో స్టెతస్కోపు వేసుకుని క్లినిక్‌లు నడుపుతున్న నకిలీ వైద్యుల ఘటనలు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నాయి. వైద్య విద్య లేకపోయినా వైద్యుడిగా నటించడం కేవలం చట్టవ్యతిరేక చర్య మాత్రమేకాదు, అది ప్రత్యక్షంగా ప్రాణహానికి దారితీసే నేరం. ఆంధ్రప్రదేశ్‌లోని సింగరాయకొండలో రక్తపరీక్ష కేంద్రం నిర్వహించే వ్యక్తి తనను తాను వైద్యుడిగా ప్రకటించుకుని నాలుగేళ్ల బాలుడికి చికిత్స పేరుతో ప్రాణాపాయం కలిగించిన సంఘటన ప్రజలను కలచివేసింది. అలాగే చిత్తూరు జిల్లాలో పదో తరగతి కూడా చదవని వ్యక్తులు క్లినిక్‌లు ప్రారంభించి అమాయకులను మోసం చేస్తున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయి. తెలంగాణలోని సూర్యాపేటలో నకిలీ వైద్యుల నిర్లక్ష్యంతో కొద్ది రోజుల్లోనే ఇద్దరు మహిళలు మృతి చెందిన ఘటనలు నమోదయ్యాయి. టెక్నీషియన్‌గా పనిచేసే వ్యక్తి వైద్యుడిగా నటించి గర్భిణీలపై అక్రమ శస్త్రచికిత్సలు చేయడం వంటి సంఘటనలు మరింత భయాందోళన కలిగిస్తున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాల్లోనే అనుమతులు లేని వందలాది ఆసుపత్రులు నడుస్తున్నాయని అంచనాలు చెబుతున్నాయి. ఇవన్నీ కేవలం బయటపడిన సంఘటనలే కాని, లోతులో ఇంకా ఎన్నో ఉదంతాలు దాగి ఉన్నాయనే అనుమానం వ్యక్తమవుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ప్రకారం భారతదేశంలో అల్లోపతి వైద్యులుగా చలామణీ అవుతున్న వారిలో సగానికి పైగా మందికి సరైన అర్హతలు లేవని వెల్లడైంది. వీరిలో గణనీయమైన శాతం కేవలం పాఠశాల విద్యతోనే సరిపెట్టుకున్నవారేనని అధ్యయనాలు చెబుతున్నాయి. భారతీయ వైద్య సంఘం అంచనాల ప్రకారం దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలో నకిలీ వైద్యులు కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. చికిత్స సమయంలో సంభవిస్తున్న మరణాల్లో గణనీయమైన శాతం ఈనకిలీ వైద్యుల నిర్లక్ష్యం అవగాహనలేమి కారణంగానే జరుగుతున్నట్లు వివిధ అధ్యయనాలు సూచిస్తున్నాయి. తెలంగాణలో రాష్ట్ర వైద్య మండలి గత కొంతకాలంలో వందలాది కేసులు నమోదు చేసినప్పటికీ, అర్హతలు లేని వేలాది మంది ఇంకా వైద్యం పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారనే అంచనాలు ఉన్నాయి. ఉన్నత న్యాయస్థానం కూడా గతంలో నకిలీ వైద్యం సమాజానికి పెనుముప్పు అని హెచ్చరించినప్పటికీ, ఆ హెచ్చరికలు కాగితాలకే పరిమితమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. నకిలీ వైద్యుల వల్ల కలిగే నష్టం కేవలం తక్షణ ప్రాణాపాయం మాత్రమే కాదు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు కూడా దారితీస్తోంది. అధిక మోతాదులో యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు ఇవ్వడం వల్ల శరీర నిరోధక శక్తి దెబ్బతింటోంది. మందులకు పనిచేయని వ్యాధులు పెరుగుతున్నాయి. చిన్న జ్వరమే ప్రాణాంతకంగా మారే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. శస్త్రచికిత్సల పేరిట అవగాహనలేని చర్యలు తీసుకుని రోగుల అవయవాలను దెబ్బతీయడం, శాశ్వత వైకల్యాలకు గురిచేయడంవంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా పేదలు, గ్రామీణులు, నగర పేదవర్గాలు తక్కువ ఖర్చుతో చికిత్స దొరుకుతుందనే నమ్మకంతో ఈ మోసగాళ్ల వద్దకు వెళ్లి ప్రాణాలు కోల్పోతున్నారు. ఈసమస్యకు మూల కారణాలు అనేకం. చట్టాల అమలులో సమన్వయ లోపం, వైద్య మండలి, పోలీసు శాఖ, ఔషధ నియంత్రణ విభాగాల మధ్య సమర్థవంతమైన అనుసంధానం లేకపోవడం, తక్కువ శిక్షలు, అవినీతి ఆరోపణలు, గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన వైద్యుల కొరత వంటి అంశాలు నకిలీలకు అవకాశాలుగా మారుతున్నాయి. రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ పేరుతో కొందరు చట్టపరమైన సందిగ్ధతను ఉపయోగించుకుని అల్లోపతి వైద్యంచేయడం పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తోంది. ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం అత్యవసరం. అనుమతులు లేని క్లినిక్‌లు, ఆసుపత్రులను గుర్తించి వెంటనే మూసివేయాలి. మోసం, ప్రజారోగ్యానికి హాని వంటి నేరాల కింద కఠిన శిక్షలు విధించి, బెయిల్ సులభంగా లభించని విధంగా చట్టాలను అమలు చేయాలి. ప్రతి వైద్యుడి నమోదు సంఖ్యను ప్రజలకు అందుబాటులో ఉంచి, రోగులు సులభంగా ధృవీకరించుకునే విధానాలను అమలు చేయాలి. ప్రజల్లో అవగాహన పెంపొందించి అర్హత లేని వ్యక్తుల వద్ద చికిత్స పొందడం ప్రాణాపాయం అని స్పష్టంగా తెలియజేయాలి. మందుల దుర్వినియోగాన్ని నియంత్రించే కార్యక్రమాలు అమలు చేయాలి. స్వాతంత్ర్యం సాధించి దశాబ్దాలు గడిచినా, అర్హతలు లేని వారు వైద్యులుగా కొనసాగడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మచ్చ. వైద్యం ప్రాణరక్షణ మార్గం కావాలి గాని ప్రాణహానికర యమపాశం కాకూడదు. ప్రభుత్వాలు, వైద్యసంఘాలు,మీడియా, ప్రజలు అందరూ కలిసి ఈనకిలీ వైద్యుల వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలి. ప్రజారోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు, సమాజం కర్తవ్యం కూడా. •

# ప్రజావాక్కు



### ఆ విశ్వవిద్యాలయాలను రద్దుచేయాలి

రాజస్థాన్ కోటాలోని వర్ధమాన్ మహావీర్ ఓపెన్ యూనివర్సిటీ వారు హిందూవివాహపద్ధతులను , కర్మకాండలు అనగా తద్దినాలూ ఎలాచేయాలి అనేవాటిపై ఒక ఆరు నెలల కోర్సు ప్రవేశపెడుతుంది. వయసుతోపనిలేకుండా అన్నికులాలు, అన్నిమతాలవారికి ప్రవేశం ఉంటుందట. హిందూమతసాంప్రదాయాలతో యూనివర్సిటీలకు ఏమి పని? ఈకోర్సు చదివినవారు ఆవారావాళ్ళలాగా తయారై పెళ్లిపేరుతో,తద్దినాలపేరుతోఇంటింటికితిరిగి బతికేందుకా! తక్షణమె ఇలాంటి బుద్దిలేని కోర్సు ను ఉపసంహరించాలి. విద్యాలయాలు విద్యార్థులకు జ్ఞానాన్నిఅందించాలి. పెళ్ళి మంత్రాలు అన్నీబూతులు అనితెలిసిపోయింది.ఇంక తద్దినాలపేరురో జరిగేకర్మకాండ మొత్తం పురోహితుల పొట్టకూటికోసమే అని ప్రజాకవివేమన ఎలుగెత్తిచాటాడు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### బిసిలపై దృష్టి సారించాలి

ఉమ్మడిరాష్ట్రాల్లో చదివే కాలం తర్వాత ఉద్యోగ నియామకాల్లో రిజర్వుడ్ కేటగిరి మినహా బిసి కుల అభ్యర్థులు ఎక్కువ. పోటీ కూడా ఎంపికకు చాలా కష్టం. కుటుంబాలు చాలావరకు దిగువ స్థాయి ఆదాయంలోనే ఉంటారు. వృత్తులు బాగా పడిపోయిన తర్వాత కుటుంబ ఆదాయం బాగా తగ్గినది. వీరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని పథకాలు పెడుతున్న కూడా నిరుద్యోగులు ఉంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల ఎంపికలో ఏ మాత్రం రిజర్వేషన్ ఇచ్చినా అది సమంజసమే. ప్రస్తుతం ప్రభుత్వం నడుపున్న కోచింగ్ కేంద్రాలలో కూడా నామమాత్రపు ఫీజు ఉంటే ఎంతోమంది పోటీలో తప్పక నెగ్గుతారు.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

### ఆలోచనా శక్తి పెంచాలి

భారత విద్యావ్యవస్థలో పరిశోధనా దృష్టిని విస్తరించాల్సిన అవసరం అత్యంత కీలకంగా మారింది. దేశంలో కోట్లాదిమంది విద్యార్థులు,లక్షలాదిపాఠశాలలు, ఉపాధ్యాయులు ఉన్న పరిస్థితిలో, పిల్లలలో జిజ్ఞాస, విచారణ, విశ్లేషణాత్మక ఆలోచనలను పెంపొందించడం ప్రధాన బాధ్యతగా నిలిచింది.ప్రశ్నించడం, అన్వేషించడం, వివిధ కోణాలలో ఆలోచించడం అనే దృక్పథాన్ని చిన్నప్పటి నుంచే అభివృద్ధి చేయాలి.

- సి. సాయిరుత్విక్, నల్గొండ

### కఠిన శిక్షలు విధించాలి

పదహారేళ్ళ వయసున్న అమ్మాయిని ఓ ముగ్గురు యువకులు అందులో ఇద్దరు మైనర్లు అత్యాచారం చేసారన్న వార్త కొత్త విషయమేమీ కాకున్నా మనసులను కలచివేసింది. రోజు రోజుకు ఈ ఆకృత్యాలు పెరుగుతున్నా వీటిని నిర్మూలించలేకపోతున్నాయి ప్రభుత్వాలు. రేపులకు పాల్పడిన వారికి జీవితాంతం, లేదా కనీసం ముప్పై ఏళ్ళు కఠిన కారాగార శిక్ష విధించాలి. అవసరమయితే క్రిమినల్ చట్టాన్ని సవరించాలి. ఇటువంటి శిక్షపడిన వారిని చూస్తే యితరులు నేరం చేయడానికి భయపడాలి. మన శిక్షాస్మృతిలో దీనిని డిటరెంట్ పనిష్మెంట్ అంటారు. దీనికన్నా కఠినమైనది రెట్రిబ్యూటివ్. ఈ శిక్షణను ఇంత వరకుమనదేశంలో అమలుపరచిన దాఖలాలులేవు. అత్యాచారాలకుఆనకట్టలేకుండాపోతుంది.సుప్రీంకోర్టు వారు ఆలోచించాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### పెరుగుతున్న డిజిటల్ మోసాలు

డిజిటల్ యుగంలో సాంకేతికత జీవితం సులభతరం చేస్తున్న కొద్దీ, అదే సాంకేతికతను ఆయుధంగా మలచుకుని మోసాలకు పాల్పడే శక్తులు కూడా పెరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో అత్యంత ప్రమాదకరంగా మారుతున్న సైబర్‌నేరాలలో కృత్రిమ మేధ ఆధారిత నకిలీ రూపకల్పన మోసాలు ముఖ్యమైనవిగా నిలుస్తున్నాయి. మనిషి ముఖం,స్వరం,మాటతీరు, భావప్రకటనలను అసలైనట్లే అనుకరించి నకిలీ దృశ్యాలు, ధ్వనులు సృష్టించడం ఇప్పుడు నేరగాళ్లకు సులభమైంది. వినోదం, పరిశోధన కోసం ఉపయోగించాల్సిన ఈ సాంకేతికత, ప్రజల నమ్మకాన్ని దోచుకునే సాధనంగా మారడం ఆందోళనకరం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### కాలుష్య నియంత్రణ చేపట్టాలి

నగరాల్లో రోజురోజుకు వాయు కాలుష్యం పెరిగిపోతున్నది. కట్టెలు,వ్యవసాయ వ్యర్థాలు వల్ల ఏహానీలేదు.ప్రస్తుత పరిస్థితుల్లో గాలిలోకి ప్రవేశించి వాతావరణాన్ని కలుషితం చేసే పొగలు చాలా ప్రమాదం. కొన్ని ఆ ప్రాంతంలో ఉన్న వారికి తక్షణమే శ్వాసకోశ ఇబ్బందితో ప్రమాదం వస్తుంది. కేవలం భోగీ మంట సందర్భం మాత్రమే కాక సాధారణంగా కూడా వాటిని గుర్తించి నిరోధించాలి. ముఖ్యంగా వీధిచివరి ఇటువంటి మంటలు ఎన్నో కనిపిస్తున్నాయి. వాటిలో నిషేధిత వస్తువులు వేసే పనివల్ల అందరికీ ముప్పు అని గుర్తెరగాలి. ఆ విధంగా సంప్రదాయ విధంగా భోగిని జరుపుకోవడం మన విధి.

- బి. ఆంజనేయులు, విశాఖపట్నం

# ఊడిగం చేస్తేనే ఉన్నత పదవులా?



ఎం. నారాయణ స్వామి

ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఊడిగం తప్పదు. ప్రమోషన్లు, ఉన్నత పదవుల కోసం 'హుజూర్' అంటూ పోలీసు అధికారులు, ఉన్నతాధికారులు అధికార పార్టీ నేతలకు సేవలు చేస్తున్నారు. అక్రమ సంపాదన కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. అధికార పార్టీ అన్యాయం కేసులకు న్యాయం చేస్తున్నారు. అధికార పార్టీ దుర్మార్గాలు, దౌర్జన్యాలను కవచంలా కాపాడుతూ ఆయా పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల మెప్పులను పొందుతున్నారు. ప్రమాదకరమైన కేసుల్లో కీలకమైన నాయకులు చిక్కుకుపోతే వారిని రక్షించి, ఆయా కేసులను తారుమారు చేసేస్తున్నారు. పాలించే నేతల ఆదేశాల ప్రకారం కీలకమైన కేసులలో నిర్బంధించిన వారిపై చర్యలు తీసుకొంటున్నారు. ఇలాంటి దుస్థితి తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, దేశంలోని మిగితా రాష్ట్రాల్లోనూ అలుముకొని ఉంది. పోలీసులు కఠినంగా, సమర్థంగా విధులను చేపట్టడం లేదని చెప్పడానికి ఇటీవల రాష్ట్రాలలో జరిగిన అనేక సంఘటనలే సాక్ష్యం.రాజకీయ దాడులు పెరిగాయి. పోలీసువ్యవస్థ కట్టుదిట్టమైన, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం వలనే హింసా సంఘటనలు ఎక్కువయ్యాయి. అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీల అధినేతలు, ముఖ్యనాయకులు వారి కార్యకర్తలను రెచ్చగొట్టి చేతులు దులుపుకొంటున్నారు. ఆతర్వాత ఆయా కార్యకర్తలు ఒకరి మీద ఒకరు కక్షలు పెంచుకుంటూ శత్రువులుగా మారిపోతున్నారు. అదను చూసుకొని ఘర్షణలకు దిగుతున్నారు. కొన్నిచోట్ల బాంబులతో దాడులు చేస్తూ విధ్వంసం సృష్టిస్తున్నారు. మారణాయుధాలతో హత్యలు చేస్తూ శాంతికి భంగం కలిగిస్తున్నారు. కొందరు పోలీసులు ఖద్దర్ల సేవలో తన్మయం చెందుతున్నారు. విధినిర్వహణలు చేపట్టే ముందు ఖాకీలు చేసిన వాగ్దానాలన్నిటినీ వాకిట్లో మూటకట్టి, చట్టవ్యతిరేకులతో చేతులు కలిపి నోట్లకట్టల మూటలను కట్టుకుంటున్నారు. దోషులతో దోస్తీ చేస్తూ, నిర్దోషులను నిలువునా ముంచేస్తున్నారు. పాలించే వారి అడుగులకు మడుగులు ఒత్తుతూ అధికారాన్ని కాపాడుకుంటున్నారు. సమాజశ్రేయస్సు కన్నా ప్రజాప్రతినిధులే మిన్న అన్న పంథాలో ఖాకీలు పయనిస్తున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా పోలీసులకు ఊడిగం తప్పదు. నేరగాళ్లపై ఉక్కుపాదం మోపి, ప్రజల మాన, ధన, ప్రాణాలను కాపాడవలసిన పోలీసువ్యవస్థ అధికారి పార్టీ గుప్పిట్లోనలిగి పోతుంది. కింది స్థాయి అధికారుల నుంచి పై స్థాయి అధికారుల వరకు



వారి నైతిక విలువలనునేలమట్టం చేసి అధికార పార్టీ కనుసైగల్లో మెలుగుతూ పరిపాలన వ్యవహారాలను సాగిస్తున్నారు. లక్షలు ఖర్చు చేస్తే చాలు రోజులు తిరక్కముందే సివిల్ కేసులు పరిష్కారం అవుతున్నాయి. నెలలు, సంవత్సరాలు తరబడి చెప్పులుఅరిగేలా అధికారుల చుట్టూ తిరిగినా అమాయకుల కేసులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంటున్నాయి. ప్రజాప్రతి నిధులకు తలవంచకుండా, విధినిర్వహణలను పటిష్టంగా నిర్వహించాలి. ప్రజలకు అండగా నిలబడాలనుకున్న నిజాయితీ గల అధికారులను ప్రాముఖ్యత లేని విభాగాలకు బదిలీచేసి,వారి సేవలను తొక్కిస్తున్నారు.అధికార పార్టీ అస్తవ్యస్త పరిపాలన నచ్చక స్వచ్ఛందంగా రాజీనామాచేసిన ఐఎఎస్, ఐపిఎస్‌లు లేకపోలేదు. ఎన్నికలలో అధికారంలో ఉన్నపార్టీయే తిరిగి అధికారంలోకి వస్తే విధులునిర్వహించే పోలీసు ఉన్నతాధికారులు, అధికారులకు ధోకా ఉండదు. వేరే పార్టీ అధికారంలోకి వస్తేనే ఇబ్బందులు ఎదురవు తాయి. తెలంగాణ రాష్ట్రంలో గత రెండు పర్యాయాలు (2014,2018) జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో తిరిగి టిఆర్‌ఎస్ విజయదుందుభి మోగించి అధికారం చేజిక్కించు కోవడంతో పోలీసు అధికారులు, ఉన్నతాధికారులు యధా విధంగా విధులను కొనసాగించారు.వీరిలో కొంతమందిని కీలకమైన విభాగాలకు బదిలీచేసి నియమించారు. మరికొందరికి కోరుకున్న విభాగాలకు బదిలీ చేసారు. 2023 సంవ త్సరంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత బిఆర్‌ఎస్ ప్రభుత్వానికి 'హుజూర్' అన్న వారందరి పైన వేటుపడింది. కాంగ్రెస్‌కు జై కొట్టిన వారందరికి అవకాశా లు లభించాయి. 2014 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తెలుగు దేశం పార్టీలో విధులు నిర్వహించిన అధికారులను 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్‌ఆర్ సిపి ఆయా అధికారులను ప్రాముఖ్యత లేని విభాగాలలో నియమించి వారికి (వైఎస్ఆర్ సిపి)మద్దతు ఇచ్చిన అధికారులను అందలం ఎక్కించారు.2024సంవత్సరంలో జరిగిన ఎన్నికలలో తిరిగి తెలుగుదేశం పార్టీ విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. కీలకమైన, ముఖ్యమైన విభాగాలలో పనిచేస్తున్న ఉన్నతాధికారులు జిల్లా,డివిజన్లలో విధులు నిర్వహిస్తున్న అధికారులను బదలీ చేసి విఆర్‌లో ఉంచింది.దాదాపు 200 మంది కింద స్థాయి అధికారి నుంచి ఐపీఎస్ అధికారి వరకు పోస్టింగ్ ఇవ్వలేదు. సంవత్సరం తరువాత 140మంది అధికారులకు ప్రాముఖ్యత లేని విభాగాలకు బదలీ చేసి నియమించారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న మరో 60మంది డిఎస్పి, అదనపు ఎస్‌పిలను నియమించవలసి ఉంది. •

(రచయిత : సీనియర్ జర్నలిస్ట్)

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఏఐ సదస్సుతో విప్లవాత్మక మార్పులు



## మన్‌కీబాత్‌లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:** భారత సాంకేతిక రంగ అభివృద్ధిలో కృత్రిమమేధ ఇంపాక్ట్ సదస్సు ఒక కీలకమలుపు అని ప్రధానిమోడీ అన్నారు. ఈ సదస్సులో తాను ప్రపంచస్థాయి టెక్ లీడర్స్, సీఈఓలను కలుసుకున్నట్టు తెలిపారు. భారత్‌లో జరుగుతున్న అనేక ఆసక్తికర సాంకేతిక అంశాల గురించి వారికి వివరించానని అన్నారు. పశు పోషణ, వ్యవసాయ రంగంలో ఏఐ సాంకేతికతను ఎలా ఉపయోగిస్తున్నదీ వివరించానని, ఏఐతో రైతులు తమ పశు సంపద, పంటలను నిరంతరం ఓ కంట కనిపెట్టుకుని ఉండగలుగుతున్నారని తెలిపారు. భారత తయారీదారు, స్టార్టప్ సంస్థలు నాణ్యమైన వస్తువుల తయారీపై దృష్టిపెట్టాలని అన్నారు. వంకపెట్టడానికి వీలులేని వస్తుసేవలతో అంతర్జాతీయ స్థాయిలో గౌరవమన్ననలను పొందాలని సూచించారు. నెలవారీ రేడియో కార్యక్రమం మన్ కీ బాత్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. సృజనాత్మకతకు కేంద్రంగా దేశాన్ని నిలపాలని తెలిపారు. భారతీయ యువత, ఇన్నోవేటర్స్, వ్యాపారవేత్తలకు ఆ శక్తి ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. అవయవ దానానికి ముందుకొచ్చే వారిపై కూడా ప్రధాని ప్రశంసలు కురిపించారు. ఇటీవల మరణించిన కేరళ చిన్నారి ఆలిన్ షేరిన్ అబ్రహామ్‌ను గుర్తు చేశారు. మరణించిన తమ బిడ్డ అవయవాలతో ఐదుగురికి ప్రాణదానం చేసేందుకు ఆలిన్ తల్లిదండ్రులను అభినందించారు. 10 నెలల వయసున్న ఆలిన్ ఇటీవల జరిగిన యాక్సిడెంట్‌లో తీవ్ర గాయాలపాలై కన్నుమూసిన విషయం తెలిసిందే. తల్లిదండ్రులు ఆమె అవయవదానానికి అంగీకరించడంతో దేశంలోనే అత్యంత పిన్న వయసు అవయవదాతగా ఆలిన్ నిలిచింది. వలస సంస్కృతి, దిష్టాలను వదిలిపెట్టి భారతీయత వైపు మళ్లాలని ప్రధాని మోదీ తన ప్రసంగంలో సూచించారు. గతంలో ఎర్ర కోట వద్ద తను చేసిన ఆజాదీ కీ అమృత్ మహోత్సవ్ ప్రసంగాన్ని గుర్తు చేశారు. బానిస మనస్తత్వాన్ని వీడి ఆలోచనల్లో స్వతంత్రతను సాధించాలని పిలుపునిచ్చారు. డిజిటల్ అక్షరాస్యత, సైబర్ సెక్యూరిటీ ఆవశ్యకత గురించి కూడా ప్రధాని పేర్కొన్నారు. డిజిటల్ వేదిక వినియోగంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డిజిటల్ అంశాలపై అవగాహన పెరుగుతున్నా ఆన్‌లైన్ మోసాలు ఎక్కువవుతున్న వైనంపై ప్రజలను అప్రమత్తం చేశారు. కేవైసీ నిబంధనలు, ఇతర డిజిటల్ అంశాల గురించి అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. ఏఐఏడీఎంకే దివంగత నేత, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలితను కూడా ప్రధాని మంత్రి ప్రశంసించారు. ఈనెల 24న జయలలిత జయంతి నేపథ్యంలో ఆమెకు నివాళులు అర్పించారు. ఆమె తన జీవితాన్ని ప్రజాక్షేమానికి అంకితం చేశారని అన్నారు. తమిళనాడు ప్రజల మనసుల్లో ఆమె చిరస్థాయిగా నిలిచిపోయారని కీర్తించారు.

# భారత్-యుఎస్ వాణిజ్య చర్చలకు బ్రేక్

## వాషింగ్టన్ భేటీ వాయిదా!

**వాషింగ్టన్, ఫిబ్రవరి 22:** భారత్, అమెరికా దేశాల మధ్య కుదరాల్సిన అత్యంత కీలకమైన వాణిజ్య ఒప్పందంపై ప్రస్తుతానికి నీలినీడలు కమ్ముకున్నాయి. వాషింగ్టనన వేదికగా ఈ నెల 23 నుంచి మూడు రోజులపాటు జరగాల్సిన ఇరు దేశాల ప్రధాన చర్చాకర్తల సమావేశం అర్థాంతరంగా వాయిదా పడింది. ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను ఓ కొలిక్కి తెచ్చి, లీగల్ డ్రాఫ్ట్‌ను సిద్ధం చేయడమే లక్ష్యంగా ఈ సమావేశం జరగాల్సి ఉండగా అనూహ్య పరిణామాల నేపథ్యంలో దీనిని రీషెడ్యూల్ చేశారు.

**వాయిదా వెనుక అసలు కారణం ఏమిటి?**

పిటిఐ నివేదికల ప్రకారం.. ఈ భేటీ వాయిదా పడటానికి ప్రధాన కారణం అమెరికాలో వేగంగా మారుతున్న వాణిజ్య విధానాలేనని తెలుస్తోంది. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన 'రెసిప్రోకల్ టారిఫ్' విధానంపై అక్కడి సుప్రీంకోర్టులో ప్రతికూల తీర్పు రావడంతో ఈ చర్చల దిశను మార్చివేసింది. తాజా రాజకీయ, న్యాయపరమైన పరిణామాలు.. వాటి వల్ల కలిగే ఆర్థిక ప్రభావాలను లోతుగా విశ్లేషించడానికి ఇరు దేశాలకు మరింత సమయంల అవసరమని చర్చాకర్తలు భావించారు. ఈ నేపథ్యంలోనే పరస్పర అంగీకారంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు సమాచారం.

**ట్రంప్ టారిఫ్ నిరణయాల సెగ**

అమెరికా సుప్రీంకోర్టు తీర్పు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వానికి బిగ్ షాక్ ఇచ్చింది. సుంకాల విధింపుపై కోర్టు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో, అధ్యక్షుడు ట్రంప్ వెంటనే అప్రమత్తమయ్యారు. సెక్షన్ 122ను ఉపయోగించి భారత్ సహా ప్రపంచ దేశాలన్నింటిపై మొదట 10 శాతం గ్లోబల్ టారిఫ్ విధిస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఆ నిర్ణయం తీసుకునన 24 గంటల వ్యవధిలోనే ఆ పన్నును ఏకంగా 15 శాతానికి పెంచుతూ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ అనూహ్య మార్పుల వల్ల భారత్ నుంచి జరిగే ఎగుమ తులపై భారీ భారం పడే అవకాశం ఉండటంతో, చర్చల కొనసాగింపునకు ముందు వ్యూహాత్మక విశ్లేషణ అవసరమని భారత బృందం భావిస్తోంది.



**మార్చి ఒప్పందంపై నీలినీడలు**

కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ గతంలో వెల్లడించిన ప్రకారం ఈ కీలక వాణిజ్య ఒప్పందంపూ మార్చి నెలలో సంతకాలు జరగాల్సి ఉంది. ఏప్రిల్ నుంచి ఈ ఒప్పందాన్ని అమలులోకి తేవాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. అయితే తాజా పరిస్థితులు, వాషింగ్టన్ భేటీ వాయిదా పడటంతో ఈ గడుబు మారుతుందా లేదా అనే సందిగ్ధత నెలకొంది. లీగల్ డ్రాఫ్ట్ పూర్తి కాకపోతే ఒప్పందం కుదరడం కష్టమౌతుంది. ట్రంప్ ప్రభుత్వం విధిస్తున్న కొత్త టారిఫ్ నిబంధనలను భారత్ ఏవిధంగా ఎదుర్కోబోతుది? ఈ ఒప్పందం ద్వారా భారత్ పొందే ప్రయోజనాలు ఏమిటి? అనే అంశాలపై ఇప్పుడు అందరి దృష్టి నిలిచింది.

# అందుబాటులోకి ఆర్‌ఆర్‌టిఎస్



## రూ.12వేలకోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభించిన ప్రధాని మోడీ

**మీరట్, ఫిబ్రవరి 22:** దేశంలోనే తొలిసారిగా రూపొందిన నమో భారత్ రీజనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఆర్‌ఆర్‌టీఎస్)ను ప్రధాని మోడీ ఆదివారం ప్రారంభించారు. ఉత్తర ప్రదేశ్‌లోని మీరట్‌లో ఇది అందుబాటులోకి వచ్చింది. ఈ కారిడార్ మొత్తం పొడవు 82 కిలోమీటర్లు. అంటే 82 కి.మీ. దూరాన్ని 45 నిమిషాల్లో చేరుకోవచ్చు. ఇది దేశ రాజధాని ఢిల్లీని, సమీపంలోని ఇతర ప్రధాన నగరాలను కలుపుతుంది. ఈ రైలు మార్గం ద్వారా ఘజియాబాద్, సహీబాబాద్, మోదీనగర్, మీరట్‌ను అత్యంత వేగంగా చేరుకోవచ్చు. దీని ద్వారా ఆయా మార్గాల్లో కాలుష్య రహిత, ట్రాఫిక్ రహిత రవాణా సౌకర్యం కలగనుంది. ఢిల్లీమీరట్‌లోని ఈ రైలు మార్గం నిర్మాణానికి రూ.30,274 కోట్లు ఖర్చైంది. ఇది దేశంలోని తొలి ఆర్‌ఆర్‌టీఎస్ మార్గం. ఈ రైలు మార్గంలో 180 కిలోమీటర్ల వేగంతో రైలు ప్రయాణిస్తుంది. ఆర్‌ఆర్‌టీఎస్‌తోపాటు మీరట్ మెట్రో రైలును కూడా ప్రధాని ప్రారంభించారు. ఇది దక్షిణ మీరట్ నుంచి మోదీపురం మధ్య నడుస్తుంది. ఇది కూడా అత్యం వేగవంతమైన రైలు. గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. సౌత్ మీరట్ స్టేషన్ నుంచి మోదీపురం స్టేషన్ వరకు 23 కిలోమీటర్ల దూరాన్ని 30 నిమిషాల్లోపే చేరుకుంటుంది. ఈ రైలు సేవలు నేటి సాయంత్రం ఆరు గంటల నుంచి అందుబాటులోకి వస్తాయి. నమో భారత్, మీరట్ మెట్రో ఒకే స్టేషన్ సంబంధిత సేవల్ని వాడుకుంటాయి. మెట్రోను ప్రారంభించిన అనంతరం ప్రధాని మోడీ యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్‌తో కలిసి మీరట్ సౌత్ స్టేషన్ వరకు మెట్రోలో ప్రయాణించారు. ఢిల్లీమీరట్ మెట్రో సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ప్రతి 10 నిమిషాలకో ట్రైన్ నడుస్తుంది. ప్రస్తుతం మాత్రం ప్రతి 15 నిమిషాలకు ఒక ట్రైన్ నడుస్తుంది. నమో భారత్, మెట్రో రైలుతోపాటు రూ.12,390 కోట్ల విలువైన ప్రాజెక్టుల్ని ప్రధాని మోడీప్రారంభించారు. రైలు సర్వీసులను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మాట్లాడుతూ, ఉత్తరప్రదేశ్, అభివృద్ధి భారత్ దిశగా నూతన విప్లవం ఈరోజు ఊపందుకుందని, తొలిసారి ఒకే ఫ్లాట్‌ఫాం నుంచి ఒకేరోజు నమో భారత్ ర్యాపిడ్ రైలు, మెట్రో రైలు ప్రారంభమయ్యాయని అన్నారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పనితీరు తనకెంతో సంతృప్తి నిచ్చిందని, బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం పని సంస్కృతిని ఇవాల్టి కార్యక్రమం ప్రతిబింబిస్తుందని చెప్పారు. శంకుస్థాపన రాయి పడినప్పటి నుంచి రేయింబవళ్లు పనిచేసి ప్రాజెక్టును పూర్తి చేయడమే తమ వర్క్ కల్చర్ అని వివరించారు. మెట్రోలో ప్రయాణం అనంతరం మొహియిద్దీన్‌పూర్‌కు మోదీ వెళ్లారు. అక్కడి బహిరంగసభలో పాల్గొన్నారు. పశ్చిమ యూపీలో మౌలిక వసతులు, పట్టణాభివృద్ధి, ప్రజాపనులకు సంబంధించి రూ.12,930 కోట్ల విలువచేసే పలు అభివృద్ధి ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన చేశారు.

# పెళ్లిపీటలెక్కాల్సిన అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య

## జోధ్‌పూర్‌లో విషాదం నింపిన వివాహ వేదిక



**జోద్‌పూర్, ఫిబ్రవరి 22:** కొన్నిగంటలాగితే పెళ్లి కుమార్తెలుగా ఒకే వేదికపై కూర్చోవాల్సిన అక్కాచెల్లెళ్లు ఇదరూ ఆత్మహత్యచేసుకోవడంతో పెళ్లికి వచ్చిన బంధువులు కూడా కన్నీటి పర్యంతం అయ్యారు. రాజస్థాన్ రాష్ట్రం జోధ్‌పూర్ జిల్లాలోని మనాయ్ గ్రామంలో గుండెను పిండేసే ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ఆత్మహత్యలకు పాల్పడ్డ పెళ్లి కుమార్తెలు శోభ (25), విమ్ల (23) ఇద్దరూ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్లుగా పనిచేస్తున్నారు. శనివారం వారి పెళ్లిళ్లు జరగాల్సి ఉండటంతో శుక్రవారం అర్థరాత్రి వరకు ఇంట్లో పెళ్లి వేడుకలు, సంప్రదాయ బంధోలి కార్యక్రమం సందడిగా సాగాయి. శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఇద్దరూ పురుగుల మందు సేవించారు. వారి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే వారు మరణించినట్లు ప్రకటించారు. దాంతో మృతదేహాలను ఇంటికి తీసుకెళ్లిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. కానీ ఇంతలో మృతుల మేనమామ జస్వంత్ సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి అంత్యక్రియలను నిలిపేశారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. మరో ఐదు నిమిషాలు ఆలస్యం జరిగి ఉంటే అంత్యక్రియలు పూర్తయ్యేవని జస్వంత్ సింగ్ చెప్పారు. మృతదేహాలు నీలి రంగులోకి మారాయని, ఇది విష ప్రయోగంవల్ల జరిగిన ఆత్మహత్యేనని మృతుల మేనమామ ఆరోపించారు. బాధితుల బాబాయ్‌లు, ఈ పెళ్లిళ్ల విషయంలో తీవ్ర ఒత్తిడి తెచ్చారని, మొదట కుదిరిన పెళ్లి సంబంధాలను రద్దుచేసి, బాబాయ్‌ల ఒత్తిడి మేరకు పోఖ్రాన్ ప్రాంతానికి చెందిన వ్యక్తులతో పెళ్లిళ్లు నిశ్చయించారని చెప్పారు. ఈ బలవంతపు పెళ్లి ఇష్టంలేకనే తన మేనకోడళ్లు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. పోలీసులు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. పోస్టుమార్టంలో వారి మరణానికి పురుగుల మందే కారణమని తేలింది. వారు పురుగుల మందు తాగినట్లుగా ఆధారాలు లభించాయి. ఘటనా స్థలంలో ఎలాంటి ఆత్మహత్య లేఖ లభించలేదు. దీనిపై కుటుంబ సభ్యులందరినీ విచారిస్తున్నామని ఏడీసీపీ రోషన్ మీనా తెలిపారు.



# కిష్త్‌వార్‌లో ఎన్‌కౌంటర్: ఇద్దరు ఉగ్రవాదుల మృతి

**శ్రీనగర్, ఫిబ్రవరి 22:** జమ్మూకాశ్మీర్‌లోని కిష్త్‌వార్ జిల్లాలో ఆదివారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. తీవ్రవాదుల నుంచి రెండు ఏకే47 రైఫిళ్లను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. జమ్మూకాశ్మీర్‌లోని కిష్ట్వార్ జిల్లా ప్రాంతంలో ఇద్దరు ఉగ్రవాదులు ఉన్నట్లు ఇంటెలిజెన్స్ నుంచి సమాచారం అందింది. దీంతో ఆపరేషన్ ట్రాష్‌ఐ పేరుతో భారత భద్రతా బలగాలు వేట మొదలుపెట్టాయి. ఇందులో భాగంగా ఇక్కడి చాత్రూ ప్రాంతంలో దాక్కున్న ఉగ్రవాదుల కోసం జమ్మూకాశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్, ఐబీ దళాలు కలిసి సంయుక్తంగా ఆపరేషన్ ప్రారంభించాయి. మంచుతో నిండిన ఈ అటవీ ప్రాంతాన్ని బలగాలు చుట్టుముట్టాయి. పర్వత ప్రాంతంలోని ఒక మట్టి ఇంటిలో దాక్కున్న ఉగ్రవాదుల్ని ఉదయం 11 గంటల సమయంలో గుర్తించారు. ఈ క్రమంలో ఉగ్రవాదులు మన బలగాలపై కాల్పులు జరిపారు. దీంతో మన బలగాలు ఎదురు కాల్పులు ప్రారంభించాయి. కొంతసేపటి తర్వాత కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. ఉగ్రవాదుల స్థావరం నుంచి రెండు ఏకే47 తుపాకులు, అలాగే కొంత యుద్ధ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రాంతంలో ఇంకా సోదాలు కొనసాగుతున్నాయి. చాత్రూ ప్రాంతంలో ఇటీ వలఉగ్రవాదుల కార్యకలాపాలు ఎక్కువయ్యాయి. గత నెలలో ఆరుకుపైగా ఎన్‌కౌంటర్లుజరిగాయి. లష్కరే తొయిబా దేశంలో దాడులకు కుట్రపన్నిందన్న సమాచారం నేపథ్యంలో భారత భద్రతా దళాలు మరింత అప్రమత్తమయ్యాయి. ఈ నేపథ్యంలో భద్రతను కట్టు దిట్టం చేసి, తనిఖీలు నిర్వహిస్తున్నారు.

# కుమ్మరి కుటుంబానికి రూ.1.25 కోట్ల జీఎస్టీ నోటీసు

**రాయ్‌బరేలి, ఫిబ్రవరి 22:** ఉత్తరప్రదేశ్‌లోని రాయ్ బరేలీలో ఓ నిరుపేద కుమ్మరి కుటుంబానికి ఊహించని షాక్‌కు ఎదురైంది. మట్టి కుండలు అమ్ముకుంటూ జీవనం సాగించే మహమ్మద్ సయీద్‌కు, జీఎస్టీ విభాగం ఏకంగా రూ.1.25 కోట్ల పన్ను చెల్లించాలంటూ నోటీసులు పంపింది. రాయ్‌బరేలీ జిల్లా హార్‌చంద్‌పూర్ వాసి అయిన సయీద్, తన ఐదుగురు కుటుంబ సభ్యులను పోషించుకోవడానికి రోజంతా కష్టపడేవాడు. కొన్ని సంవత్సరాల క్రితం రుణం కోసం ప్రయత్నించినప్పుడు, ఓ వ్యక్తి ఆయన నుంచి పాన్, ఆధార్ కార్డులు తీసుకున్నాడు. అయితే లోన్ మంజూరు కాలేదు, ఆ పత్రాలు కూడా తిరిగి రాలేదు. ఇదే అదనుగా భావించిన కొందరు మోసగాళ్లు, ఆ పత్రాలను ఉపయోగించి



సయీద్ పేరు మీద బీహార్‌లోని పాట్నాలో నాలుగు కంపెనీలను రిజిస్టర్ చేసి, కోట్ల రూపాయల లావాదేవీలు నడిపారు. నిజానికి ఆరు నెలల క్రితమే జీఎస్టీ శాఖ నుంచి తొలి నోటీసు వచ్చింది. నిరక్షరాస్యుడైన సయీద్ దానిని పెద్దగా పట్టించుకోలేదు. ఈనెల 15న రెండోసారి నోటీసు రావడంతో, అనుమానంతో ఇతరులతో చదివించగా అసలు విషయం బయటపడింది. రూ.1.25 కోట్ల పన్ను బకాయి ఉందని తెలియగానే ఆ కుటుంబం కుప్పకూలిపోయింది. ఈ అన్యాయంపై న్యాయం చేయాలని కోరుతూ సయీద్ తన కుమారులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఈ ఘటనపై స్పందించిన జిల్లా అధికారులు, సయీద్ పత్రాలు దుర్వినియోగం అయినట్లు ప్రాథమికంగా గుర్తించి, దీనిపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ఇలాంటి మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో, ప్రజలు తమ ఆధార్, పాన్ కార్డుల వివరాలను అపరిచితులకు ఇచ్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.



# ఆఫ్ఘన్ సరిహద్దుల్లో పాక్‌దాడులు

## డజన్లకొద్దీ అమాయక పౌరులు మృతిచెందారన్న ఆఫ్ఘన్

## తగిన సమయంలో ప్రతీకారం తప్పదని పాకిస్థాన్‌కు హెచ్చరిక

**కాబూల్, ఫిబ్రవరి 22:** ఉగ్రవాదులే లక్ష్యంగా దాడులుచేసామని చెబుతూ ఆఫ్ఘనిస్థాన్ పై పాకిస్తాన్ దాడులకుతెగబడింది. పాకిస్తాన్ ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లోని నివాస ప్రాంతాలపై దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో పలువురు ఆఫ్ఘన్ పౌరులు మృతిచెందారు. తమ దేశంలో జరిగిన ఆత్మాహుతి దాడులకు ప్రతీకారంగా ఈ దాడులు నిర్వహించినట్లు పాకిస్తాన్ పేర్కొన్నది. నంగర్హర్, పాక్తికా ప్రావిన్స్‌లలో అర్ధరాత్రి దాటాక ఈ దాడులు జరిగాయి. తమ పౌరుల నివాసాలపై పాకిస్తాన్ బాంబులతో దాడి చేసిందని, ఈ ఘటనలో డజన్ల కొద్దీ చనిపోయారని ఆఫ్ఘన్ ప్రభుత్వ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ చెప్పారు. గాయపడిన వారిలో మహిళలు, చిన్నారులు ఉన్నారని తెలిపారు. ఈ దాడి ఘటనను పాకిస్తాన్ ధ్రువీకరించింది. ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా ఏడు టెర్రరిస్ట్ క్యాంపులపై దాడులు చేపట్టినట్లు ఆ దేశ సమాచారశాఖ మంత్రి తరార్ ఎక్స్‌లో పోస్టు చేశారు. పాకిస్తానీ తాలిబాన్, దాని అనుబంధ సంస్థలు లక్ష్యంగా చేసుకుని దాడులు చేసామన్నారు. ఐసిస్ అనుబంధ గ్రూప్‌పై సైతం దాడి చేసినట్లు తరార్ పేర్కొన్నారు. ఇటీవల ఇస్లామాబాద్‌లో మసీదులో జరిగిన ఆత్మాహుతి దాడిని తామే చేసినట్లు ఐసిస్ ప్రకటించుకుంది. ఈ ఘటనలో 31 మంది పాక్ పౌరులు మృతి చెందగా, 161 మంది గాయపడ్డారు. పాక్ వైమానిక దాడులు జరపడంపై ఆఫ్ఘనిస్తాన్ ఆగ్రహావేశాలు వ్యక్తంచేసింది. తగిన సమయంలో ప్రతీకారం తీర్చుకుంటామని తాజాగా హెచ్చరించింది. ఆఫ్ఘనిస్థాన్‌లో దాక్కున్న ఉగ్రవాదులను తాము టార్గెట్ చేశామని పాక్ ప్రకటించుకుంది. పాక్ ఎదుర్కొంటున్న అంతర్గత సవాళ్లను ఈ దాడులతో కప్పిపుచ్చలేరని వ్యాఖ్యానించింది. ఆఫ్ఘనిస్తాన్‌లో జాతీయ సంస్థలు, ప్రార్థనా కేంద్రాలపై జరిగిన ఈ దాడులు పాక్ నిఘా, భద్రతా వ్యవస్థల వైఫల్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించింది. తగిన సమయంలో దీటుగా జవాబు చెబుతామని హెచ్చరించింది. అంతర్జాతీయ చట్టాలను పాక్ ఉల్లంఘించిందని మండిపడింది. పొరుగుతో సఖ్యతగా ఉండాలన్న కనీస ఇస్లామిక్ విలువలను నిలువుకోలేకపోయిందని మండిపడింది. నంగర్హర్, పక్తికా ప్రావిన్సుల్లో జరిగిన ఈ దాడుల్లో మహిళలు, చిన్నారులు సహా డజన్ల కొద్దీ సాధారణ పౌరులు కన్నుమూశారని తెలిపింది. తమ దేశ ప్రాదేశిక సమగ్రత, ప్రజల భద్రత పరిరక్షణే తమ తొలి ప్రాధాన్యమని అఫ్ఘనిస్థాన్ రక్షణ శాఖ ఎక్స్ వేదికగా పేర్కొంది. అది తమ చట్టబద్ధ బాధ్యత అని పేర్కొంది. కాబట్టి, తగిన సమయంలో, తగిన రీతిలో దీటుగా బదులిస్తామని వ్యాఖ్యానించింది. తమ భూభాగంలో జరిగిన పలు ఆత్మాహుతి దాడుల వెనక అఫ్ఘనిస్థాన్ ప్రేరేపిత ఉగ్ర శక్తులు ఉన్నాయని పాక్ ఆరోపిస్తుంటే తాలిబాన్లు మాత్రం పాక్ ఆరోపణలను ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతున్నారు. తమ భూభాగంలో ఉగ్రకార్యకలాపాలకు స్థానం లేదని ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేశారు.

## లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు: 10 మంది మృతి, 50 మందికి గాయాలు



**బీరూట్, ఫిబ్రవరి 22:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. లెబనాన్‌లోని బెకా లోయ లక్ష్యంగా ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడిలో ఓ సీనియర్ హిజ్బుల్లా ఫీల్డ్ కమాండర్‌తో సహా 10 మంది మరణించారు. మరో 50 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. నవంబర్ 2024లో రెండు దేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత జరిగిన అతిపెద్దదాడి ఇదే కావడం గమనార్హం. కాగా ఈ ఘటనపై లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పం దించింది. మృతుల్లో సాధారణ పౌరులు కూడా ఉన్నారని, గాయపడిన వారిలో చిన్నారులు ఉన్నారని తెలిపింది. మరణించిన 10మందిలో ముగ్గురు చిన్నారులు ఉన్నట్లు కొన్ని నివేదికలు పేర్కొం టున్నాయి. ఈ దాడితో బెకా లోయ ప్రాంతం శోక సంద్రంలో మునిగిపోయింది. మరోవైపు ఈ దాడిని ఇజ్రాయెల్ ధ్రువీకరించింది. తమపై దాడి చేసేందుకు హిజ్బుల్లా సన్నాహాలు చేస్తున్నట్లు కచ్చితమైన సమాచారం అందడంతోనే ఈ చర్యలు తీసుకున్నామని తెలిపింది. బెకా లోయలోని హిజ్బుల్లా కమాండ్ సెంటర్‌ను లక్ష్యంగా చేసుకుని దాడి చేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. అయితే ఈ ఘటనపై హిజ్బుల్లా వైపు నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. తాజా పరిణామంతో ఇరుదేశాల మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరిగే అవకాశం కనిపిస్తోంది.

# సంక్షిప్తంగా..

## రూ.5కోట్ల విదేశీ సిగరెట్లు స్వాధీనం



**అమ్మాదాబాద్, ఫిబ్రవరి 22:** భారత జలాల్లోకి ప్రవేశించిన ఒక ఇరాన్ బోటును భారత కోస్ట్ గార్డ్ అడ్డు కున్నది. రూ.5 కోట్ల విలువైన విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నది. ఆ బోటులో ఉన్న నలుగురు ఇరాన్ పౌరులను అదుపులోకి తీసుకున్నది. గుజరాత్ తీరంలోని అరేబియా సముద్రంలో ఈ సం ఘటన జరిగింది. ఈనెల 21వ తేదీన ద్వారకాకు పశ్చిమాన సుమారు 115 నాటికల్ మైళ్ల దూరంలో అనుమానాస్పద విదేశీ పడవను భారత కోస్ట్ గార్డ్ సిబ్బంది గుర్తించారు. షిప్‌లో ఆ బోటు వద్దకు చేరుకున్నారు. కాగా, భారత సముద్ర జలాల్లో ఉన్న ఆ బోటు ఇరాన్‌కు చెందినట్లు భారత కోస్ట్ గార్డ్ సిబ్బంది తెలుసుకున్నారు. ఆ బోటులో 200 కార్టన్ల విదేశీ బ్రాండ్ సిగరెట్లు ఉన్నట్లు గుర్తించారు. రూ.5 కోట్ల విలువైన సుమారు లక్ష ప్యాకెట్ల విదేశీ బ్రాండ్ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు.

## కర్ణాటకలో 16యేళ్లలోపు మైనర్లకు మొబైల్‌ఫోన్లు బంద్!




**బెంగళూరు, ఫిబ్రవరి 22:** పిన్నవయసు పిల్లలు స్మార్ట్‌ఫోన్లకు బానిసలుగా మారుతూ మానసిక అనా రోగ్యం కొనితెచ్చుకోవడంతోపాటు చదువులో రాణించలేకపోతున్నారని నిర్ణయించిన కర్ణాటక ప్రభుత్వం 16 ఏళ్లలోపు విద్యార్థులు మొబైల్ ఫోన్ వాడకాన్ని నిషేధించే ప్రణాళికను పరిశీలిస్తోంది. ఈ అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్ని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల అభిప్రా యాన్ని కోరారు. విద్యార్థులలో సోషల్ మీడియా వ్యసనం, మాదకద్రవ్యాలకు గురయ్యే ప్రమాదం పెరు గుతున్నందున, ప్రభుత్వం ఈ చర్య తీసుకుంటోంది. ఆస్ట్రేలియా వంటి ఇతర దేశాల ఉదాహరణలను ఉటంకిస్తూ, విద్యార్థుల ప్రవర్తన, విద్య, మానసిక ఆరోగ్యంపై మొబైల్ ఫోన్ల ప్రభావం గురించి ముఖ్యమంత్రి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

## పోలీస్ వాహనాన్ని ఢీకొట్టిన ట్రక్కు: ఐదుగురు మృతి



**ఝార్సుగూడ(ఒడిశా), ఫిబ్రవరి 22:** ఒడిశాలోని ఝార్సుగూడ జిల్లా లో ఆదివారం తెల్లవారుజామున పెను విషాదం చోటుచేసుకుంది. జాతీయ రహదారిపై, ఝార్సుగూడ సదర్ పోలీస్ స్టేషన్ సమీపంలో పోలీసులు ప్రయాణిస్తున్న బొలెరో వాహనాన్ని, వేగంగా దూసుకొచ్చిన ట్రక్కు బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఐదుగురు పోలీసులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడటంతో వారిని దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. ట్రక్కు ఢీకొన్న వేగానికి బొలెరో వాహనం నుజ్జునుజ్జు అయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను ఆస్పత్రిలో చేర్పించారు. మరణించిన సిబ్బందిని సాయుధ పోలీస్ రిజర్వ్ కానిస్టేబుళ్లు కాశీరామ్ భోయ్, దేబేంద్ర సా, హవల్దార్ లింగరాజ్ ధరువా, సబ్‌ఇన్‌స్పెక్టర్ నిరంజన్ కుజుర్, హోంగార్డు భక్త బంధు మిర్ధాగా గుర్తించారు.

## ఉత్తర చెన్నైనుంచి టివికె చీఫ్ విజయ్ పోటీ



**చెన్నై, ఫిబ్రవరి 22:** రాబోవు తమిళనాడు ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం (టివికె) పార్టీ కీలకంగా మార నుంది. తాజాగా తమిళనాడు ఎన్నికల్లో పోటీకి రోడ్ మ్యాప్ సిద్ధం చేసుకుంటున్నారు టీవీకే చీఫ్‌విజయ్ నార్త్ చెన్నై నుంచి పోటీకి విజయ్ రెడీ అయ్యారు. ఉత్తర చెన్నైలోని ఒక నియోజకవర్గం నుంచి విజయ్ పోటీ చేస్తారన్న టీవీకే ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. నార్త్ చెన్నై వెనుకబాటుకు డీఎంకేనే కారణమంటున్న విజయ్ పార్టీ ఇప్పటికే ఆరోపిస్తోంది. నార్త్ చెన్నైని స్టాలిన్ ప్రభుత్వం నిరక్ష్యం చేసిందని అక్కడి నుంచే తాము పోటీ చేయాలనుకుంటున్నట్లు పార్టీ నిర్ణయించుకుంది.

## ఆమెకు 28, ఆయనకు 60



**పాట్నా, ఫిబ్రవరి 22:** బీహార్‌లోని ఔరాయ్ ప్రాంతానికి చెందిన 60ఏళ్ల ప్రైవేట్ స్కూల్‌యజమానిరాకేష్‌షా, అదే పాఠశాలలో పనిచేస్తున్న 28 ఏళ్ల ఉపాధ్యాయురాలు షైస్తాపర్వీన్‌తో ప్రేమలోపడ్డారు. రహస్యంగా నేపాల్‌లోని ఒక ఆలయంలో వివాహంచేసుకున్నారు. ప్రస్తుతం వీరి పెళ్లికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# ఆదాయం ఉన్నా విడుదల కాని నిధులు

## వ్యవసాయ మార్కెట్లలో సమస్యల తిష్ట

## నెలల తరబడి పెండింగ్‌లో వేతనాల బిల్లులు

## జేబుల్లోంచి చెల్లిస్తున్న క్షేత్రస్థాయి అధికారులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ల నిర్వ హణ అస్తవ్యస్తంగా మారింది. గణనీయంగా ఆదాయం వస్తున్నా మార్కెట్ కార్యాలయాల్లో సరిపడినంత సిబ్బందిని నియమించడంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ నిర్లక్ష్యం చేస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో రైతులు సైతం తమ ఉత్పత్తులను గిట్టుబాటు ధరకు విక్రయిం చడంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. మార్కెట్ కార్యా లయాల్లో 25 మంది వరకు సిబ్బంది అవసరం ఉంటే 10 నుంచి 12 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు.ఇక ఉద్యోగులు రిటైర్ అయినా, దీర్ఘకాలిక సెలవులపై వెళ్తే విధుల్లో ఉన్న సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. దీంతో రోజువారీ కూలీలతో పనిచేయించుకోవాల్సి వస్తోందని క్షేత్రస్థాయి అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అసంతృప్తి మార్కెటింగ్ ఉన్నతాధికారులకు తల నొప్పిగా మారింది. వేతనాల విష యంలో రోజూ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నిల దీస్తుంటే సమాధానం చెప్పలేక తమ జేబుల్లోంచి ఇవ్వాల్సి వస్తోందని వాపోతున్నారు. సిబ్బంది వేతనాల తాలుకు బిల్లులు ఇవ్వాలని కోరితే ఉన్నతాధికారుల నుండి స్పందన కరువవుతోందని పలు వ్యవసాయ మార్కెట్ల ప్రధాన అధికారులు వాపోతున్నారు. సిబ్బంది వేతనాల విషయమై 6 నెలలుగా శాఖ మంత్రి తుమ్మల,మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ వద్ద మొర పెట్టుకున్నా ఫలితం ఉండడం లేదని, రేపు మాపు అంటూ సర్ది చెప్పడం తప్ప బిల్లులు చెల్లింపుకు నోచుకోవడం లేదని చెబుతున్నారు. గత 6 నెలల నుంచి సుమారు రూ.240 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

వాస్తవానికి ఏ శాఖా సమకూర్చని ఆదాయం ఇస్తూ రైతులకు, ప్రజలకు వ్యవసాయ మార్కెట్లు విశేష సేవలందిస్తున్నాయి. అయితే నెలవారీగా చెల్లించే నిధులను విడుదల చేయడకపోవడంతో మార్కెట్లలో తాగునీరు, చెత్త తొలగింపు, కరెంటు బిల్లు, సిబ్బంది బీమా, స్టేషనరీ కోసం అధికారులు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని మార్కెట్ల నిర్వాహకులు వాపోతున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 205 మార్కెట్లు ఉంటే వాటి ద్వారా ఆదాయం రూ.600 కోట్ల వరకు ఫీజుల రూపంలో వస్తోంది. ఇందులో నుంచి ఉద్యోగుల వేతనాలు, పింఛన్లు, నిర్వహణ ఖర్చులు చెల్లించాలి. కానీ ఇప్పటివరకు వాటికి అతీగతి లేదు. అదే విధంగా మార్కెట్లలో ఉన్న కార్యాలయాల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది.

పారిశుధ్య పనుల కోసం 1,870 మంది సిబ్బంది అవసరం కాగా నెలనెలా చెల్లించకపోవడంతో చాలామంది విధులు మానేస్తున్నారు. ప్రస్తుతం 495 మంది శానిటేషన్ పనులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బోయిన్‌పల్లి, గుడి మల్కాపూర్, కూకట్‌పల్లి మార్కెట్లకు రోజుకు లక్షలాది మంది రైతులు తాము పండించిన ఉత్పత్తులు తీసుకొచ్చి నేరుగా వినియోగదారులకే విక్రయిస్తున్నారు. దీంతో పాటు సరుకుల కొనుగోలుకు ఒక మార్కెట్‌కు రోజు 25 వేల మంది వస్తుంటారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో చాలా మంది అటువైపు చూడటం లేదు. పార్కింగ్‌స్థలం వద్ద ఉండాల్సిన సెక్యూరిటీలు చాలా మంది విధులకు రావడం లేదు. దీంతో అక్కడ వాహనాలు నిలిపితే బయటకు వెళ్లడం కష్టంగా మారింది. పార్కింగ్ సమస్య ఉండటంతో కొనుగోలుదారులు షాపింగ్ మాల్ వైపు వెళ్తున్నారు. కొనుగోలుదారుల సంఖ్య తగ్గితే చిరు వ్యాపారులు నష్టపోతారు.

దీని ద్వారా మార్కెట్‌కు వచ్చే ఆదాయం తగ్గుతోంది. ఈ ఏడాది నుంచి స్వీపర్లుగా పనిచేసే వారికి ప్రత్యేక దుస్తుల కోసం ఇచ్చే రూ.1,500 కూడా ఇవ్వడం లేదు. హమాలీ, దడువాయి, చాటావాలా, గుల్లావాలా వంటి వారికి పీఎంఎస్‌బీవై బీమా కూడా అమలు కావడం లేదు. మరోవైపు ధాన్యం కొనుగోలు సమయంలో కేంద్రాల్లో వినియోగించే ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్లు, ప్యాడీ డ్రైయర్లకు 6 నెలలకోసారి చేసే మరమ్మతుల తాలూకు బిల్లులు కూడా విడుదల కావడం లేదని క్షేత్రస్థాయి అధికారులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ మార్కెట్‌శాఖ నుంచి ఆదాయం పెద్ద మొత్తంలో వస్తున్నా వ్యయం తాలూకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా ఉన్నతాధికారులు పెడచెవిన పెట్టడంపై మండిపడుతున్నారు. త్వరలో జరిగే మంత్రివర్గ సమావేశంలో వ్యవసాయ మార్కెటింగ్‌శాఖలో నెలకొన్న ఆర్థిక సమస్యలపై చర్చించి సమస్యలు పరిష్కరించాలని సిబ్బంది కోరుతున్నారు.

# సిటీ పోలీసు విభాగంలో ఎస్‌పిఒల భర్తీలు

## మాజీసైనికులు, విశ్రాంత పోలీసు, పారామిలటరీ సిబ్బందికి అవకాశం

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** హైదరాబాద్ పోలీసు విభాగంలో 138 స్పెషల్ పోలీసు ఆఫీసర్స్ (ఎస్‌పిఒ) పోస్టుల భర్తీకి పోలీసు శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. తెలంగాణకు చెందిన మాజీ సైనికులు, విశ్రాంత పోలీసు, పారా మిలటరీ బలగాలకు చెందిన వారు ఇందుకు అర్హులు. మాజీ సైనికులకు 58 యేళ్ల వయస్సు, విశ్రాంత పోలీసు, పారా మిలటరీ బలగాల సిబ్బంది పదవీ విరమణ చేసిన రెండేళ్లలోపు అయి వుండాలి. వీ రికి గరిష్ట వయస్సు 62 యేళ్లుగా నిర్ణయించారు. ఎస్‌పిలుగా ఎంపికైన వారికి నెలకు 26 వేల రూపాయల వేతనం ఇస్తారు. ప్రత్యేకంగా సెలవులు వుండవు. అత్యవసర సమయాలలో సెలవులు తీసుకుంటే వేతనం ఇవ్వరు. తగిన పత్రాలు వున్న వారు పేట్లాబూర్జులోని సిటీ సాయుధ బలగం కార్యాలయంలో దరఖాస్తు చేయాల్సి వుంటుంది. మార్చి నెల ఐదవ తేదీ సాయత్రం ఐదు గంటల వరకు దరఖాస్తు చేసుకునే వీలుంది. సిటీ సాయుధ బలగం డిసిపి వెంకటేశ్వర్లు ఆదివారం నాడు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.


# విద్యుత్ ట్రాన్స్‌కోలో 1,973 అప్రెంటిస్ ఖాళీల భర్తీ.. నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** నిరుద్యోగులకు తెలంగాణ ట్రాన్స్ మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ట్రాన్స్కో) గుడ్‌న్యూస్ చెప్పింది. టీజీ ట్రాన్స్‌కోకి చెందిన హైదరాబాద్‌లోని కార్పొరేట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ అప్రెంటిస్‌షిప్ శిక్షణ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ కింద మొత్తం 1,973 అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేయనుంది. ఈ మొత్తం పోస్టుల్లో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ పోస్టులు 125, టెక్నీషియన్ (డిప్లొమా) అప్రెంటిస్ పోస్టులు 125 వరకు ఉన్నాయి. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఈఈఈ, ఈసీఈ, సీఎస్ఈ, మెకానికల్, సివిల్ లేదా ఐటీ విభాగాల్లో ఏదైనా ఇంజనీరింగ్ డిగ్రీలో ఉత్తీర్ణత పొంది ఉండాలి. డిప్లొమా అప్రెంటిస్ పోస్టులకు డీఈఈఈ, డీఈసీఈ, డీఎంఈ, డీసీఈ, డీసీఎస్‌సీ లేదా సంబంధిత విభాగంలో డిప్లొమా సర్టిఫికెట్ కలిగి ఉండాలి. అభ్యర్థులు తప్పనిసరిగా 2023, 2024, 2025 సంవత్సరాల్లో ఉత్తీర్ణత పొంది ఉండాలి. ఈ అర్హతలు కలిగిన వారు ఆన్‌లైన్ విధానంలో ఈ నెల 27 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎలాంటి రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఉండదు. అలాగే దరఖాస్తు రుసుము కూడా చెల్లించవల్సిన అవసరం లేదు. ఎంపికైన వారికి ఏడాది పాటు అప్రెంటీస్ శిక్షణ ఉంటుంది. శిక్షణ కాలంలో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ పోస్టులకు నెలకు రూ.17,500, డిప్లొమా అప్రెంటీస్ పోస్టులకు నెలకు రూ.15,000 చొప్పున స్టైపెండ్ చెల్లించనున్నట్లు నోటిఫికేషన్‌లో వెల్లడించింది.

# హైదరాబాద్‌లో కొనసాగుతున్న డ్రంకన్‌డ్రైవ్ దాడులు

## 492 మంది మందుబాబుల పట్టివేత

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** జంట నగరాలలో మందు బాబుల భరతం పట్టేందుకు డ్రంకన్‌డ్రైవ్ దాడులు కొనసాగుతూనే వున్నాయి. శుక్రవారం, శని వారం రాత్రుల్లో ట్రాఫిక్ పోలీసులు పలుచోట్ల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ దాడుల్లో మొత్తం 492 మంది మందు బాబులు పట్టుబ డ్డారు. వీరిలో 412 మంది ద్విచక్ర వాహనదారులు, 29 మంది ఆటో డ్రైవర్లు, 51 మంది కార్ల డ్రైవర్లు వున్నారు. పట్టుబడ్డ 205 మంది 51 ను ంచి 100 పాయింట్ల వరకు, 97 మంది 101 నుంచి 150 పాయింట్ల వరకు, 47 మంది 151 నుంచి 200 పాయింట్ల వరకు, 19 మంది 201 నుంచి 250 పాయింట్ల వరకు, నలుగురు 251 నుంచ 300 పాయింట్ల వరకు, 11 మంది 300 పాయింట్లకు మించి విపరీతంగా మద్యం సేవి ంచినట్లు తేలింది. వీరిని అరెస్టు చేసిన తరువాత వారి వాహనాలు జప్తు చేసి, కేసులు నమోదు చేశాక సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన తరువాత కోర్టుల్లో హాజరు పరుస్తారు. కోర్టులు వీరికి శిక్షలు విధిస్తాయని నగర జాయింట్ ట్రాఫిక్ పోలీసు కమిషనర్ జో యల్ డేవిస్ ఆదివారం మీడియాకు తెలిపారు.




# సాంకేతికత ఆధారంగా సాగుతో లాభాలు

## వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయం సాం కేతికత ఆధారంగా ముందుకు సాగాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. డ్రోన్లు, ఆధునిక వ్యవసాయ యంత్రాలు, స్మార్ట్ సాగు విధానాలు రైతులకు ఖర్చు తగ్గించి దిగుబడులు పెంచుతాయని చెప్పారు. రైతులు కొత్త సాంకేతిక పద్ధతులను స్వీకరిస్తే వ్యవసాయం లాభదాయకంగా మారుతుందని పిలుపునిచ్చారు. ఈ మేరకు హైదరాబాద్‌లో నిర్వహించిన అగ్రి షో-2026 కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ప్రదర్శనకు ఉంచిన వివిధ స్టాళ్లను పరిశీలించారు. హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ స్టేడియంలో జరుగుతున్న అగ్రి షోలో దేశవిదేశాలకు చెందిన సుమారు 500 సంస్థలు తమ వ్యవసాయ పరికరాలు, యంత్రాలు, నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఆదివారంతో సదస్సు ముగిసింది. వేలాదిమంది రైతులు ఈ ప్రదర్శనను సందర్శించి ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన పొందారు.రైతులు నేరుగా తయారీ సంస్థలతో మాట్లాడే అవకాశం కల్పించడంతోపాటువ్యవసాయ రంగంలో మార్పులు తీసుకురావడం ఈ అగ్రిషో ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు రాజిరెడ్డి తెలిపారు.

# కూరగాయల పంటల సాగుపై ముగిసిన సదస్సులు

## పంటల సాగుపై ఎఐసిఆర్‌పి 44వ ఎజిఎం పలు సిఫార్సులు

**హైదరాబాద్ (అత్తాపూర్), ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** రాజేంద్రనగర్‌లో కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్, కొండా లక్ష్మణ్ హార్టికల్చరల్ యూనివర్సిటీ, ఎఐసిఆర్‌పి ఆన్ వెజి టబుల్ క్రాప్స్, ఐసిఎఆర్ ఐఐవిఆర్, వారణాసి, ఉత్తరప్రదేశ్, వెజిటబుల్ రీసెర్చ్ స్టేషన్, హైదరాబాద్ సంయుక్తంగా కూరగాయల పంటలపై నిర్వహించిన సమావేశం ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా కూరగాయల పంటల సాగుపై ఎఐసిఆర్‌పి 44వ ఎజిఎం కొన్ని తుది సిఫార్స్‌లు చేశారు. ఈ సందర్భంగా వివిధ కేంద్రాల ద్వారా నివేదించబడిన రెసిస్టెంట్/టాలరెంట్ జెర్మ్‌ప్లాజమ్‌ను ఇతర కేంద్రాలు/హాట్‌స్పాట్‌లతో పంచుకుని, ఇతర బయోటిక్, అబియోటిక్ ఒత్తిళ్లకు దాని ప్రతిచర్యను అంచనా వేయడానికి వివిధ ప్రదేశాల్లో మూల్యాంకనం చేయవచ్చు, టమోటా, పుచ్చకాయ, బాటిల్ గోర్డ్, క్యాప్సికమ్, లేట్ కాలీఫ్లవర్ వంటి పంటల్లో హైబ్రిడ్ అభివృద్ధి లేదని ప్రధాన కేంద్రాలు ఈ సమస్యపై దృష్టి పెట్టాలని బాక్టీరియల్ విల్ట్, ఫ్యూసేరియం విల్ట్ హాట్‌స్పాట్ ప్రాంతాల్లో, అంతర్నిర్మిత సహనం/నిరోధకత కలిగిన హైబ్రిడ్లను మాత్రమే పరీక్షి ంచాలి. ప్రతి లక్ష్యంగా చేసుకున్న వ్యాధికి రెండుమూడు హాట్‌స్పాట్‌లను గుర్తించాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా, ఏదైనా వ్యవసాయ వాతావరణ మండలంలో అధిక దిగుబడి పనితీరుతోపాటు హాట్‌స్పాట్ పరిస్థితుల్లో నిరోధకతను చూపించే ఎంట్రీలను సంబంధిత జోన్‌కు సిఫార్సు చేయడానికి పరిగణించాలని ట్రయల్ సూత్రీకరణ కోసం ఏకరీతి కొత్త రకాలను చేపట్టా లన్నారు. టమోటాలపై నానోయూరియా ప్రయోగం ఆకుల స్ప్రేలో నానోయూ రియా చికిత్సను సాధారణ యూరియాతో పోల్చాలని వ్యాధులను క్రమం తప్పకుండా పర్యవేక్షి ంచడం, బయోఇంటెన్సివ్ డిసీజ్ మేనేజ్‌మెంట్ ట్రయల్స్‌లో రసాయన శిలీంద్రనాశకాల వివేకవంతమైన ఉపయోగం నిర్ణయం తీసుకోవడం అన్ని కూరగాయలలో, దిగుబడి స్థాయికి బెంచ్ మార్క్ నిర్ణయించబడింది. ముందుగా పెంచిన పదార్థం ఇప్పటికే అందు బాటులో ఉన్నచోట, సంబంధిత కూరగాయల పంటలలో దాత లైన్లుగా ఏదైనా ఎంట్రీని సిఫార్సు చేయడానికి మూల్యాంకనం, ప్రదర్శన ప్రారంభించాలి. నిరోధక/తట్టుకోగల లైన్లను ఎన్‌బి పిజిఆర్‌తో నమోదు చేసుకోవాలి. ఆ తర్వాత బహుళస్థాన మూల్యాంకనం కోసం పంచుకో వాలన్నారు. వ్యాధికారక వ్యాధులను గుర్తించడం, వాటి నిర్వహణ కోసం వ్యాధి నిర్ధారణ కోసం ఎఐ సహాయక ఫినోటైపింగ్ సహాయం తీసుకోవాలని కూరగాయల నిల్వ చేసిన విత్తనాల విత్తన నాణ్యతపై హైడ్రోప్రైమింగ్ వ్యవధి ప్రభావం, హైడ్రోప్రైమింగ్ మిరపకాయ, దోసకాయ, బూడిద గుమ్మడికాయలో అంకురోత్పత్తిని గణనీయంగా మెరుగుపరిచింది. అందువలన, మిరపకాయ, దోస కాయల్లో 12 గంటలు హైడ్రోప్రైమింగ్, 18 వారణాసి పరిస్థితులలో తాజా, వయస్సు గల విత్తనాలకు (15 నెలల వరకు) బూడిద గుమ్మడికాయలో గంటలు సిఫార్సు చేశారు. వ్యవసాయ పర్య వేక్షణను సాధారణం నుండి కచ్చితమైన పరిశీలనకు మార్చడానికి ఎఐసిఆర్‌పి కేంద్రాలలో వ్యాధి నిఘా డేటా, ఛాయా చిత్రాల రికార్డు కోసం జిపిఎస్ కోఆర్డినేట్‌లు తప్పనిసరి పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఐసీఏఆర్ఏడీజీ డాక్టర్ సుధాకర్ పాండే, తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి.రాజీరెడ్డి, ఎఎన్‌డియుఎటి వీసీ డాక్టర్ బి.సింగ్, ఐఐవీఆర్ డైరెక్టర్ డాక్టర్ రాజేష్‌కుమార్, బెంగళూరులోని ఐఐహెచ్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ టికె బెహరా, ఎన్‌బిపిజిఆర్ డైరెక్టర్ డాక్టర్ జిపి సింగ్, మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ లావాండే, ఎన్‌ఐఆర్‌సిఎ డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్, డాక్టర్ లక్ష్మీనారాయణ, లోకల్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ అనితాకుమారి, డాక్టర్ చీనా, డాక్టర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి ఎడ్‌సెట్-2026 దరఖాస్తుల స్వీకరణ

## ఏప్రిల్ 18 తుది గడువు.. మే 12న పరీక్ష

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బిఈడి కాలేజీల్లో చేరడానికి నిర్వహించే ఎడ్‌సెట్-2026కి సంబంధించిన దరఖాస్తులను నేటి (సోమవారం) నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఇందుకు సంబం ధించిన నోటిఫికేషన్‌ను ఈ నెల 20న జారీ చేశారు. నేటి నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఏప్రిల్ 18 దరఖాస్తుల స్వీకరణకు తుది గడువు. అపరాధ రుసుం రూ. 250తో ఏప్రిల్ 22 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖాస్తు ఫీజు రూ. 750గా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాం గులకు రూ. 550గా నిర్ణయించారు. మే 12న రెండు సెషన్‌లలో పరీక్షను నిర్వహించనున్నారు. మొదటి సెషన్‌ను ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించనుండగా.. రెండో సెషన్‌ను సాయంత్రం 2 గంటల నుంచి 4గంటల వరకు నిర్వహించనున్నారు. పరీక్షను కాకతీయ యూనివర్సిటీ నిర్వహించనున్న సంగతి తెలిసిందే.

# జిఒ 190 ప్రకారమే తాత్కాలిక బదిలీలు, డిప్యుటేషన్లు చేపట్టాలి

## ఎమ్మెల్సీ మల్క కొమరయ్యకు ఉపాధ్యాయుల విజ్ఞప్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జీవో నంబర్ 190 ప్రకారమే తాత్కాలిక బదిలీలు, డిప్యుటేషన్లు చేపట్టాలని కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్యకి పలువురు ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యపై ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ మల్క కొమరయ్యను ఆదివారం సికిందరాబాద్ మహేంద్ర హిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులు 190జీవో అమలు చేస్తూ ఆయా జిల్లాలో డిస్లోకేటెడ్ ఉపాధ్యాయుల తాత్కాలిక బదిలీలు, డిప్యుటేషన్లకు అవకాశం కల్పించేలా ప్రభుత్వాన్ని తమ తరపున కోరాలని కోరారు. టీచర్ల తాత్కాలిక బదిలీలు, డిప్యూటేషన్ల సమస్యపై మండలిలో ప్రశ్నిస్తానని, సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని టీచర్లకు ఎమ్మెల్సీ కొమరయ్య భరోసా ఇచ్చారు. గతేడాది అక్టోబర్ నెలలో ఉపాధ్యాయుల సమస్యను చీఫ్ సెక్రటరీ, ఎడ్యుకేషన్ సెక్రటరీ యోగితా రాణా, జీఏడీల దృష్టికి తీసుకెళ్లి డిప్యూటేషన్లు అమలు చేయాలని ఒత్తిడి తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. 190 జీవో విడుదలై నేటికి 6 నెలలు దాటుతున్నా.. ఇప్పటికీ తాత్కాలిక బదిలీలు, డిప్యూటేషన్లు అమలు చేయడం లేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 25 ప్రకారం విద్యాశాఖలో జీవో 190 అమలు వల్ల కేవలం రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి వంటి పట్టణ ప్రాంతాలోని వారికే మేలు జరుగుతుందని, మిగతా రాష్ట్రంలో ఉన్న సుమారు 3000 మంది ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ జీవో అమలు మూలంగా వారంతా రోజుకు 200 నుంచి 300 కిలోమీటర్లు వెళ్లి విధులు నిర్వర్తించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నెంబర్ 25 ప్రకారం జీవో 190 అమలు చేస్తే ఉపాధ్యాయులు తమ సొంత జిల్లాలో ఖాళీలు ఉన్నప్పటికీ అక్కడకు వెళ్లలేని దుస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే జీవో నంబర్ 190 ప్రకారమే తాత్కాలిక బదిలీలు, డిప్యుటేషన్లు చేపట్టాలని ఎమ్మెల్సీకి విజ్ఞప్తి చేశారు. శాసనమండలిలో మాట్లాడతానని.. సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తానని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ఉపాధ్యాయులకి హామీ ఇచ్చారు.

# ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అధ్యాపకుల కొరత!


## 70 విభాగాల్లో ప్రొఫెసర్లు లేరు..

## 27 విభాగాల్లోనైతే ఒక్క బోధకుడు లేడు!

## కొత్తగా ఏర్పాటైన మెడికల్ కాలేజీల్లో మరీ దారుణం

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో కాబోయే వైద్యులకు బోధించడానికి ప్రొఫెసర్లు కరువయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 70 విభాగాల్లో ప్రొఫెసర్లు లేరు. ఇక 27 విభాగాల్లో అయితే బోధించడానికి కనీసం ఒక్క అధ్యాపకుడు లేడు. ఇక కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పరిస్థితులను చెప్పాల్సిన పనేలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 35 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉంది. కొత్తగా ఏర్పాటైన కాలేజీల్లో కొన్ని విభాగాలకు అధ్యాపకులు లేకపోగా.. పాత కాలేజీల్లో ఒకరిద్దరు అధ్యాపకులతో నెట్టుకొస్తున్నాయి. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో గతేడాది అరకొర ఫ్యాకల్టీతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ తనిఖీల సందర్భంలోనూ ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఈ ఏడాది కూడా అవే ఇబ్బందులతో మెడికల్ విద్యార్థులు తమ చదువును కొనసాగిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అధ్యాపకుల కొరత ఉందని జూనియర్ డాక్టర్లు చెబుతున్నారు. రిక్రూట్‌మెంట్ ద్వారా అధ్యాపకులను తీసుకోవాలని జుడాలు డిమాండ్ చేస్తున్నారు.

జూనియర్ డాక్టర్లు చెబుతున్న దానిప్రకారం భూపాలపల్లి, ములుగు, జోగులాంబ గద్వాల, ఖమ్మం, మెదక్ వైద్య కళాశాలల్లో సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్ విభాగంలో ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఒక్కరూ కూడా లేరు. ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీలో మైక్రో బయాలజీ, కొడంగల్ కాలేజీలో ఫార్మకాలజీ, బయో కెమిస్ట్రీ, ఫిజియాలజీ, నారాయణపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో ఫోరెన్సిక్ మెడిసిన్, టాక్సికాలజీ, నర్సంపేటలో ఫిజియాలజీ, నాగర్ కర్నూల్‌లో రేడియో డయాగ్నస్టిక్స్‌లో బోధించడానికి ఒక్కరూ కేడా లేరు. రాష్ట్ర వ్యాప్తంగా 27 విభాగాల్లో పాఠాలు బోధించేందుకు సీనియర్ రెసిడెంట్లు తప్ప రెగ్యులర్ అధ్యాపకులు లేరు. నేషనల్ మెడికల్ కమిషన్ తనిఖీలతోపాటు అకడమిక్ పర్యవేక్షణ, కరికులమ్ ప్రణాళిక, పీజీ శిక్షణకు సీనియర్ ఫ్యాకల్టీ ఆవశ్యకత ఎంతో ఉంటుంది. కానీ 150 విభాగాల్లో పాఠాలు బోధించే సీనియర్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సుమారు 70 విభాగాల్లో ప్రొఫెసర్లు లేక వైద్య కళాశాలల్లో బోధన సక్రమంగా జరగడం లేదు. పేరున్న గాంధీ, ఉస్మానియా, కేఎంసీలలో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. 120 వరకు విభాగాల్లో కేవలం ఒక్క అసిస్టెంట్ ప్రొఫెసర్ మాత్రమే ఉన్నారు. రాష్ట్రంలోని కొన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అధ్యాపకుల కొరత ఉండటంతో.. గత ఏడాది నేషనల్ మెడికల్ కౌన్సిల్ గుర్తింపుకి సైతం ఇబ్బంది పడాల్సి వచ్చింది.




ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న ఎంటిఎస్ యూనియన్ నేతలు

# పోస్టల్ సిబ్బంది సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

## పోస్ట్‌మెన్, ఎంటిఎస్ యూనియన్స్ ధర్నా

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** దీర్ఘకాలంగా పెండింగ్ ఉన్న పోస్టల్ సిబ్బంది సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పోస్టుమెన్, ఎంటీఎస్ యూనియన్స్ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో పోస్టల్ జాయింట్ కౌన్సిల్ ఆఫ్ యాక్షన్ ఆధ్వర్యంలో పోస్ట్‌మెన్ మరియు ఎంటీఎస్ యూనియన్స్ తెలంగాణ సర్కిల్ సిబ్బంది తమ సమస్యలపై పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంకు ఏఐపిఈయూ పీఎం, ఎంటీఎస్ యూనియన్ సర్కిల్ సెక్రటరీ ఎం.మధుసూదన్‌రావు, ఎన్‌యూపిఈ పిఎం, ఎంటిఎస్ యూనియన్ సర్కిల్ సెక్రటరీ ఎం.కృష్ణ, బిపిఈఏ(బిఎంఎస్) పిఎం ఎంటిఎస్ యూనియన్ సర్కిల్ సెక్రటరీ ఎస్.కె. లాల్ మియాలు ముఖ్య అతిధులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోస్టల్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, సిబ్బందిపై అధిక పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. న్యాయమైన సేవా నిబం ధనలు అమలుచేయాలని, ఉద్యోగుల హక్కులు గౌరవాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. పలుమార్లు సమస్యలపై యూనియన్ నేతలు సంబంధిత అధికారులను కలసి, విజ్ఞప్తి చేసినప్పటికీ సమ స్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలోని అధికారులు ఇప్పటికైనా పోస్టల్ సిబ్బంది న్యాయమైన సమస్యలపై, సానుకూలంగా స్పందించకపోతే, పోస్టల్ జాయింట్ కౌన్సిల్ ఆఫ్ యాక్షన్ తమ తదుపరి కార్యాచరణను ప్రకటించి, అవసరమైతే నిరవధిక సమ్మెకు వెళ్లేందుకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో యూనియన్ నాయకులు మహ్మద్, అశోక్, సీహెచ్ వెంకటయ్య, వై.ప్రసాద్, శ్రీకాంత్, రావూఫ్, శ్రీనివాసచారి, పి3 నాయకులు ఏ.శ్రవణ్ కుమార్, వెంకన్న, ఎం.కిషోర్, ఎంఎస్ బేగ్, బండి జయరాజు, ఎం.వెంకటే శ్వరరావు, జే.కిషన్, పోస్టల్ శాఖలోని ఇతర అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ ప్రవేశపరీక్షకు 18,859 దరఖాస్తులు

## ఏప్రిల్ 19న ఎంట్రన్స్ టెస్ట్

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న 194 మోడల్ స్కూల్స్‌లో 6వ తరగతిలో ప్రవేశాలతోపాటు, 7 నుంచి 10వ తరగతి వరకు ఉన్న ఖాళీల్లో సీట్లను భర్తీ చేయడం కోసం నిర్వహించే తెలంగాణ స్టేట్ మెడల్ స్కూల్స్ అడ్మిషన్ టెస్ట్‌కి రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 18,859 మంది దరఖాస్తు చేసుకున్నారు. 19,720 మంది పరీక్ష ఫీజు చెల్లించగా.. అందులో 18,859 మంది తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. దరఖాస్తులను ఈ నెల 28 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ హాల్ టికెట్లను ఏప్రిల్ 9 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఏప్రిల్ 19న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షను నిర్వహిస్తారు. 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడానికి ఏప్రిల్ 19న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అడ్మిషన్ టెస్ట్‌ను నిర్వ హిస్తారు. జనరల్ విద్యార్థులకు పరీక్షఫీజు రుసుం రూ. 200 కాగా, బిసి, ఎస్‌సి, ఎస్‌టి, దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ. 125గా నిర్ణయించారు. 6వ తరగతిలో ప్రవేశాల కోసం 12,524 మంది, 7వ తరగతిలో ప్రవేశాలకు 2569, 8వ తరగతిలో చేరడానికి 2181 మంది, 9వ తరగతిలో చేరడానికి 1314 మంది, 10వ తరగతిలో చేరడానికి 271 మంది దరఖాస్తు చేసుకున్నారు. మరో 861 మంది ఫీజును చెల్లించినప్పటికీ, దరఖాస్తులను అప్‌లోడ్ చేయాల్సి ఉన్నట్టు అధికారులు ప్రకటించారు. రాష్ట్రంలో ఉన్న అన్ని మోడల్ స్కూళ్లలో ప్రవేశపరీక్షను నిర్వహించనున్నారు.

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

# కుమ్మెర జాతరలో చిన్నారి మృతి కేసు.. నిందితులను కఠినంగా శిక్షించాలి

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** కుమ్మెర జాతరలో చిన్నారి మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర జాతరలో దైవదర్శనానికి వెళ్లిన రెండేళ్ల దళిత చిన్నారి అనుమానాస్పద మృతి అత్యంత విషాదకరమన్నారు. చిన్నారి మృతిపట్ల సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సంతాపం తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఘటనపై స్పందించి చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుం బాన్ని అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కుమ్మెర కొండపై ఉన్న ఆలయాన్ని కొందరు పెత్తందారులు తమ గుప్పిట్లో ఉంచుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతూ, ఆలయం దేవాదాయ శాఖ పరిధిలోకి రాకుండా అడ్డుకుంటున్నారని, కుల వివక్షతో దాడులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కుమ్మెర ఘటనలో చిన్నారి తల్లి కీర్తి ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకుండా, దాడి చేసిన పెత్తందారులు ఇచ్చిన ఫిర్యాదునే ముందుగా పరిగణనలోకి తీసుకోవడం వారి కుల వివక్షా పూరిత వైఖరిని స్పష్టం చేస్తోందన్నారు. ప్రజాసంఘాల పోరాటం తర్వాత శనివారం సాయంత్రం కేసు నమోదు చేశారని, రాష్ట్రంలో మహిళలు, సామాజిక న్యాయం ప్రశ్నార్థకంగా మారాయనడానికి ఈ ఘటనే నిదర్శనమన్నారు. బాధితుల ఫిర్యాదును నిర్లక్ష్యం చేసిన ఎస్ఐ ఇతర సిబ్బందిపై విచారణ జరిపి విధుల్లోంచి తొల గించాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చిన్నారి మృతికి కారణమైన దోషులను వెంటనే అరెస్టు చేసి, హత్య కేసులు నమోదు చేయాలని, బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాని జాన్ వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర విద్యా సదస్సులో ప్రొఫెసర్ కాశీం

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉందని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్,ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ కాసిం అన్నారు. స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్టీయూ టియస్) ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడలోని సంఘ భవనంలో రాష్ట్ర అధ్యక్షులు సదానందం గౌడ్ అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన విద్యా సదస్సులో ప్రొఫెసర్ కాశీం మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలలను మూసివేసే ఆలోచన విరమించుకోవాలని, విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకు రావాలన్నారు. ఎస్టీయూ సంఘం స్వాతంత్ర్యానికి పూర్వం ఏర్పడిన తొలి ఉపాధ్యాయ సంఘం అని కొని యాడారు. ప్రపంచంలో చిన్న చిన్న దేశాలు విద్యారంగంలో పోటీపడుతున్నాయని, తదనుగుణంగా రాష్ట్రంలో విద్యావిధానంలో సమూల మార్పులు అవసరమని వారు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో మానవ వనరులతోపాటు, భౌతిక వనరులను కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించరాదని, పాఠశాలలకు నాన్ టీచింగ్ పోస్టులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర అధ్యక్షులు జి సదానందం గౌడ్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డిఏ సాధన కోసం త్వరలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్ సమస్య పరిష్కరించి ఎంఇవో, డిప్యూటీ ఈవో, డైట్ లెక్చరర్ పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని, కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తు సి.ఆర్.టి ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, ఆర్థిక కార్యదర్శి సయ్యద్ సాబేర్ అలీ నాయకులు ఏ.వి.సుధాకర్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు



## బుద్ధవనం సందర్శించిన దక్షిణ కొరియా ప్రతినిధులు

**నాగార్జునసాగర్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** అంతర్జాతీయ ప్రమాణాలతో నాగార్జునసాగర్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బుద్ధవనాన్ని ఆదివారము నాడు సౌత్ కొరియా బుద్ధిష్ట్ స్టడీస్ నేషనల్ యూనివర్సిటీ కి సంబంధించిన ప్రతినిధులు సందర్శించారు. హైదరాబాదులో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న వీరు బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య సూచన మేరకు ఆదివారం బుద్ధవనాన్ని సందర్శించారు. సౌత్ కొరియా నేషనల్ యూనివర్సిటీ కి చెందిన విద్యా సాంస్కృతిక ప్రతినిధుల బృందం కాంగ్ సుంగ్ యోంగ్,చోయ్ సేంగహో, మిన్ క్యేయోంగ్ వూ, కవన్ జిన్ వోక్, శేషు, చిరాగ్ జలది తదితరుల బుద్ధవనం సందర్శనలో భాగంగా బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించిన అనంతరం బుద్ధ చరిత వనం, జాతకవనం, ధ్యాన వనం, స్తూప స్తూపవనాలను సందర్శించారు. స్థూప వనములో నిర్మించినటువంటి సౌత్ కొరియా మహాస్తూపాన్ని సందర్శించి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం మహా స్తూపం అంతర్భాగంలోని సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలను తెలిపే లఘు చిత్రాన్ని వీక్షించారు.

## మైనింగ్ ద్వారా రూ.3,998.51 కోట్ల ఆదాయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మైనింగ్ శాఖ ద్వారా రాష్ట్ర ఖజానాకు ఇప్పటి వరకూ రూ.3,998.51 కోట్లు సమకూరాయి. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌లో మైనింగ్ శాఖలో ప్రధానంగా ఖనిజాలు, ఇసుక ద్వారా రూ.7,585.14 కోట్ల మేర ఆదాయం వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. తదుపరి దీన్ని రూ.6,500 కోట్లకు తగ్గించింది. ఇందులో భాగంగా జనవరి నెలాఖరు వరకూ 70 శాతం మేర ఆదాయం సమకూరింది. వీటిలో బొగ్గు తదితర భారీ ఖనిజాల ద్వారా రూ.1,686.93 కోట్లు కాగా, చిన్న తరహా ఖనిజాలకు సంబంధించిన లీజు ద్వారా మరో రూ.1,561.03 కోట్లు సమకూరాయి. ఇవి కాకుండా ఇసుక ద్వారా రూ.750.55 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు చేరింది.

## అనుమానాస్పదస్థితిలో స్విమ్మింగ్‌పూల్‌లో విద్యార్థిని మృతి

**హైదరాబాద్ (అల్వాల్), ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** అనుమానాస్పద స్థితిలో స్విమ్మింగ్ పూల్‌లో విద్యార్థిని శవంగా మారింది. ఆదివారం సాయంత్రం అల్వాల్‌లోని సూర్యనగర్ కాలనీ సమీపంలో వివి స్పోర్ట్స్ అకాడమిలో స్విమ్మింగ్ పూల్ ఉంది. సిద్దిపేట్‌కు చెందిన వైష్ణవి(18) లయోలా కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరంలో చదువుతుండగా ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటోంది. ఈత నేర్చుకోవడానికి ఇటీవలే అకాడమిలో చేరింది. ఆదివారం సాయంత్రం ఈత నేర్చుకోవడానికి వచ్చిన ఆమె శవంగా మారడం పలు అనుమానాలకు తావిస్తోంది.

## హక్కులను అడుక్కోవడం కాదు పోరాడి సాధించుకోవాలి: చాడ

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** హక్కులను అడుక్కోవడం కాదు పోరాడితేనే సాధ్యమవుతాయని సిపిఐ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి చెప్పారు. సిఆర్‌పి యూనియన్ ఏర్పడి హక్కుల సాధనకై ఎఐటియుసి నాయకత్వాన్ని ఎన్నుకోవడం శుభపరిణామమన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ జరిగిన సర్వశిక్ష అభియాన్ సిఆర్‌పి యూనియన్ రాష్ట్ర సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ సదస్సులో సిఆర్‌పి తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ముఖ్య సలహాదారుగా ఎస్.బాల్, రాష్ట్ర అధ్యక్షుడిగా పాద్య నాగేశ్వర్‌రావు, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కడారి సునీల్, ప్రధాన కార్యదర్శిగా మిట్ట దేవేందర్, కోశాధికారిగా రామ్‌కుమార్, ఉపా కార్యదర్శిగా పోలే రమేష్‌ను ఎన్నుకున్నారు. తాను ఒక ఉపాధ్యాయుడినని వారు పడే బాధలు తనకు తెలుసునని చెప్పారు. ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించలేక అడ్డమైన దారుల్లో యువతను ఏదోరకం ప్రలోభ పెట్టి వారి శ్రమను దోపిడీ చేస్తున్నదని ఆరోపించారు.

## ఇందిర ఆలోచనలు అమలు చేసిన నేత రాజీవ్: విహెచ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఆలోచనలు ఇంప్లిమెంట్ నాయకుడు రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. పంచాయితీ రాజ్ ఎన్నికల్లో మహిళలకి అవకాశం ఇచ్చిన వ్యక్తి రాజీవ్ గాంధీ అన్నారు. తెలంగాణలో దేశానికే ఆదర్శంగా నిలిచేలా కుల గణన జరిగిందని, తెలంగాణ రాష్ట్రంలో బిసి రిజర్వేషన్‌పై అన్ని విధాలా కృషి చేశారన్నారు. చైర్మన్, మేయర్, ఉప సర్పంచ్ అంటూ మహిళలకి రిజర్వేషన్ కల్పించామన్నారు.




ఆవిష్కరణ సభలో ప్రసంగిస్తున్న రచయిత్రి ఓల్గా

## మహిళల్లో సాహిత్య పఠనం మరింత పెరగాలి: ఓల్గా

### ఘనంగా ముగిసిన తెలంగాణ సాహితీ దశాబ్ది ఉత్సవాలు

**హైదరాబాద్ (ముషీరాబాద్), ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** మహిళల్లో సాహిత్య పఠనం మరింత పెరగాలని ప్రముఖ రచయిత్రి ఓల్గా అభిప్రాయపడ్డారు. తెలంగాణ సాహితి దశాబ్ది ఉత్సవాలలో భాగంగా, ఆదివారం దోమలగూడలోని ఏ.వి.కళాశాలలో నిర్వహించిన తెలంగాణ సాహితి లిటరరీ ఫెస్ట్‌లో అంతరంగ పుస్తకం ఆమె ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ సాహితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.కే.సలీమ అధ్యక్షతన మహిళా సాహిత్యంపై జరిగిన చర్చలో ఓల్గా మాట్లాడుతూ మహిళలు తమ అంతరంగాలను ఆవిష్కరించటం అంత సులువు కాదని, మహిళలు పూర్తి స్థాయిలో తమ అంతరంగాన్ని బయటపెడితే అనేక ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. తమను తాము నిరూపించుకోవాలనే తపన ప్రతి మహిళలో ఉంటుందని, మహిళా సాహిత్యాన్ని వెలికి తీయటంపై మొదటి నుంచి అంత ప్రాధాన్యత ఇవ్వలేదని స్పష్టం చేశారు. సాహిత్యంలోని అన్ని ప్రక్రియల్లోనూ మహిళలు రాణించారని, వారి గురించి శోధించి, వెలికి తీయాల్సిన బాధ్యత నేటి యువరచయితలపై ఉందని పేర్కొన్నారు. ఇటు కుంటుంబాన్ని, అటు ఉద్యోగాన్ని సముపాళ్లలో చూసుకుంటూ తమలోని భావాలను పేపర్‌పై పెట్టే సమయం లేకుండా లోలోపల కుమిలిపోతున్నారని అన్నారు. మరో రచయిత్రి అమృతలత మాట్లాడుతూ అంతరంగ పుస్తకం మహిళలకు దిక్సూచి, ప్రేరణ కావాలని అన్నారు. వరకట్నం, బాల్యవివాహాలు తగ్గుముఖం పడుతున్నప్పటికీ, మహిళలకు మరో కొత్త సమస్యలు ఎదుర్కొనవలసి వస్తోందని, ఈ తరుణంలో తమ వ్యక్తిత్వాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత నేటి యువత పై ఉందని అన్నారు. రచయిత్రులు ఉప్పల పద్మ, సునంద, జ్వలిత, సంధ్య విప్లవ్, రూపారుక్మిణిలు మాట్లాడుతూ 52మంది మహిళా రచయితల అంతరంగాన్ని ఒకే పుస్తకంలో ఆవిష్కరించటం గొప్ప విషయమని అన్నారు.


# మూసీ సుందరీకరణ కాదు.. సీఎం రియల్ ఎస్టేట్ దోపిడీ

### మాజీమంత్రి హరీశ్‌రావు

### ఎఫ్‌టిఎల్ తేలలేదు, డిపిఆర్ లేదు

### ఇళ్లు కూల్చే బదులు నీళ్ల ట్యాంకులో విషం కలిపి చంపండి : బాధితులు

**హైదరాబాద్ (నార్సింగి) ఫిబ్రవరి 22, ప్రభాతవార్త :** మూసీ సుందరీకరణ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ దోపిడి చేస్తున్నారని, వచ్చే బడ్జెట్ సమావేశాల్లో బాధితుల పక్షాన బిఆర్ఎస్ పోరాడుతుందని మాజీ మంత్రి టి.హరీష్‌రావ్ పేర్కొన్నారు. ఆదివారం గండిపేట మండలంలో మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో ఇళ్లు కోల్పోతున్న మధుపార్క్ అపార్టుమెంట్ బాధిత కుటుంబాలను మాజీ మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, కృష్ణారావ్, బిఆర్ఎస్ ఇంచార్జి కార్తిక్‌రెడ్డిలతో కలిసి హరీష్‌రావ్ బాధిత ప్రజలను పరామర్శించారు. బిఆర్ఎస్ పార్టీ మీకు అండగా ఉండి పోరాడుతుందని వారికి భరోసా కల్పించారు. మాజీ సీఎం కేసీఆర్‌కు ఈ అపార్ట్‌మెంట్‌కు మరిచిపోలేని బంధం ఉందని, ఇక్కడికి కేసీఆర్ మూడుసార్లు వచ్చారని, పాలసీ విజన్ డాక్యుమెంట్‌ను ఇక్కడే తయారు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు కేసీఆర్ పంపితేనే ఇక్కడికి వచ్చామని, గతంలో జల మండలి అధికారులకు ఆదేశాలిచ్చి ఈ అపార్టుమెంట్ వాసులకు మంచినీటిని సరఫరా చేయించారన్నారు. సబితారెడ్డి రాత్రికి రాత్రే రోడ్డు వేయించారని, సుధీర్‌రెడ్డి మూసీని శుభ్రపరిచి దోమల బెడదను దూరం చేశారన్నారు. నాడు కేసీఆర్ మీకు అండగా ఉంటే ఇప్పుడు రేవంత్‌రెడ్డి జేసీబీలతో మీ ఇళ్లను కూల్చేందుకు సిద్ధపడుతున్నారని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళనపై నేటి సర్కారుకు స్పష్టమైన విధానం లేదని, పూటకో తీరుగా మాట్లాడుతున్నారన్నారు. మా ప్రభుత్వ హయాంలో మూసీ శుద్ధి కోసం రూ.3,800.కోట్లను పెట్టి ఎస్టీపిలు నిర్మించిందన్నారు. కాళేశ్వరం నుంచి గోదావరి నీటిని తెచ్చి మూసీలో కలిపేందుకు మేమే డిపిఆర్‌లను తయారు చేయించామన్నారు. సీఎం ఏ పని చేసినా రియల్ వ్యాపారం ఉంటుందని, సెంట్రల్ వర్సిటీ భూములు లాక్కోవలని చూస్తే సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిందన్నారు. ఫార్మాసిటీ కోసం కేసీఆర్ 14.వేల ఎకరాలను సేకరిస్తే, దాన్ని ఫోర్త్ సిటీ అని పేరు మార్చి రియల్ వ్యాపారం చేస్తున్నాడని ఆరోపించారు. సీఎం రియల్ ఎస్టేట్ వ్యాపారంకు బిఆర్ఎస్ అడ్డు పడుతూనే ఉంటుందన్నారు. నేటి సీఎం హైదరాబాద్‌లో ఒక్క ఇళ్లు కట్టలేదు కానీ, వందలాది మంది పేదల ఇళ్లను కూల్చి వారిని రోడ్డుపాలు చేస్తున్నారని విమర్శించారు. గురుకులాల్లో సరిగ్గా అన్నం పెట్టకపోవడంతో 162.మంది విద్యార్థులు చనిపోయారని, ఇదేమిటని బిఆర్ఎస్ ప్రశ్నిస్తే నా దగ్గర డబ్బులు లేవని, నన్ను కోసుకు తింటారా అన్నాడని పేర్కొన్నారు. పైసలు లేనప్పుడు మెస్సీ తో ఫుట్‌బాల్ మ్యాచ్‌లకు, మిస్‌వరల్డ్ పోటీల నిర్వాహణకు వందల కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్‌లో రూ.100.కోట్లతో సీఎం క్యాంపు ఆఫీస్, రూ.5కోట్లతో ఉప ముఖ్యమంత్రి మూడో క్యాంపు కార్యాలయం నిర్మాణంకు పైసలు ఎక్కడి నుంచి వచ్చాయన్నారు. బడా కాంట్రాక్టర్లకు రూ.20.వేల కోట్ల బిల్లులు ఇచ్చారని, ఇప్పుడు మళ్లీ ఎవరి జేబులు నింపేందుకు మూసీ ప్రాజెక్టు పేరుతో రూ.లక్ష కోట్లను ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. మూసీ అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లను కూలిస్తే బిఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. అధికారులు బాధితులకు నోటీసులు ఇచ్చి ఇళ్లు ఖాళీ చేస్తారా? జేసీబీలతో కూల్చాలా అంటూ బెదిరించడం దారుణమన్నారు. వంద కోట్లతో క్యాంపు ఆఫీసు కట్టుకొంటున్న సీఎంకు పేదల ఇళ్లను కూల్చమని ఆదేశాలివ్వడం అన్యాయమన్నారు. నేటి వరకు మూసీ ప్రాజెక్టుకు డిపిఆర్ లేదని, ఎఫ్‌టిఎల్ ఫిక్స్ చేయలేదని, ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ రాలేదని, కనీసం సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ జరుగలేదని అయినా ఇళ్లు ఖాళీ చేయాలని ప్రజలకు నోటీసులు ఎలా ఇస్తారని, ఇది చట్ట విరుద్ధమని హరీష్‌రావ్ మండి పడ్డారు. కాంగ్రెస్ సర్కారు



బండ్లగూడలోని మధుపార్క్ అపార్టుమెంట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు

వచ్చాక హైదరాబాద్ బ్రాండ్ పడిపోయిందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ బిఆర్ఎస్ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. ఖాళీ స్థలాలను అభివృద్ధి చేసుకోవాలని, పేదల ఇళ్లను కూలిస్తే... మీ పతనం ప్రారంభమయినట్లేనని తెలిపారు. మా ఇళ్లను కూల్చే బదులు మాకు సరఫరా చేసే మంచినీటిలో విషం కలిపి మమ్మల్ని చంపాలని బాధిత ప్రజలు కోరుతుండడం బాధాకరమన్నారు. బాధితులు ఎవరూ భయపడ వద్దని, మీకు అన్ని రకాలుగా బిఆర్ఎస్ అండగా నిలుస్తుందని, చట్టపరంగా పోరాడి మీకు న్యాయం చేస్తామని హరీష్‌రావ్ హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణలో అకాల వర్షాలు

### రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్ష, వడగండ్ల సూచన

### 18 జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగా నైరుతి రుతుపవనాల వల్ల పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదు అవుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం వల్ల ఈ వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ ఉపరితల ఆవర్తనం పశ్చిమ వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉంది. తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, జగిత్యాల, భూపాలపల్లి, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, హానుమకొండ, కరీంనగర్, పెద్దపల్లి, సిద్ధిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డితో సహా 18 జిల్లాల్లో ఈ భారీ వర్షాలు పడతాయి.

ఈ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు, వడగళ్ల వానలు పడతాయి. ఇవి తొలి అకాల వర్షాలు అవుతాయి. అంతేకాదు వడగళ్ల వర్షాలు కూడా పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మూడు రోజుల పాటు ఈ వర్షాలు కురిసే అవకాశం ఉందని కొన్ని రోజులుగా వాతావరణ శాఖ హెచ్చరించింది. అలాగే రెండోరోజు వరంగల్, హానుమకొండ, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్, భూపాలపల్లి, సిద్ధిపేట ఈ ప్రాంతాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

హైదరాబాద్ లో కూడా పాక్షి కంగా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రాత్రి వేళలో పొగుమంచు ఏర్పడే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతలు కూడా కనిష్టంగా 32 డిగ్రీల నుంచి ఈ 18 డిగ్రీలకు పడిపోయే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో దక్షి ణ భారత రాష్ట్రాలపై దీని ప్రభావం ఉంటుంది. ప్రధానంగా రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ పేర్కొంది.

# వార్డుల్లో తిరగండి.. సమస్యలు తీర్చండి!

### కౌన్సిలర్లకు మంత్రి పొంగులేటి దిశానిర్దేశం

### మున్సిపల్ చైర్‌పర్సన్‌గా అనిత

### వైస్ చైర్మన్‌గా తమ్మినేని బాధ్యతలు స్వీకరణ



**ఖమ్మం రూరల్, ప్రభాతవార్త :** ఏదులాపురం మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికకాబడిన కౌన్సిలర్లు వారంలో ఐదు రోజులు.. రోజుకు రెండు గంటలు వార్డులో తిరిగి సమస్యలు గుర్తించి వాటిని తీర్చాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచించారు. ఆదివారం పెద్దతండాలోని మున్సిపల్ కార్యాలయంలో ఏదులాపురం నూతన మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత బాధ్యతల స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "ఎన్నికల వరకే రాజకీయం.. గెలిచిన తర్వాత ఏ పార్టీ వారైనా ప్రజా ప్రభుత్వం తరపున పేదవాడికి సేవ చేయాల్సిందే. పదవి అనేది అధికారం కాదు, బాధ్యత అని గుర్తించాలి" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు.

**ఫీల్డ్ లో ఉంటేనే వ్యవస్థ బాగుపడుతుంది**

ప్రజాప్రతినిధులు, అధికారులు ఫీల్డ్‌లో ఉంటేనే వ్యవస్థ బాగుపడు తుందని ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి నూతన ప్రజాప్రతి నిధులకు తనదైన శైలిలో దిశానిర్దేశం చేశారు. ప్రజలు నమ్మి ఓటేశారని, కేవలం కుర్చీలకే పరిమితం కాకుండా నిత్యం క్షేత్రస్థాయిలో ఉండాలని ఆదేశించారు. "ప్రతి కౌన్సిలర్ వారంలో ఐదు రోజులు, ఉదయం పూట రెండు గంటలు తప్పనిసరిగా వార్డుల్లో పర్యటించాలి. ప్రతి పనికి నిధులు అవసరం లేదు, మీరు బాధ్యతగా తిరిగితేనే అధికారులు, సిబ్బంది పనితీరు మెరుగు పడుతుంది" అని ఆదేశాలు జారీ చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానని, తాగునీటి సమస్యలు, మురికినీరు నిలవకుండా చూడటం, నాలాల కబ్జాలను అడ్డుకోవడంపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**ఇందిరమ్మ ఇంటి వేడుకలో ఆత్మీయత**

అనంతరం సత్యనారాయణపురంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుడి గృహ ప్రవేశ వేడుకకు మంత్రి హాజరయ్యారు. నూతన గృహంలోకి అడుగుపెట్టిన కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపి, ఆత్మీయంగా పట్టు వస్త్రాలను కానుకగా అందించారు.

# మావోయిస్టు ఉద్యమానికి ఇక 37 రోజుల గడువే

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:** ఒకనాడు పశ్చిమ్ బెంగాల్ రాష్ట్రంతో పాటు నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఇతర పలు రాష్ట్రాలలో నాటి భూస్వామ్య వ్యవస్థ దోపిడిని అరికట్టడానికి అణగారిన, తాడిత, పీడిత ప్రజల కోసం అనాటి పరిస్థితులకు అనుగుణంగా నాటి నుండి నేటి వరకు ఎరుపెక్కిన ఎర్రజెండ ఉద్యమాలు ప్రజల మనోభావాలకు అనుగుణంగా వారి పార్టీ పంతను మార్చుకోకపోవడంతో గత 10ఏళ్లుగా అనేక ఆటుపోట్లకు ఎదురైన మావోయిస్టు ఉద్యమం తెలుగు రాష్ట్రాలతో పాటు చత్తీస్‌గఢ్, జార్ఖండ్, మహారాష్ట్ర రాష్ట్రాలలో సైతం పార్టీలో కొత్త రిక్రూట్‌మెంట్ లేక ఇన్‌ఫార్మర్ల సంఖ్య అధికం కావడం శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో శాటిలైట్ ఛానల్ ద్వారా ఉద్యమం దండకారణ్యంలో ఉడలుపారిపోయినప్పటికి వారి కదలికలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ మావోయిస్టు పార్టీ దాని అనుబంధ పార్టీల వల్ల దేశ అంతర్గత భద్రతకు ముప్పు వాటిల్లుతుందన్న కోణంలో ఎన్‌డిఎ ప్రభుత్వం గత 12సంవత్సరాలుగా దేశంలోని మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలలో ఆ ప్రభుత్వాలతో కలిసి మావోయిస్టు ఉద్యమాన్ని కుకటివేళ్లతో పీకివేయాలన్న సంకల్పంతో జనవరి 1 2024న ప్రారంభమైన ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టు పార్టీ వరుస ఎన్‌కౌంటర్‌లతో అధినేతల లొంగుబాట్లతో అతలాకుతలమైపోయి, చెట్టుకోకరు.. పుట్టకోకరుగా మిగిలిపోయి మావోయిస్టు కేంద్ర కమిటీ, రాష్ట్ర కమిటీల మధ్యన కొరియర్ వ్యవస్థ దెబ్బతిని ఎక్కడిక్కడ వారి కార్యకలాపాలు స్థంబించిపోయాయి. పరిస్థితం జరుగుతున్న వరుస ఎన్‌కౌంటర్‌లు కీలకనేతల లొంగుబాట్లు మావోయిస్టు పార్టీ ఉద్యమప్రస్థానం ముగింపుదశకు చేరిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఇటీవల జరిగిన ఒక సమావేశంలో పేర్కొనడం గమనార్హం. 2026 మార్చి 31నాటికి మావోయిస్టు ఉద్యమాన్ని దేశంలో ఎక్కడ లేకుండా కుకటి వేళ్లతో పీకివేస్తున్నామని ఇప్పుడు వెనువెంటనే ఆపరేషన్ కగార్ 2 ప్రారంభించడం జరిగిందని అమిత్‌షా

### ఉద్యమానికి ఇక సెలవా? కొత్త ఊపిరి పోసుకుంటారా?

### దేవ్‌జీ లొంగుబాటుతో సర్వత్రా అనుమానాలు

ప్రకటించిన 48గంటలలోపే చత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న తొమ్మిది కర్రగుట్టలలో ఏడోవ గుట్టపై నాలుగు రోజుల క్రితం ఎదురుకాల్పులు జరిగాయని ఐదుగురు మావోయిస్టులు మృత్యువాత పడ్డారని మావోయిస్టు అధినేతలు పోలీసుల వలయంలో చిక్కుకున్నారని సామాజిక మాద్యమాల్లో వార్తలు చక్కర్లు కొట్టడంతో మావోయిస్టు పార్టీ సానుభూతి పరులు, ప్రజా సంఘాల నాయకులు, మేధావివర్గాలు ఒక్కసారిగా తీవ్ర ఆందోళనకు గురైయ్యారు. మావోయిస్టు ఉద్యమం సుదీర్ఘ పోరటానికి ఆనాడు 2021లో ఆర్కే అలియాస్ అక్కిరాజు రామకృష్ణ ఎన్‌కౌంటర్‌లో అసువులు బాయడంతో ఆ పార్టీ ఉద్యమం బీటలు పారుతూ వచ్చింది. ఇటీవల జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లలో మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకుడు ఒకటోవ ప్లాటూన్ కమాండర్ హెడ్మా, నంబాల కేశవరావులాంటి కీలకనేతలతో మరికొంత మంది కీలకనేతలు ఎన్‌కౌంటర్‌లో హతమవడం, ఇదే తరుణంలో చత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు జనజీవన స్రవంతిలో కలిసిన నక్సలైట్లకు వారిపై ఉన్న కేసులు ఎత్తివేసి జీవనోపాది కల్పిస్తామని వారు ప్రకటించడంతో నాలుగు రాష్ట్రాల పరిధిలో సుమారు రెండు వేల మంది వరకు లొంగిపోయారు.

తెలంగాణ రాష్ట్రంలో పోలీసుల ఎదుట మల్లోజుల వేణుగోపాల్‌రావు, ఆశన్న, కంకణాల రాజిరెడ్డిలు లొంగిపోగా, రెండు రోజుల క్రితమే మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకులు జగిత్యాల జిల్లా వాసి తిప్పరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ పోలీసుల ముందు లొంగిపోవడానికి వారి సమక్షంలో ఉన్నట్లు తెలుస్తుంది..? ఇది ఇలా ఉండగా మావోయిస్టు కేంద్ర కమిటీ చీఫ్ ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి వీదేశాల వెళ్లాడా..? దేశంలోనే వయోభారంతో రహస్యంగా జీవిస్తున్నాడా..? అన్న పుకార్లు షికార్లు చేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర కమిటీ మావోయిస్టు కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ ఆయన పార్టీలోనే కొనసాగుతున్నట్లు ఆయన, ఆయనతో పాటు ఉన్న మరో 45మంది ఉన్నట్లు ఇంటలిజెన్స్ వర్గాలు పేర్కొంటున్నాయి. మావోయిస్టు నేత దామోదర్ ఇటీవల ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అటవి ప్రాంతంలో సంచరించినట్లు పోలీసులకు పక్కా సమాచారం అందడంతో ములుగు అభయారణ్యాన్ని జల్లెడ పడుతున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో కేంద్ర కమిటీ నాయకుడు దేవ్‌జీ ఆయనతో మరో 16మంది మావోయిస్టులు రాష్ట్ర పోలీస్ అధికార యంత్రాంగం ముందు లొంగిపోనున్నట్లు తెలుస్తుంది. నక్సలిజాన్ని అంతం చేస్తామన్న కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ 2తో 31లోపు మావోయిస్టు నక్సలిజాన్ని అంతం చేస్తామని దాని అనంతరం దేశంలో ఉన్న చొరబాటుదారులను ఏరివేస్తామని రెండు రోజుల క్రితం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వెల్లడించడం గమనార్హం. మావోయిస్టు ఉద్యమం మార్చి31తో ప్రస్థానం ముగుస్తుందా..? తుపాకి గొట్టంద్వారానే రాజ్యాధికారం సిద్ధిస్తుందన్న ఎర్రజెండా ఉద్యమం పంతాలో కొత్త ఊపిరి పోసుకుంటుందా...? దేశంలోని 16రాష్ట్రాలలో ఉద్యమం ముగుస్తుందా..? బక్కచిక్కిన ఈ ఉద్యమం ఉసురుమంటుందా..? బరితెగించి ముందుకుపోతుందా..? ఎదురుచూడవల్సిందే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అపరేషన్ కగార్ 2 ప్రారంభించడం, మావోయిస్టులు లొంగిపోవడానికి 37రోజులు ఉండడం అందరు లొంగిపోతారా..? ఇంకొంత మంది మిగిలిపోతారా...? మావోయిస్టు సానుభూతిపరులు, ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాల అధికార యంత్రాంగానికి అనుమానస్పదకంగానే ఉంది. అందరం వేచి చూడవల్సిందే.

## జిహెచ్‌ఎంసి ఎన్నికలపై బిజెపి ఫోకస్

### కేంద్రమంత్రి బండి సంజయ్, ఎంపి అరవింద్‌కు గెలుపు బాధ్యతలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** త్వరలో జరగనున్న జీహెచ్ఎంసీ ఎన్నికలపై బీజేపీ ఫోకస్ పెట్టింది. మున్సిపల్ ఎన్నికల్లో గతంలో కంటే ఎక్కువ కౌన్సిలర్లు, కార్పోరేటర్లను గెలిచామని చెబుతున్న కాషాయదళం ఇక జీహెచ్ఎంసీ ఎన్నికలపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టింది. త్వరలోనే జీహెచ్ఎంసీతోపాటు కొత్తగా ఏర్పాటైన సైబరాబాద్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్లలో ఎన్నికలు జరగనున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ కార్పొరేషన్‌తోపాటు నారాయణపేట, భైంసా మున్సిపాలిటీలను సొంతం చేసుకుంది. అయితే మరిన్ని మున్సిపాలిటీలను కైవసం చేసుకోవాల్సి ఉండేదని కమలం పార్టీ శ్రేణులు కొంత నిరుత్సాహానికి గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ కేడర్‌లో జోష్ నింపేందుకు బీజేపీ రాష్ట్ర నాయకత్వం పక్కా వ్యూహంతో ముందుకు వెళుతోంది. మున్సిపల్ ఎన్నికల్లో నిజామాబాద్, కరీంనగర్ మున్సిపల్ కార్పరేషన్ల పరిధిలో మెరుగైన పనితీరును కనబర్చిన ఎంపీ అరవింద్‌తోపాటు, కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను జీహెచ్ఎంసీ ఎన్నికల్లో రంగంలోకి నింపాలని కమలంపార్టీ నాయకత్వం నిర్ణయించినట్లు సమాచారం. గత జీహెచ్ఎంసీ ఎన్నికల సమయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం కేంద్రమంత్రి బండి సంజయ్‌కు ఉంది.

## తెలంగాణను ఎఐసిసికి ఎటిఎంలా మార్చిన సిఎం రేవంత్‌రెడ్డి: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఫిబ్రవరి22:** తెలంగాణను ఏఐసీసీకి ఏటీఎంలా సిఎం రేవంత్ రెడ్డికి మార్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. గత రెండేళ్లుగా తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంలా మారిందని తాము గతంలో అనేకమార్లు హెచ్చరించిన విషయాన్ని నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే స్వయంగా నిస్సిగ్గుగా ఒప్పుకున్నారని కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర సంపదను కాంగ్రెస్ అధిష్ఠానానికి ధారపోస్తూ, తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ వీధుల్లో తాకట్టు పెడుతున్నారని ఆయన మండిపడ్డారు.రైతన్నలకు, మహిళలకు, యువతకు, ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇచ్చిన 420 హామీల అమలు విషయానికి వస్తే ప్రభుత్వం వద్ద రూపాయి నిధులు లేవని సాకులు చెబుతున్నారని కేటీఆర్ విమర్శించారు. అభివృద్ధికి నిధులు లేవంటున్న సర్కారు, కేవలం రెండేళ్ల కాలంలోనే మూడు లక్షల కోట్ల రూపాయల భారీ అప్పులు తెచ్చిందని, కానీ రాష్ట్రంలో కనీసం ఒక్క ఇటుక కూడా పేర్చిన దాఖలాలు లేవని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజల సొమ్మును ప్రజా ప్రయోజనాలకు వాడకుండా పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు.

## పార్టీ సంస్థాగత బలోపేతం కోసమే, సంఘటన్ జన్‌శ్రీ అభియాన్ యోజన

### నాగాలాండ్‌లో ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** ఏఐసిసి ఆదేశాల మేరకు నాగాలాండ్ రాష్ట్రంలో డిసిసి అధ్యక్షుల నియామకం కోసం, టంగ్‌సాంగ్ జిల్లాలో ఏఐసిసి పరిశీలకులుగా డాక్టర్ బల్మూర్ వెంకట్ పర్యటిస్తున్నారు. ఆ టంగ్‌సాంగ్ జిల్లాలో డిసిసి కార్యవర్గం నియామకం కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో, ఆశావహ అభ్యర్థులను, వివరాలు అడిగి తెలుసుకున్నారు, పార్టీకి వారు అందిస్తున్న సేవలు, గతంలో, ప్రస్తుతం వారు చేసిన, చేస్తున్న పదవులు, జిల్లా కమిటీలో ఆశిస్తున్న పదవులు, మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటర్వ్యూ చేసిన ఆశావహుల జాబితాను ఏఐసిసికి అందిస్తామని తెలిపారు.

## చాట్‌బాట్‌లో విద్యుత్ హాయ్ సేవలు

### ఎస్పీడిసిఎల్ సిఎండి ఫరూఖీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) వినియోగదారులకు మరింత సమర్థవంతమైన, సులభమైన సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది. ఇందులో భాగంగా వినియోగదారులు విద్యుత్ సేవలను నేరుగా తమ మొబైల్ ఫోన్ ద్వారానే పొందేలా వాట్సాప్ చాట్‌బాట్ సేవలను ప్రారంభించినట్లు సంస్థ సిఎండి ఎం ఫరూఖి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ వాట్సాప్‌లో 8712441912 నంబర్‌ను సేవ్ చేసుకోవాలన్నారు. ఇందులో హాయ్ అని మెసేజ్ పంపడం ద్వారా ఫిర్యాదుల నమోదు, బిల్లింగ్ వివరాలు, విద్యుత్ సరఫరా స్థితి సమాచారం వంటి వివిధ సేవలను సులభంగా పొందవచ్చని చెప్పారు.

## గోదావరి పుష్కరాలకు రూ.530 కోట్లు కేటాయించాలి

### ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:** వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. వచ్చే ఏడాది జూన్ 26 నుండి జూలై 7 వరకు రాష్ట్రంలో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు ఏర్పాట్ల కోసం రూ.530 కోట్లు కేటాయించాలని తెలంగాణ దేవాదాయ అధికారులు ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపించారు. 12 రోజుల పాటు గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఈ పుష్కరాలను విజయవంతంగా నిర్వహించడంలో దేవాదాయ శాఖ అన్ని విధాలుగా కృషి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో అందుకు అవసరమైన నిధులకు గాను అవసరమైన ప్రతిపాదనలను అధికారులు రూపొందించారు.

## అమరావతి కోసం కృష్ణానది వరద పరిరక్ష పనులకు రూ.308.60 కోట్లతో టెండర్లు

**రాజంపేట, ఫిబ్రవరి22 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి, కృష్ణా నదికి కుడి ఒడ్డున నేరుగా ఉండడంతో భవిష్యత్తులో వరద ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన నిర్ణయం తీసు కుంది.ఉంది. రాజధాని!!కోర్ సిటీ జోన్‌లో దూరం చాలా తక్కువగా ఉండడం, !!కొత్త రాజధాని ప్రాంతం యొక్క పరిపాలనా, చట్టపరమైన న్యాయ కేంద్రం కృష్ణ నదికి కుడి ఉన్న నేపథ్యంలో వరద పరిరక్షణ పనుల కోసం ప్రపంచ బ్యాంకు ఏడిపి నిధులను కేటాయించింది. ఈ ప్రాంతంలోని కుడి ఒడ్డు ప్రాంతం వరదలకు గురయ్యే చదునైన, సారవంతమైన భూమిని కలిగి ఉండడంవల్ల నివాస ప్రాంతాలకు ముప్పు లేకుండా రక్షించడానికి వరద రక్షణ గోడలను నిర్మించేందుకు అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ తాజాగా 308.60 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో టెండర్లను పిలిచింది. రాజధాని నిర్మాణం పనులు భాగంగా ఈ 1 రహదారి ప్రాంతంలో 37వ ప్యాకేజ్ 104.55 కోట్ల తోను, 38వ ప్యాకేజీ 101.74 కోట్ల తోను, 39వ ప్యాకేజీ102.31 కోట్లతోనూ ఎడిసిఎల్ టెండర్లు పిలిచింది. టెండర్లు దాఖలు చేసేందుకు మార్చి 11 వరకు గడువు ఇచ్చారు. ఇదే రోజున టెక్నికల్ బిడ్ ను ఓపెన్ చేస్తారు. అనంతరం ఫైనాన్స్ బిడ్ ఓపెన్ చేసి టెండర్లు ఖరారు చేస్తారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం

**- గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా ప్రచురణ**

**విజయవాడ ఫిబ్రవరి 22 ప్రభాతవార్త ప్రతినిధి:** అసెంబ్లీ ఓటర్ల మదర్ లిస్ట్ (జనవరిఆరంభం -2026), (05ఫిబ్రవరి )వరకు అప్డేట్స్ తప్పనిసరిగా పొందాలని ఏపీ ఎన్నికల సంఘం వెల్లడించింది.ఓటర్లు జాబితా హార్డ్ కాపీలు మండలాల వారీగా డిప్యూటీ ఎంపీడీవోలకు అందజేయాలి. పంచాయతీ కార్యదర్శులు తమ పంచాయతీకి సంబంధించిన ఓటర్లను వెరిఫై చేయాలి. గ్రామ పంచాయతీ వారీగా డాటా ఇన్‌పుట్ షీట్ తయారు చేసి మ్యాపింగ్ చేయాలి. నెట్ ఓటర్స్ సంఖ్య మండల నెట్ ఓటర్స్‌తో సరిపోలాలి ఒక్క ఓటరు కూడా మిస్ కాకూడదు. సాఫ్ట్‌వేర్ లో డాటా ఫీడ్ డోర్ నెంబర్ మరియు విలేజ్ వైస్ సార్టింగ్ చేసి ఫైనల్ ఓటర్ లిస్ట్ తయారు చేయాలి. డోర్ నంబర్ ఎర్రర్ ఉంటే కరెక్ట్ చేసి తిరిగి సార్టింగ్ చేయవచ్చే. సార్టింగ్ సాధ్యం కాకపోతే మాన్యువల్ మ్యాపింగ్ ద్వారా కూడా ఓటర్ లిస్ట్ తయారు చేసే అవకాశం ఉంది. పంచాయతీ రాజ్ యాక్ట్ -1994 సెక్షన్ -11 మరియు జీవో -254 నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ:09-03-2026. ఈ సమాచారిన్న సంబంధిత సిబ్బందితో వెంటనే షేర్ చేయండి.

## ఎపి వాటా మేరకే 465 టీఎంసీలు వాడుకున్నాం

**- రాష్ట్ర జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహామూర్తి**

**విజయవాడ ఫిబ్రవరి 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రస్తుత నీటి సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ కృష్ణా నది నుంచి 465.66 టీఎంసీలు నీటిని వినియోగించుకుంది. అంటే, మా వాటా మేరకు మాత్రమే తీసుకున్నాం. రెండు రాష్ట్రాల సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకున్నాం. ఇంకా ఏపీకి ఉమ్మడి జలాశయాల్లో 40.51 టీఎంసీల నీళ్లు వాడుకునే హక్కు ఉంది అని రాష్ట్ర జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి కృష్ణా బోర్డు ఛైర్మన్‌కు లేఖ రాశారు. వరద కాలంలో మళ్లించిన నీటిని లెక్కలోకి తీసుకోకూడదు. ఆ నీటిని లెక్కించినా రాష్ట్ర వాటాగా పరిగణించకూడదు. సాగర్ కుడి, ఎడమ కాలువల కింద సాగు, తాగునీటి అవసరాలకు మే నెలాఖరు వరకు 73.50 టీఎంసీలు నీరు అవసరం అని లేఖలో పేర్కొన్నారు. 2025-26 నీటి సంవత్సరంలో శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రవాహం ఆశించిన మేర వచ్చింది. 2025 జూన్ 13 నుంచి నవంబరు చివరి వరకు 2,343 టీఎంసీల జలాలు ఈ రిజర్వాయర్‌కు చేరాయి. జూరాల ప్రాజెక్టు నుంచి ప్రకాశం బ్యారేజ్ వరకు కృష్ణాలో మిగులు జలాలున్న సమయంలో 58 రోజుల పాటు 1513 టీఎంసీలు శ్రీశైలానికి వచ్చాయి. అలా భారీగా వరద పోటెత్తిన సందర్భంలోనే విద్యుత్ కేంద్రం, స్పిల్ వేతో పాటు శ్రీశైలం అన్ని అవుట్ లెట్‌ల ద్వారా నీళ్లు వదిలేశాం. వెరసి, నీటి వనరులను ఉత్తమంగా వినియోగించాం.

## కార్యకర్తలకు సొంత ఇల్లులా పార్టీ కార్యాలయం



ప్రజల సేవకు కృతనిశ్చయంతో పనిచేస్తాం

తిరుపతిలో టిడిపి ప్రాంతీయకార్యాలయం భూమిపూజ

**తిరుపతి,పిబ్రవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** కార్యకర్తలకు సొంత ఇల్లులా పార్టీ కార్యాలయాన్ని నిర్మించి ,అందుబాటులో ఉండేలా చూస్తామని తెలుగుదేశంపార్టీ నాయకులు ముక్తకంఠంతో తెలిపారు. ప్రజల సేవకు పార్టీ నాయకులు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. తిరుపతి జిల్లాలో నూతనంగా టిడిపి పార్టీ కార్యాలయం నిర్మాణానికి ఆదివారం ఉదయం ఎంఆర్‌పల్లి అవిలాల మార్గంలోని శ్రీజడెయిరీ సమీపంలో భూమిపూజ నిర్వహించారు.తిరుపతి పార్లమెంట్ జిల్లా అధ్యక్షురాలు పనబాకలక్ష్మి, ప్రధాన కార్యదర్శి దివాకర్‌రెడ్డి, రాష్ట్ర పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, యాదవ సంక్షేమకార్పొరేషన్ ఛైర్మన్ నరసింహాయాదవ్, ఎమ్మెల్యేలు బొజ్జలసుదీర్‌రెడ్డి, నెలవల విజయశ్రీ, పార్టీ నాయకులు డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, దంపూరి భాస్కర్, రవినాయుడు, శ్రీధర్‌వర్మ, మన్నెం శ్రీనివాసులు, జెబి శ్రీనివాస్ తదితరులు పాల్గొని శాస్త్రోక్తంగా టిడిపి కార్యాలయానికి భూమిపూజ చేశారు.

త్వరగా భవననిర్మాణం పూర్తిచేసి కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు. శ్రీవారి పాదాలచెంత టిడిపి కార్యాలయం నిర్మించుకోవడంఆనందంగా ఉందన్నారు.

## మాజీ ఎంపి బుట్టా రేణుక ఆస్తుల వేలం!



**కర్నూలు ఫిబ్రవరి 22 ప్రభాతవార్త ప్రతినిధి:** వైసీపీ నాయకురాలు మాజీ ఎంపీ బుట్ట రేణుక ఆమె భర్త నీలకంఠకు చెందిన కోట్ల రూపాయల ఆస్తులను వేలం వేయడానికి ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ నిర్ణయం తీసుకోవడం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. బుట్ట ఇన్ఫ్రాస్ట్రక్చర్, బుట్ట కన్వెన్షన్ సర్వీసెస్, మేరీడియాన్ ఎడ్యుటెక్ సంస్థల పేరుతో గతంలో వీరు తీసుకున్న 340 కోట్ల రుణం వడ్డీలతో కలిపి ప్రస్తుతం 782 కోట్ల భారీ బకాయిగా మారింది. ఈ బకాయిల వసూలు కోసం వారు తనకబెట్టిన అత్యంత ఖరీదైన ఆస్తులు కూకట్పల్లిలోని మెరీడియన్ స్కూల్ సుమారు 65 కోట్లు బంజారా హిల్స్‌లోని స్కూల్ భవనం ఫర్నిచర్ కంప్యూటర్లతో పాటు మాదాపూర్ సమీపంలోని ఖానామెట్ లో ఉన్న 725 చదరపు గజాల ఖాళీ స్థలం మరియు ప్రసిద్ధ బుట్టా కన్వెన్షన్ సెంటర్లను మార్చి 24న ఈ వేలం వేయనున్నారు. బుట్టా రేణుక ఒక సాధారణ బిసి సామాజిక వర్గానికి చెందిన మహిళగా రాజకీయాల్లోకి అడుగుపెట్టి ఒక పక్క వ్యాపారవేత్తగా రాణిస్తూనే మరోపక్క వెనుకబడిన వర్గాల ప్రతినిధిగా గుర్తింపు పొందారు. 2014లో వైసీపీ తరఫున కర్నూలు ఎంపీగా గెలిచిన ఆమె ఆ సమయంలో ఆ పార్టీకి ఉన్న బలమైన బీసీ నేతల్లో ఒకరిగా నిలిచారు. రాజకీయాల్లోకి రాకముందే ఆమె కుటుంబం విద్యాసంస్థలు ఇన్ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో భారీగా పెట్టుబడులను పెట్టినప్పటికీ నేడు ఆ ప్రతిష్టాత్మక ఆస్తులన్నీ వేలానికి రావడం ఆమె ఆర్థిక పతనానికి అద్దం పడుతోంది. కోవిడ్ వళ్ళ వ్యాపారాలు దెబ్బ తిన్నాయని రుణాన్ని రీషెడ్యూల్ చేయాలనీ వారు కోరినప్పటికీ నిబంధనల ప్రకారం చెల్లింపులు జరగకపోవడంతో ఎల్ఐసి ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. అయితే గతంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ఒక బహిరంగ వేదికపై బుట్టా రేణుక సామాజిక వర్గాన్ని ప్రస్తావిస్తూ ఆమె ఆర్థిక స్థితిగతులపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. ఆమె ఆర్థికంగా అంతంత మాత్రమే అని ఆమె వద్ద పెద్ద ఆస్తులు లేవని జగన్ మాట్లాడటం అప్పట్లో పెద్ద దుమారాన్ని రేపింది వందల కోట్ల వ్యాపారాలు చేస్తున్నా ఒక ఎంపీ స్థాయి మహిలను అలా తక్కువ చేసి మాట్లాడటంపై అప్పట్లో నెటిజన్లో తీవ్రంగా ట్రోల్ చేశారు. కానీ నేడు సీన్ కట్ చేస్తే ఆమె ఆస్తులన్నీ వేలానికి వచ్చి నిజంగానే ఆర్థికంగా రోడ్డున పడే పరిస్థితి రావడం గమనార్హం . నాడు జగన్ ఏదో ఉద్దేశంతో అన్న మాటలు నేడు ఆమె పరిస్థితికి అక్షరాలా సరిపోతున్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. రాజకీయంగా జగన్ ఇచ్చిన హామీలను నమ్మి టిడిపిని వీడి తిరిగి వైసిపిలోకి వచ్చిన బుట్టా రేణుకకు ఐదేళ్ల అధికార కాలంలో కనీసం ఎమ్మెల్సీ పదవి కూడా దక్కకపోగా 2024 ఎన్నికల్లో సీటు కూడా నిరాకరించడం గమనార్హం ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు అందకపోవడం లేదా రాజకీయ సహకారం లేకపోవడంతోనే ఈ ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయని ప్రచారం సాగుతోంది. ఒకవేళ ఆమె టిడిపిలోనే కొనసాగి ఉంటే బీసీ కోటాలో కచ్చితంగా మంత్రి అయ్యే వారని జగన్ హామీలు నమ్మి అటు రాజకీయ పదవులు ఇటు వ్యాపార సామ్రాజ్యం రెండిటిని కోల్పోయారని ఆమె అనుచరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రుణాల వ్యహారం ఇప్పటికే నేసీఎల్ టి పరిధిలో ఉండగా మార్చి 24 న జరగనున్న వేళా ఆమె భవిష్యత్తును నిర్ణయించనుంది.

## సమస్యలు మా దృష్టికి తీసుకురండి

### : డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి



**తిరుపతి,పిబ్రవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం పరిధిలోని తొమ్మిదిజిల్లాల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేటి ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు "డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి కార్యక్రమం" నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని సంస్థ సిఎండి సిఎండి శివశంకర్ లోతేటి స్వయంగా పాల్గొని వినియోగదారుల సమస్యలపై పరిష్కారం చూపుతారు. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంత పురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 8977716661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని కోరారు. సర్కిల్ స్థాయిలోనూ డయల్ యువర్ ఎస్ఈ సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8.30 నుండి 9.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని సిఎండి తెలిపారు. జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను సూపరింటెండింగ్ ఇంజనీర్ దృష్టికి తీసుకు వచ్చేందుకు వీలుగా వినియోగదారులు తిరుపతి: 8712652679చిత్తూరు: 7993 147979 నెల్లూరు: 08612320427 అన్నమయ్య: 94408 17449కడప: 08562242457 కర్నూలు: 7382614308 నంద్యాల: 73826 18976అనంతపురం: 9154790 350శ్రీసత్య సాయి: 9963707847 సదవకాశాన్ని విద్యుత్తు వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## దేవుడితో రాజకీయం చేసే వైఎస్సార్సీకి గుణపాఠం

**- 7 జిల్లాల్లో టిడిపి కార్యాలయాల నిర్మాణం - పార్టీకి కార్యకర్తే అధినేత**

**- పార్టీ కార్యాలయ నిర్మాణ భూమిపూజలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపి దగ్గుమళ్ళ, జిల్లా తెలుగుదేశం అధ్యక్షుడుషణ్ముగరెడ్డిలు**

**చిత్తూరు, ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** తిరుమల శ్రీవారితో రాజకీయం చేస్తున్న ప్రతిపక్ష వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి మరోసారి గుణపాఠం తప్పదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షణ్ముగంరెడ్డిలు అన్నారు. చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆదివారం నూతన జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షణ్ముగంరెడ్డిలు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, చిత్తూరు మేయర్ అముద తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మాట్లాడుతూ సిఎం నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో పని చేయడం సంతోషంగా వుందని, రాష్ట్ర వ్యాప్తంగా మొదటి దశలో ఏడు జిల్లాల్లో నూతన పార్టీ కార్యాలయాల నిర్మాణం చేపట్టాలని పార్టీ అధినేత నిర్ణయించడం జరిగిందన్నారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తే అధినేత అని, పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఎంపీలు, ఎమ్మెల్యేలు అందుబాటులో వుండటం కోసం జిల్లా కేంద్రంలో నూతన హంగులతో జిల్లా పార్టీ కార్యాలయంను నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్పొరేట్ హంగులతో నిర్మించున్న జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎంపీ, ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ నాయకులకు ఒకొక్క గది నిర్మిస్తున్నామన్నారు.



భూమి పూజ చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపి దగ్గుమళ్ళ, అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి

అలాగే కార్యకర్తలకు సైతం రాత్రి బస చేయడానికి వీలుగా కార్యాలయ నిర్మాణం వుంటుందన్నారు. ప్రతిపక్ష వైకాపా తన రాజకీయ మనుగడ కోసం ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న కూటమి ప్రభుత్వంపై బురద జల్లుతుందని ధ్వజమెత్తారు.

## కేంద్రం సహకారంతో కాణిపాకం ఆలయ అభివృద్ధి : మంత్రి రామ్మోహన్‌నాయుడు

**కాణిపాకం,ఫిబ్రవరి 22 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ సహకారంతో కాణిపాకం ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఆయన గుంటూరు మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌తో కలసి ఆదివారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. కాణిపాకం ఆలయ దర్శనానంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత 25 ఏళ్ళ క్రితంతో పోలిస్తే కాణిపాకం ఆలయం ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. నేడు కాణిపాకం ఆలయం ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్నట్లు తెలిపారు. అయితే పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయం మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ అభ్యర్థన మేరకు కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రశాంత్ పథకంలో చేర్చి ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేస్‌బాబులు కేంద్రంలో మోదీ ఇస్తున్న సహకారంలో రాష్ట్రాన్నా బ్రాండ్ అంబాసిడర్‌గా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. దేశంలోని పెట్టుబడులే కాకుండా ప్రపంచంలో వున్న పెట్టుబడులకు కూడా ఏపీ కేంద్రంగా అభివృద్ధి తయారైందన్నారు. భవిష్యత్తు టెక్నాలజీకి ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రంల వేదికగా తయారైందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో ప్రజాపాలన సాగుతోందని, ఇందుకు స్వామివారి ఆశీస్సులు కూడా కావాలని ప్రార్థించినట్లు మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. కాణిపాకంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ కాణిపాకం శ్రీవరసిది వినాయక స్వామి అలయం ఆదివారం కూడా భకు ంతల రద్దీ కొన సాగింది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈ మేరకు శని,ఆదివారాలు వారంతపు రోజులు కావడం



మంత్రి రామ్మోహన్‌నాయుడు,గల్లా జయదేవ్‌లకు స్వామివారి జ్ఞాపికలను అందజేస్తున్న ఛైర్మన్ ఇఒలు

ఆదివారం సెలవు రోజు కావడంతో ఆలయ దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు.ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన భక్తులతో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం స్వామివారి దర్శనార్థం భారీగా తరలి రావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో స్వామి దర్శనం కోసం ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది.

# తిరుమల సమాచారం

## 26నుండి తెప్పోత్సవాలు



**తిరుమల,ఫిబ్రవరి 22ప్రభాత వార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వం స్వామి వార్షిక సాలకట్ల తెప్పోత్సవాలు ఈనెల 26వతేదీ నుండి ఐదురోజులు వైభవంగా జరగనున్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా టిటిడి ఇంజనీరింగ్ అధికారులు, నీటివిభాగం అధికారులు బలమైన తండ్లుతో తెప్పను తీర్చిదిద్దారు. నేటి సాయంత్రం పుష్కరిణిలో తెప్పలను ట్రయల్‌రన్ నిర్వహించి సౌకర్యవంతంగా తీర్చిదిద్దనున్నారు .తిరుమలలో శ్రీవారి ఆలయానికి పక్కనే ఉన్న పవిత్రమైన స్వామివారి పుష్కరిణిలో ఐదురోజులు జరిగే ఈ తెప్పోత్సవాలకు టిటిడి అన్ని చర్యలు తీసుకుని ఏర్పాట్లు చేస్తుంది. ఫిబ్రవరి 26వతేదీ గురువారం సాయంత్రం నుండి మార్చి 2వతేదీ సోమవారం వరకు ఐదురోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు.ఈ తెప్పోత్సవాలు ప్రతిరోజూ రాత్రి 7గంటల నుండి 8గంటల వరకు ఆలయ పుష్కరిణిలో వేడుకగా నిర్వహిస్తారు. తెప్పోత్సవాల్లో తొలిరోజు సాయంత్రం సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరామచంద్రమూర్తిగా తెప్పలపై పుష్కరిణిలో మూడుచుట్లు తిరిగి రెండవరోజు మూడుచుట్లు, మూడవరోజు ఐదు చుట్లు. నాలుగు,ఐదు రోజుల్లో పలురకాల అలంకరణల్లో మలయప్ప తెప్పలపై విహారి స్తారు.రెండురోజులు సహస్ర దీపాలంకారసేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలు రద్దు చేశారు.

## శ్రీవారి దర్శనంతో మనసు ఆనందం లోకక్షేమం కోసం భగవంతుని ఆశీస్సులుండాలి

**- కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్**



**తిరుమల,ఫిబ్రవరి 22ప్రభాత వార్త ప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యమంగళ రూపం దర్శనంతో మనసు ఆనందంగా ఉందని కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ విశ్వాసం వ్యక్తం చేశారు.భగవంతుని ఆశీస్సులతో లోకక్షేమంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. భారతదేశం అన్ని రంగాల్లో మరింతగా అభివృద్ధిచెందాలని, ఆ దేవదేవుని కరుణాకటాక్షాలు మెండుగా కలగాలని వేడుకున్నానన్నారు. భారతదేశం అభివృద్ధిని ప్రపంచదేశాలు కూడా గుర్తిస్తున్నాయన్నారు. ఆదివారం ఉదయం ఆలయంలోనికి చేరుకున్న కేంద్రమంత్రి చౌహాన్‌కు టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, బిజెపి నాయకులు రమేశ్‌నాయుడు, పురుషోత్తంనాయుడు కేంద్రమంత్రి వెంట ఉన్నారు. ఆలయంలోపల శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులందుకున్నా : మంత్రి అచ్చెన్నాయుడు



**తిరుమల,ఫిబ్రవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు నడుస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. చేస్తున్న అభివృద్ధితో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఆదివారం ఉదయం మంత్రి అచ్చెన్నాయుడు కుటుంబంతో కలసి వేంకటేశ్వర స్వామికి మొక్కులు తీర్చుకుని ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రభుత్వ విఫ్ బొలిశెట్టి శ్రీనివాస్ శ్రీవారిని దర్శించుకున్నారు.

## అనంతాళ్వార్ జీవితం అందరికీ ఆదర్శప్రాయం: టిటిడి జెఇఒ డాక్టర్ శరత్



**తిరుమల,ఫిబ్రవరి 22ప్రభాతవార్తప్రతినిధి:** వైష్ణవ భక్తాగ్రేసరుడు, ఆళ్వారులలో అనంతాళ్వార్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ పేర్కొన్నారు. తిరుమలలోని అనంతాళ్వార్ తోట (పురశైవారితోట) లో అనంతాళ్వార్ 972వ అవతార మహోత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జెఇఒ డాక్టర్ శరత్ భక్తులనుద్దేశించి మాట్లాడుతూ అనంతాళ్వార్ అవతార మహోత్సవాల్లో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. భక్తి అంటే ప్రార్థన మాత్రమే కాదని, భక్తి అంటే సేవ అని నిరూపించిన మహానుభావుడు అనంతాళ్వార్ అని కీర్తించారు. 972 సంవత్సరాలుగా అనంతాళ్వార్ వంశీకులు శ్రీవారికి పుష్ప కైంకర్యం చేస్తున్నారని, వారి పరంపర ఎల్లప్పటికీ కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అనంతాళ్వార్ వంశీకులు నాలాయిర దివ్య ప్రబంధ గోష్ఠిగానం నిర్వహించారు. అనంతరం పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా వేంకటాచల ఇతిహాసమాల, రామానుజులవారి తిరుమల యాత్ర, స్వామి పుష్కరిణి వైభవం, శ్రీ రామాయణ కాలక్షేపం, తిరుమలనంబి - తన్నీరముదు ఉత్సవం, మూలవర్ల తిరుమంజనం - తిరునామం, తిరుమలలో రామానుజ సన్నిధి ప్రతిష్ట, సహస్రనామార్చన వైభవం, తిరుమలలో జీయర్ మఠం స్థాపన, శ్రీవారి సుప్రభాతంఏకాంత సేవ, తిరుమలలో దివ్యప్రబంధ క్రమం, తిరుమలలో పుణ్య తీర్థాలు తదితర అంశాలపై వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన పండితులు ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో అనంతాళ్వార్ వంశస్తులు వేంకట కృష్ణ స్వామి, భరద్వాజస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ట్రెజరీస్, అకౌంట్స్ గెజిటెడ్ ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు కృషి

**సంఘం అధ్యక్షుడు కె.రాజకుమార్, కార్యదర్శి డిజె సంపత్ కుమార్**

విజయవాడ ఫిబ్రవరి 22 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ మరియు అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి కార్యవర్గ ఎన్నికలు ఆదివారం విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం బాలోత్సవ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రక్రియను ఎన్నికల అధికారి జి.నాగసాయి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పర్యవేక్షణలో పారదర్శకంగా, సజావుగా నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుండి హాజరైన గజిటెట్ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని సంఘ ఐక్యతను చాటారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు కే.రాజకుమార్ మాట్లాడుతూ ట్రెజరీ మరియు అకౌంట్స్ శాఖల ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు తన వంతు నిస్వార్థంగా కృషి చేస్తానని తెలిపారు. సంఘ అభివృద్ధి, సభ్యుల సంక్షేమం, సేవా పరిస్థితుల మెరుగుదల తమ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. ప్రభుత్వంతో సానుకూల చర్చలు జరిపి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడి పనిచేస్తానని హామీ ఇచ్చారు. ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన డి.జే సంపత్ రావు మాట్లాడుతూ సభ్యుల ఐక్యతే సంఘ బలమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ట్రెజరీ మరియు అకౌంట్స్ అధికారుల సమస్యల పరిష్కారానికి సంఘం సమిష్టిగా కృషి చేస్తుందని తెలిపారు. సేవా పరమైన అంశాల్లో పాదర్శకత, సమర్థత, సభ్యుల న్యాయ హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. కె.రాజ్‌కుమార్ అధ్యక్షునిగా డి.జె. సంపత్ రావు ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాసరావు, అసోసియేట్ అధ్యక్షునిగా ఎండీ, మజహర్ బేగ్ ఉపాధ్యక్షునిగా పి.వి.నారాయణ ఉపాధ్యక్షునిగా సీహెచ్.శ్రీనివాసులు ఉపాధ్యక్షునిగా కె.బరద్వాజ ఉపాధ్యక్షుడు, జి.నిర్మలమ్మ ఉపాధ్యక్షురాలు,

కె.రాజు ఆర్గనైజింగ్ కార్యదర్శి, పి.శ్యామ్ ప్రసాద్ కార్యదరిశ, పి పార్థసారథి కార్యదర్శి, ఇ.సుబ్బారాయుడు కార్యదర్శి, కె.వి.సురేష్ బాబు కార్యదర్శి, ఎస్.కె.మక్సూద్ కార్యదర్శిగా బి.రవీంద్రరెడ్డి కార్యదర్శిగా. పి.మాధవి కార్యదర్శిగా ఎం రాజ్యలక్ష్మి ట్రెజరర్‌గా నూతన కార్యవర్గం ఎన్నికయింది..



## రంగును బట్టి తెలిసిపోతుంది !

వాటర్ బాటిల్‌కున్న మూత రంగును బట్టి నీళ్ల గుణాన్ని చెప్పొచ్చు అన్న సంగతి మీకు తెలుసా? విటమిన్లను బట్టే మూత రంగులు నిర్ణయిస్తారు. ఏ రంగు మూత ఏం చెబుతుందో తెలియాలంటే ఇది చదవాల్సిందే..

✦ నీళ్ల సీసాకు బ్లూ రంగు మూత ఉంటే... వాటిని సాధారణ ఆర్ వో నీళ్లగానే పరిగణిస్తారు. అంటే శుద్ధి చేసిన నీళ్లన్నమాట. చాలా బ్రాండ్లు ఇదే రకం రంగు మూతలను వాడతాయి.

2.పచ్చ రంగు... అది పర్యావరణానికి అనుకూలమైన నీటి గుర్తు. అంటే ఫ్లేవర్లు, నిర్దిష్టమైన ఖనిజాలు ఎక్కువగా ఉన్న నీళ్లని అర్థమట.

✦ ఆల్కలైన్ స్థాయిలు ఎక్కువగా ఉంటే రంగు మూతల్ని వాడతారు. ఇవి ఆరోగ్యానికి మేలుచేస్తాయి.

✦ సాధారణ, ప్యూరిఫైడ్ నీళ్లను అందించే సంస్థలు తెలుపు రంగు మూతలను వాడతాయి.

✦. ఆరోగ్యంగా ఉం విటమిన్లతోపాటు ఇతర పోషకాలు అధికంగా ఉన్న నీళ్ల బాటిళ్లకు పసుపు రంగు మూతలు పెడతారు. అయితే అన్ని సంస్థలు ఈ నియమాల్ని పాటిస్తున్నాయా లేదా అనేది చెప్పడం కష్టమే. అందుకే నీళ్ల బాటిళ్లని కొనేటప్పుడు ఐఎస్ఐ ఐ మార్క్, లైసెన్స్ నంబర్, ప్యాకింగ్, ఎక్స్‌పైరీ డేట్, బ్రాండ్ బ్రాండ్ చూసి కొనడం మంచిది. ▫

## ఆచితూచి అడుగేయాలి..



జీవితంలో ప్రతి దశ ప్రత్యేకమైనదే! ముఖ్యంగా 20-29 ఏళ్ల వయసులో కొన్ని కీలక సంఘటనలు జరుగుతుంటాయి. చదువు, ఉద్యోగం, వివాహం.. మరికొందరైతే పిల్లల్ని కూడా కంటుంటారు. అయితే ఇరవైల్లో ఉన్న వారు కొన్ని అంశాల్లో మాత్రం ఆచితూచి అడుగేయాలంటున్నారు నిపుణులు.

**..పొదుపు తప్పనిసరి...** ప్రస్తుతం ఇరవైల్లో ఎన్నప్పుడే చాలామందికి ఉద్యోగాలు వస్తున్నాయి. దీంతో చిన్న వయసులోనే జీవితంలో స్థిరపడు తున్నారు. అయితే కొంతమంది ఇప్పట్నుంచే డబ్బు పొదుపేంటి? కొన్నాళ్లు ఎంజాయ్ చేద్దాం. అన్న ఆలోచనతో పొదుపును పక్కన పెట్టేస్తుంటారు. ఈ నిర్లక్ష్యం వల్ల భవిస్యత్తులో పలు ఇబ్బందుల ఎదుర్కోవాల్సి రావచ్చంటున్నారు నిపుణులు. అందుకే ఇరవైల్లో ఉన్నప్పుడే డబ్బు పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. అప్పుడే జీవితంపై పూర్తి అవగాహన వస్తుంది. భవిష్యత్తులో ఆర్థికపరంగా ఎలాంటి సమస్యల్లేకుండా జాగ్రత్తపడచ్చు.

**ఇలాంటి స్నేహితులు !** ఉద్యోగాల పేరుతో ఇరవైల్లోనే జీవితంలో స్థిరపడే సరికి కొత్త అనుభూతి పొందుతుంటారు చాలామంది. ఈ క్రమంలో ఆఫీస్‌లో, కెరీర్ పరంగా కొత్త వ్యక్తులు పరిచయమవుతుంటారు. వారితో స్నేహం ఏర్పడుతుంది. అయితే ఈ స్నేహాలు మనల్ని సానుకూలంగా ముందుకు నడిపించేవైతే పర్లేదు. కానీ మనల్ని తప్పుదోవ పటి ంచేవైతే ఆదిలోనే జాగ్రత్తపడాలంటున్నారు నిపుణులు. అదేవిధంగా మీ బలాబలాలు, బలహీనతలు, మంచి చెడ్డలు.. తదితర విషయాల గురించి ఆలోచించే వారితో స్నేహబంధాన్ని ఏర్పరచుకుంటే వ్యక్తిగతంగా, కెరీర్ పరంగా ప్రయోజనకరంగా ఉంటుంది.

**ప్రేమా? ఆకర్షణా ? ...**ఇరవైల్లోనే చాలామంది ప్రేమలో పడుతుంటారు. అది ప్రేమో, ఆకర్షణో తెలియక తప్పటడుగు వేసేవారూ లేకపోలేదు. కాబట్టి ఈ విషయంలో అవగాహన పెంచుకోవడం ముఖ్యం. అలాగే కొంతమంది ప్రేమ విషయంలో పలు సమస్యలు ఎదురైనా.. వారి తోనే జీవితం కొనసాగించ డానికి ఆసక్తి చూపుతుం టారు. పెళ్లయ్యాక వాళ్లే మారు తారులే అన్న ఆలోచనతో వివాహ బంధం లోకి అడుగుపెడు తుం టారు. ఇలాంటి తప్పటడు గులే వేయద్దంటు న్నారు నిపుణులు. ఇలాంటి చెడు నిర్ణయాల వల్ల జీవితాంతం ఇబ్బంది పడాల్సి వస్తుందం టున్నారు. అందుకే ఇలాంటి చేటు చేసే బంధాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. ఇలాంటి వాళ్లనే కాదు. వాళ్ల జ్ఞాపకాల్నీ మదిలో నుంచి తొలగిస్తే జీవితంలో పాజిటివిటీతో ముందుకెళ్లచ్చు.

**ఆసక్తికి ప్రాధాన్యం ...** కొంతమందికి ఇరవైల్లో ఉన్నప్పుడు తమకు ఆసక్తి ఉన్న రంగంలోకి అడుగు పెట్టాలా? లేక డబ్బు ఎక్కువగా సంపాదించగలిగే రంగంలోకి వెళ్లాలా? అన్న సందేహం కలుగు తుంటుంది. ఈ క్రమలో డబ్బుకు ఓటేసేవారే ఎక్కువ మంది ఉండచ్చు. కానీ డబ్బు వస్తుంది కదా.. అని ప్రస్తుతం ఆ కెరీర్‌ని ఎంచుకున్నా.. భవిష్యత్తులో పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావచ్చు. ▫

## పొట్టకూటి కోసం ఆటోడ్రైవర్‌గా ..



కష్టాలు, కన్నీళ్లు ప్రతి ఒక్కరి జీవితంలో ఉంటాయి. వాటికి ఎదురొడ్డి పోరాడిన వారే నలుగురిలోనూ ప్రత్యేకంగా నిలవగలుగుతారు. ఒడిశాకు చెందిన సంతోషి డియో ఇదే కోవకు చెందుతుంది. చిన్న వయసులోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టిన ఆమె.. అత్తింట్లో పడరాని కష్టాలు పడ్డాయి. గృహ హింసనూ ఎదుర్కొంది. రోజులు గడిచే కొద్దీ ఆ హింసను తట్టుకోలేకపోయిన ఆమె.. ఇక తన వల్ల కాదని ఆ బంధం నుంచి బయటకొచ్చింది. పొట్టకూటి కోసం, తన బిడ్డ కడుపు నింపడానికి ఆటోడ్రైవర్గా అవతారమెత్తింది. అక్కడితో ఆగిపోకుండా భారీ వాహనాలు సైతం నడిపి వార్తల్లో కెక్కింది. ప్రస్తుతం సొంతం గా ఓ ఆటో కొనుక్కొని వెల తిరిగేసరికి వేల రూపాయలు ఆర్జిస్తోంది. తన భవిష్యత్ కల అయిన ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారానికి ఇదే నాంది అని చెబుతోన్న సంతోషి సక్సెస్ ను ఇటీవల ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మరి ప్రశంసల్లో ముంచె త్తారు. దీంతో ఆమె పేరు, కథ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

**వేధింపులతో విసిగిపోయా!......** ఒడిశాకి చెందిన సంతోషిది పేద కుటుంబం కావడంతో 16 ఏళ్లకే ఆమె పెళ్లి చేసుకుంది. ఆమె తల్లిదండ్రులు. ఎన్నో కలలతో అత్తారింట్లో అడుగుపెట్టిన ఆమె కొన్నాళ్ల పాటు సంతోషంగా గడిపింది. ఆ తర్వాతే అత్తింటి వారి నుంచి వేధింపులు మొదలయ్యాయి. అదనపు కట్నం తీసుకు రావాల్సిందిగా అత్తమామలు, భర్త ఆమెను హింసించేవారు. అంతలోనే ఆమెకు ఓ పాప పుట్టింది. ఆ చిన్నారి అనాథ కాకూడదని కొన్నేళ్ల పాటు మౌనంగానే ఈ గృహ హింసను భరిస్తూ వచ్చింది. అయితే అంతకంతకూ తనపై వేధింపులు పెరిగిపోవడంతో ఇక తన వల్ల కాదని.. పాపను తీసుకొని ఆ ఇంటి నుంచి బయటికొచ్చింది సంతోషం తొలుత అత్తారింటి నుంచి పుట్టింటికి చేరా. అక్కడ నాకు తగిన మద్దతు లభించకపోగా... చుట్టుపక్కల వాళ్ళు నలుగురూ నానా మాటలు అన్నారు. దాంతో ఆ ఊళ్లోనే ఉండకూడదని చెన్నై వచ్చేశా. ఓ స్పిన్నింగ్ మిల్లులో పని దొరికింది. అటు పని చేసుకుంటూ, ఇటు పసి పాప బాధ్యతలు చూస్తూ ఎంతో కష్టపడ్డా. అయితే ఓరోజు పనికి వెళ్తున్నప్పుడు ఓ మహిళ ఆటో చూశా. నేనెందుకు నడపకూడదు అనుకున్నా. అందులోనూ నాకు డ్రైవింగ్ అంటే చాలా ఇష్టం. ఈ ఆలోచనతోనే అప్పటిదాకా నేను దాచుకున్న డబ్బుతో ఓ సెకండ్ హ్యాండ్ ఆటో కొన్నా. అదే ఆటోలో నా బిడ్డను తీసుకొని తిరిగిమా ఊరికి వెళ్లిపోయా.. అంటూ తాను పడిన కష్టాలను గుర్తుచేసుకుందామె. ▫

✦ వయసు పైబడే కొద్దీ

## కైలాసంలో సమాధానం

పార్వతీదేవి సమేతమై ఉన్న పరమేశ్వరుడికి నమస్కరించి వెనువెంటనే జరిగిన ఘోరం గురించి తెలిపారు. కుంభీపాక నరకం ఉన్నట్లుండి స్వర్గధామంగా మారి పోయిందని, దానికి కారణమేమిటో తెలియడం లేదని, పాపులంతా అలా స్వర్గసుఖాలను అనుభవించటం ధర్మవిరుద్ధం కదా అని తెలిపారు.శివుడు వారి మాటలను విని..చిరునవ్వు నవ్వి.. దీనిలో వింత ఏమీ లేదు. నరకకూపం దగ్గరకు దూర్వాసుడు వెళ్లి లోనికి తొంగి చూసిన సమయంలో ముని నుదటి మీద ఉన్న మూడు విభూతి రేఖల్లోని కొన్ని అణువులు కెళ్లి ఆ కూపంలో పడ్డాయి. ఆ పవిత్ర అనువుల ప్రభావమే ఇది అని చెప్పారు. ఆ సమయంలోనే కుంభీపాక కూపంలో పడి ఉన్న ప్రాణి కోటి అంతా ద్వి విమానం అధిరోహించి కైలాసం చేరుకున్నారు. భరదగణాలు అనే పేరుతో ఇప్పటికీ వారక్కడే ఉంటున్నారు. పరమేశ్వరుడు ఆ కుంభీపాక కూపాన్ని పితృదేవతలకు పనికి వచ్చే ఉత్తమ తీర్థంగా మార్చారు. ఆ తీర్థం పక్కనే శివపర్వాతుల మూర్తులను ప్రతిష్ఠించమని చెప్పి ఆ మూర్తులు పూజలందు కుంటారని, ఆ ప్రాంతం పితృతీర్థంగా మారిపోతుందని చెప్పాడు. యముడు చేసేదిలేక పితృలోకానికి చాలా దూరంగా మళ్లీ ఒక కొత్త కుంభీపాక నరక కూపాన్ని నిర్మించి పరిసరాలకు విభూతి ధరించిన శివభక్తులెవరూ రాకుండా కట్టడి చేశాడు. విభూతిలోని కొన్ని కణాలకే అంతటి మహత్తర శక్తి ఉందని ఈ కథ తెలుపుతోంది. అందుకే విభూతిని ధరించటం మనతో పాటు ఇతరులకు శుభాన్ని అందిస్తుంది.



## అరటి పండు కేక్



**కావాల్సినవి:** అరటిపండ్లు 3, గోధుమపిండి పావుకప్పు, పాలు పావుకప్పు, బేకింగ్ సోడా అరచెంచా, నూనె లేదా నెయ్యి అరకప్పు, చక్కెర అరకప్పు, కోకోపౌడర్ 2 చెంచాలు.

**తయారీ:** బాగా పండిన అరటిపండ్లను ఒక పాత్రలో మెత్తగా మెదిపి అందులో గోధుమపిండి, పాలు, నెయ్యి, చక్కెర, బేకింగ్ సోడా, కోకోపౌడర్ వేసి బాగా కలిపి గిలకొట్టాలి. ఆ మిశ్రమాన్ని నూనె రాసిన కేక్ ట్రేలో వేసి పక్కకు పెట్టుకోవాలి. ఒక వెడల్పాటి పాత్రను 10 నిమిషాలపాటు వేడి చేశాక చిన్న బౌల్ లేదా స్టాండ్ పెట్టి, కేక్ ట్రేను ఉంచి అరగంట ఉడికించాలి. చల్లారాక ప్లేట్‌లోకి తీసుకోవాలి. ▫

## కివీతో ప్రయోజనాలెన్నో..



ఇది విదేశీ పండు అయినా ఇప్పుడు మనదగ్గరా ఎక్కువగానే పండిస్తున్నారు. ఇందులో ఉండే విటమిన్లు, ఖనిజాలు ఆరోగ్యానికి ఎతో మేలు అంటున్నారు నిపుణులు.అవేంటో చూసేద్దాం.

✦. కివీలోని ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్-బి 6 పుష్కలంగా ఉన్నాయి. వీటిని రోజూ అరటి, స్ట్రాబెర్రీ వంటి పండ్లతో కలిపి ఉదయం లేదా సాయంత్రం తినడంవల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

✦. పండ్లు అంటేనే పిల్లలు తినడానికి ఇష్టపడరు. అందుకే వీటిని అనినన రకాల ఫ్రూట్స్‌తో కలిపి సలాడ్స్‌గా లేదా ఐస్‌క్రీమ్‌గా మార్చి వాళ్లకి ఇవ్వండి. ఇష్టపడి తింటారు. ఇది మెదడు చురుకుగా పనిచేసేలా చేస్తుంది.

✦ వయసు పైబడే కొద్దీ కొందరిలో ఎముకల పనితీరు, కంటి చూపు మందగిస్తుంది. కివీని రోజూ తీసుకోవడం వల్ల దీనిలో ఉండే కాల్షియం, ఫాస్ఫరస్ ఎముకలను బలపరు స్తాయి. విటమిన్-ఎ కంటిచూపును మెరుగుపరుస్తుంది.

✦. కొంతమందిలో అలసట లేదా ఒత్తిడి కారణంగా నిద్రలేమి కనిపిస్తుంటుంది. కివీ తింటే సెరటోనిన్ హార్మోన్ ఉత్పత్తి పెరిగి ప్రశాంతమైన నిద్ర పడుతుంది.

✦. కివీలోని విటమిన్-సి, యాంటీ ఆక్సిడెంట్లు ఆస్తమా ఉన్నవారిలో శ్వాసకోశ సమస్యలను తగ్గిస్తాయి. ఇందులోని పొటాషియం రక్తపోటు స్థాయిలను తగ్గించడంలో సాయపడుతుంది. ▫

## మే 15న మా ఇంటి బంగారం



సమంత రూత్ ప్రభు - నందిని రెడ్డి కలయికలో వస్తు న్న ప్రతి ష్టాత్మక చిత్రం మా ఇంటి బంగారం విడుదల తేదీ ఖరారైంది. ఈ చిత్రం 2026 మే 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. గతంలో సూపర్ హిట్‌గా నిలిచిన బేబీ తర్వాత సమంత రూత్ ప్రభు మరియు దర్శకురాలు నందినీరెడ్డి మరోసారి కలిసి పనిచేస్తుండటంతో చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. సమంత రూత్‌ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాను త్రలాల మూవింగ్ పిక్చర్స్ నిర్మిస్తోంది. ఈసారి యాక్షన్ డ్రామా జానర్‌లో రూపొందుతున్న ఈ చిత్రం భావోద్వేగాలు, కమర్షియల్ అంశాలు సమన్వయంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఇటీవల విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభించగా, తాజాగా విడుదల తేదీని తెలియజేస్తూ విడుదల చేసిన పోస్టర్ కూడా ఆకట్టుకుంది. ఈ చిత్రంలో దిగంత్, గుల్షన్ దేవయ్య కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సంగీతాన్ని సంతోష్ నారాయణ అందిస్తుండగా, ఛాయాగ్రహణాన్ని ఓం ప్రకాష్ నిర్వహిస్తున్నారు. చిత్రీకరణ చివరి దశకు చేరుకున్న ఈ చిత్రం 2026 సమ్మర్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో ఒకటిగా నిలుస్తోంది.

# తెర

## జై హనుమాన్ శుభారంభం



దైవభక్తి, సాంస్కృతిక వైభవం నిండిన వాతావరణంలో దర్శకుడు ప్రశాంత్ వర్మ రూపొందిస్తున్న ప్రతిష్టాత్మక పురాణ చిత్రం జై హనుమాన్ ప్రారంభ పూజలు హంపిలోని అంజనాద్రి బెట్ట వద్ద ఘనంగా నిర్వహించారు. హనుమంతుని జన్మస్థలంగా విశ్వసించే ఈ పవిత్ర ప్రదేశంలో ప్రారంభం కావడం చిత్రానికి విశేష ప్రాధాన్యతను తీసుకువచ్చింది. గతంలో ఘన విజయం సాధించిన హనుమాన్ తరువాత తన చిత్ర విశ్వంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతున్న ప్రశాంత్ వర్మకు ఈ చిత్రానికి మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణ సహకారం అందిస్తుండగా, టి- సిరీస్ సమర్పిస్తోంది. ఆధ్యాత్మికతతో పాటు విశాలమైన రూపకల్పనతో ఈ చిత్రం మహత్తర స్థాయిలో రూపొం దనుం ది. జాతీయ పురస్కార గ్రహీత రిషబ్ శెట్టి ఈ చిత్రంలో ఆంజనేయస్వామి పాత్రను ధరించనున్నారు. కాంతార చిత్రంతో జాతీ య స్థాయిలో గుర్తింపు పొందిన ఆయన, ఇటీవల విడుదలైన మొదటి దర్శన చిత్రంతోనే దేశవ్యాప్తంగా విశేష స్పందన అందుకున్నారు. ప్రారంభ కార్యక్రమంలో భూషన్ కుమార్ శుభారంభ శంఖం మోగించగా, అనిల్ థడాని చిత్రీకరణ యంత్రాన్ని ప్రారంభించారు. తొలి దృశ్యాన్ని తేజ సజ్జ దర్శకత్వం వహించారు. అంతకుముందు అనిల్ థడాని, భూషణ్ కుమార్, నవీన్ యెర్నేని, రవి శంకర్ కలిసి కథా గ్రంథాన్ని దర్శకుడు ప్రశాంత్ వర్మకు అందజేశారు.ఈ చిత్రానికి సంగీతాన్ని ఎం.ఎం కీరవాణి సమకూర్చుతుండగా, ఛాయాగ్రహణాన్ని ఎస్. తిరునావుక్కరసర్ నిర్వహిస్తున్నారు. శ్రీనాగేంద్ర నిర్మాణ రూపకల్పన బాధ్యతలను చేపట్టారు.

## సామాజిక అంశాల సమ్మేళనం



రఫ్ నోట్ ప్రొడక్షన్ సంస్థ నిర్మిస్తున్న ప్రతిష్టాత్మక తమిళ-తెలుగు ద్విభాషా చిత్రం గాడ్స్ అండ్ సోల్జర్స్ ప్రధాన చిత్రీకరణ పూర్తైంది. ప్రముఖ దర్శకుడు, సినిమాటోగ్రాఫర్ విజయ్ మిల్టన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం విభిన్న ప్రదేశాల్లో విస్తృతంగా షూటింగ్ జరుపుకుంది. ప్రస్తుతం చిత్రబృందం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో నిమగ్నమైంది. భారీ స్థాయిలో, భావోద్వేగాల నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం, విజయ్ మిల్టన్ శైలికి అనుగుణంగా వాస్తవిక కథనంతో పాటు వాణిజ్య అంశాలను మేళవించిన సినిమాటిక్ అనుభూతిని అందించనుంది. ఈ చిత్రంలో విశిష్టమైన నటీనటుల సమాహారం ఉంది. ఆరి అరుజునన్ తొలిసారి పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. రాజ్ తరుణ్ ఈ చిత్రంతో తమిళంలో అడుగుపెడుతున్నారు. ప్రత్యేక ఆకర్షణగా స్వతంత్ర సంగీత కళాకారుడు వేధన్ కూడా ఒక ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. తన ప్రత్యేక గాత్రం, సామాజిక అంశాలపై ఆధారిత గీతాలతో యువతలో గుర్తింపు పొందిన వేధన్ పాల్గొనడం ద్వారా చిత్రానికి సాంస్కృతిక, సంగీత పరమైన ప్రత్యేకత కలగనుంది. షూటింగ్ పూర్తైన సందర్భంగా దర్శకుడు విజయ్ మిల్టన్ తన సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సినిమా కోసం అందరూ శారీరకంగా, భావోద్వేగంగా కష్టపడ్డారని తెలిపారు. రఫ్ నోట్ ప్రొడక్షన్ నిర్మిస్తున్న ఈ చిత్రం యాక్షన్, భావోద్వేగం, సామాజిక అంశాల సమ్మేళనంగా తమిళ, తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందుతోంది.

## మెగా సత్కారం



మెగాస్టార్ చిరంజీవి బిగ్గెస్ట్ రీజినల్ బ్లాక్ బస్టర్ మన శంకర వర ప్రసాద్ గారు సెలబ్రేషన్స్ కొనసాగుతున్నాయి. చిత్రం ఘన విజయం సాధించిన సందర్భంగా తాజాగా శ్రీ కె.వి. రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో చిరంజీవిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాతలు సాహు గారపాటి, సుష్మిత కొణిదెలతో పాటు కె రాఘవేంద్రరావు, సి. అశ్వనీదత్, అల్లు అరవింద్, సురేష్ బాబు, ఎ.కోదండరామిరెడ్డి, బి గోపాల్, వి వి వినాయక్, బాబీ, బుచ్చిబాబు సానా, బండ్ల గణేష్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, పలువురు సినీ రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. మన శంకర వర ప్రసాద్ గారు సంక్రాంతి సందర్భంగా థియేటర్లలో అద్భుతాలు సృష్టించి ప్రపంచవ్యాప్తంగా 400 కోట్లకు పైగా వసూళ్లతో బిగ్గెస్ట్ రీజినల్ హిట్‌గా నిలిచింది. చిరంజీవి గారి కెరీర్‌లో 400 కోట్లు కలెక్ట్ చేసిన తొలి చిత్రంగా చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల ఈ చిత్రాన్ని నిర్మించారు.

## అన్ని భాషల్లోనూ అశోకుడు

సతీష్ నీనసాం కథానాయకుడిగా కాంతార ఫేమ్ సప్తమి గౌడ హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం ది రైజ్ ఆఫ్ అశోక. కన్నడ, తెలుగు, తమిళ భాషలో ఏకకాలంలో రూపొందుతున్న ఈ చిత్రానికి వినోద్.వి.దుండలే దర్శకుడు. వృద్ధి క్రియేషన్స్ అండ్ సతీష్ పిక్చర్ హౌస్ పతాకంపై వర్ధన్ హరి, జైష్ణవి, సతీష్ నీనసాం సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగులో కళాసృష్టి ఇంటర్నేషనల్ పతాకంపై రవిశంకర్ తెలుగులో ఈ చిత్రాన్ని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో పంపిణి చేస్తున్నారు. ఈ చిత్రాన్ని ఈ నెల 27న ఈ చిత్రం అన్ని భాషల్లో విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా సత్యదేవ్ మట్లాడుతూ తెలుగు ప్రేక్షకులు కంటెంట్ సినిమాలను ఆదరిస్తారు. ఈ సినిమాను కూడా ఆదరిస్తారు. ట్రైలర్ చూసి మా ఆడియన్స్ ఈ సినిమా చూడాలని డిసైడ్ అయ్యారు. హీరో సతీష్ నీనసాం మాట్లాడుతూ తెలుగు భాష అంటే నాకు ఎంతో గౌరవం. ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నాను. రవిశంకర్ ఈ సినిమా చూసి తెలుగులో విడుదల చేస్తున్నారు. సప్తమి గౌడ మాట్లాడుతూ అందరికి ఈ ట్రైలర్ నచ్చిందని అనుకుంటున్నాను. తెలుగు ప్రేక్షకుల సపోర్ట్ మాకు కావాలి. మా ట్రైలర్‌ను విడుదల చేసి, మమ్ములను ఎంకరైజ్ చేస్తున్న సత్యదేవ్ గారికి కృతజ్ఞతలు. నిర్మాత మాట్లాడుతూ తెలుగు ఆడియన్స్‌కు కనెక్ట్ అయ్యే సినిమా ఇది. కళా సృష్టి అధినేత రవిశంకర్ మాట్లాడుతూ ఏపీ, తెలంగాణతో పాటు ఒరిస్సాలో నా సంస్థ ద్వారా విడుదల చేస్తున్నాను.



## వినోదం ఇవ్వడమే లక్ష్యం



ప్రామిసింగ్ కథానాయకుడు సుహాస్, శివానీ నాగారం జంటగా రూపొందిన హిలేరియస్ ఎంటర్‌టైనర్ హే బల్‌వంత్. గోపీ అచ్చర దర్శకత్వంలో త్రిశుల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి.నరేంద్ర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. బన్నీవాస్, వంశీ నందిపాటిల సక్సెస్‌ఫుల్ ద్వయం నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్‌పై ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కమెడియన్ సుదర్శన్ మాట్లాడుతూ సినిమాకు చాలా క్రేజీ రెస్పాన్స్ వస్తోంది. నేను పోషించిన బంక పాత్రను ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తున్నారు. ఈ చిత్రంలో నా పాత్రకు ఇంపార్టెన్స్ వల్ల పాత్ర బాగా ఎలివేట్ అయ్యింది. డ్రింకింగ్ సీన్, వెన్నెల కిషోర్‌తో చేసిన ప్రకృతి చికిత్సాలయం సీన్స్‌కు థియేటర్స్‌కు ఊగిపోతున్నాయి. అనుకోకుండా సినీ పరిశ్రమకు వచ్చాం. కమెడియన్‌గా ఇప్పుడిప్పుడు ఎదుగుతున్నాను. హీరోగా అవకాశం వచ్చినా ఇప్పుడే చేయను. గతంలో కూడా హాస్య నటులుగా తమకంటూ ఓ గుర్తింపు వచ్చిన తరువాత వాళ్లు హీరోలుగా చేశారు. నా కెరీర్ ఇప్పుడే ఊపందుకుంటోంది. ఈ సమయంలో అలాంటి ఆలోచన లేదు. హీరోగా చేస్తే కమెడియన్‌గా అవకాశాలు తగ్గిపోతాయని భయం కూడా ఉంది. నా మీదే నేను పంచ్‌లు వేసుకోవటానికి ఎలాంటి పట్టింపూ లేదు. ఫైనల్‌గా ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడమే ముఖ్యం. దాని కోసం ఎలాంటి పాత్రలైనా చేస్తాను. ప్రస్తుతం బిజీగా ఉండటంతో కొన్ని సార్లు డేట్స్ క్లాష్ వల్ల మంచి సినిమాలు కూడా వదులుకోవాల్సి వస్తోంది. మృత్యుంజయతో పాటు, గోదావరి గట్టు మీదలో కూడా మంచి పాత్రలు చేశాను. త్వరలోనే అవి విడుదల కానున్నాయి. వీటితో పాటు మరికొన్ని చిత్రాల్లో నటిస్తున్నాను.

## బ్యాండ్ మేళంతో తిప్పుకుంటన్నవ్



మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ మీద కోన వెంకట్ రూపొందించిన చిత్రం బ్యాండ్ మేళం. సతీష్ జవ్వాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో హర్ష్ రోషన్, శ్రీదేవీ జంటగా నటించారు. కావ్య, శ్రావ్య నిర్మించిన ఈ మూవీని మార్చి 13న విడుద చేయబోతోన్నారు. బ్యాండ్ మేళం సినిమా నుంచి ఇప్పటి వరకు రిలీజ్ చేసిన కంటెంట్ ఆడియెన్స్‌లో క్యూరియాసిటీని పెంచిన సంగతి తెలిసిందే. వాలెంటైన్స్ డే సందర్భంగా వదిలిన గ్లింప్స్ యూత్‌ని ఇట్టే ఆకట్టుకుంది. తిప్పుకుంటన్నవ్ అంటూ సాగే ఈ పాటను రాము రాథోడ్, అదితి భవరాజు ఆలపించారు. విజయ్ బుల్గానిన్ ట్యూన్ అయితే ఎంతో శ్రావ్యంగా ఉంది. ఈ పాటకు ఆస్కార్ అవార్డ్ గ్రహీత చంద్రబోస్ సాహిత్యాన్ని అందించారు.

# సఫారీల సూపర్ విక్టరీ




## కుప్పకూలిన టీమిండియా బ్యాటింగ్

**"భయపడుతున్నదంతా జరిగింది. టీమిండియా బ్యాటింగ్ డొల్లతనం బయటపడింది. అసలు సిసలు పరీక్షలో తడబడింది. సఫారీల మేటి బౌలింగ్ ముందు భారత బ్యాట్స్‌మెన్ ఒకరి వెంట ఒకరిగా పెవిలియన్ చేరారు. మరీ పెద్ద లక్ష్యం కాకున్నా ఏ ఒక్కరూ క్రీజ్‌లో కుదురుకుందామన్న ధ్యాస లేకుండా లేజీ షాట్లతో వికెట్లు సమర్పించుకున్నారు. సొంతగడ్డపై ఒత్తిడంతా భారత్‌పైనే ఉంటుందని, ఆ ఒత్తిడినే సద్వినియోగం చేసుకుంటామన్న దక్షిణాఫ్రికా కోచ్ మాటలను నిజం చేస్తూ సూపర్ ఎయిట్‌లో సూపర్ విక్టరీ అందుకుంది"**

**అహ్మదాబాద్:** టీట్వంటీ ప్రపంచకప్ సూపర్8 లో ఆడిన తొలి మ్యాచ్‌లోనే టీమిండియా.. సౌతాఫ్రికా చేతిలో 76 పరుగుల భారీ తేడాతో ఘోర పరాజయం పొందింది. 188 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా... మార్కో జాన్సెస్ బౌలింగ్ ధాటికి మరో 7 బంతులు మిగిలి ఉండగానే 111 పరుగులకు ఆలౌటైంది. ఇషాన్‌ను డకౌట్ చేసి మార్క్‌మ్ భారత్ పతనానికి నాంది పలికాడు. ఆ తర్వాత జాన్సెస్ అద్భుత బంతులతో 51 పరుగులకే సగం వికెట్లు కోల్పోయింది. మూడు గోల్డెన్ డక్‌లు ఇచ్చిన అభిషేక్(15) తనపై నమ్మకాన్ని నిలుపుకోలేకపోయాడు. తిలక్ వర్మ(1), సూర్య కుమార్(18), వాషింగ్టన్(11) నిరాశపరిచారు. హార్దిక్ (18), దూబే(42) కొద్దిసేపు వికెట్ల పతనాన్ని ఆపినా... కేశవ్ మహారాజ్ ఎంట్రీతో వెంటవెంటనే పెవిలియన్ చేరారు. రింకూ సింగ్ డకౌటయ్యాడు. చివరి వరుస బ్యాట్స్‌మెన్ స్పిన్ ఉచ్చులో చిక్కారు. దూబే ఒక్కడే ధాటిగా ఆడి 37 బంతుల్లో 3 సిక్స్‌లతో 42 రన్స్ చేశాడు. సౌతాఫ్రికా బౌలర్లలో జాన్సెన్ 4, కేశవ్ మహారాజ్ 3, బాచ్ రెండు వికెట్లు పడగొట్టారు. అర్ధసెంచరీతో రాణించిన డేవిడ్ మిల్లర్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దక్కింది.



## బూమ్ బూమ్ బుమ్రా

యార్కర్ల కింగ్ బుమ్రా నిప్పులు చెరిగారు. మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికాకు పేస్ బౌలింగ్‌తో చుక్కలు చూపాడు. రెండో ఓవర్ వేసిన బుమ్రా అద్భుతబంతితో డికాక్‌ను బోల్తా కొట్టించాడు. నిప్ బ్యాకర్ డెలివరీగా సంధించిన ఈ బంతి లో బౌన్స్‌గా వచ్చి లెగ్ స్టంప్‌ను పడగొట్టింది. ఆశ్చర్యపోవడం డికాక్(6) వంతైంది. ఇక నాలుగో ఓవర్లో రికల్టన్(7)ను స్లోబంతితో అవుట్ చేశాడు. స్లో బంతిని ఊహించని రికల్టన్ బ్యాట్ ఝుళిపించడంతో కవర్ పాయింట్‌లో శివమ్ దూబేకు ఈజీ క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. అంతకుముందు ఓవర్‌లో అర్షదీప్.. ఫామ్‌లో ఉన్న మార్క్‌మ్(4)ను కంగుతినిపించాడు. మిడాఫ్‌లో ఈక్యాచ్‌ను హార్దిక్ తీసుకున్నాడు. దీంతో సౌతాఫ్రికా 20 రన్స్‌కే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

**మిల్లర్, బ్రేవిస్ ధనాధన్**

డేవిడ్ మిల్లర్(35బంతుల్లో 63), బ్రేవిస్(29 బంతుల్లో 45) దూకుడుగా ఆడారు. 5ఓవర్ వేయడానికి వచ్చిన వరుణ్‌ను టార్గెట్ చేసుకున్నారు. మిల్లర్ వరుసగా రెండో బౌండరీలు బాదాడు. ఆరో ఓవర్ వేసిన అర్షదీప్ బౌలింగ్‌లో మిల్లర్ మరో రెండు ఫోర్లు.. తరువాతి సుందర్ ఓవర్లో మిల్లర్, బ్రేవిస్ చెరో బౌండరీ రాబట్టారు. 9వ ఓవర్ వేసిన వరుణ్ బౌలింగ్‌లో మిల్లర్ ఓ సిక్స్, బ్రేవిస్ ఓ ఫోర్,ఓసిక్స్‌తో మొత్తం 17 రన్స్ పిండుకున్నారు. పదో ఓవర్లో హార్థిక్ బంతిని మిల్లర్ లాంగ్ ఆన్ మీదుగా సిక్స్ బాదాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన దూబే ఓవర్లో బ్రేవిస్ ఓ ఫోర్, ఓ సిక్స్‌తో 15 రన్స్ సాధించి సౌతాఫ్రికా స్కోరు వంద దాటించాడు. ఎట్టకేలకు ఈ జోడీని దూబే విడదీశాడు. ఈ జోడీ 4వ వికెట్‌కు 50బంతుల్లోనే 97రన్స్ జోడించింది. దూబే బౌలింగ్‌లో సిక్స్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన మిల్లర్ అదే జోరు కొనసాగిస్తూ 63 రన్స్ చేసి వరుణ్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. ఆ తర్వాత అర్షదీప్, బుమ్రా వికెట్లు తీయడంతో స్కోరు వేగం తగ్గింది. మరోవైపు స్టబ్స్ ధాటిగా ఆడుతూ 20వ ఓవర్ వేసిన హార్దిక్ బౌలింగ్‌లో ఓ ఫోర్ సహా రెండు సిక్స్‌లతో 20 రన్స్ రాబట్టడంతో సౌతాఫ్రికా స్కోరు 20 ఓవర్లలో 7 వికెట్లకు 187 రన్స్ సాధించింది. బుమ్రా 3, అర్షదీప్ 2 వికెట్లు తీశారు.

## ఇంగ్లాండ్ చేతిలో లంక విలవిల




**పల్లెకల్:** సొంతగడ్డపై లంకేయులు విలవిల్లాడారు. టీ20 ప్రపంచకప్ సూపర్8 గ్రూప్2 లో ఇంగ్లాడ్ చేతిలో చిత్తుచిత్తుగా ఓడింది. ఇంగ్లాండ్ నిర్దేశించిన 147 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లంకను ఇంగ్లాండ్ స్పిన్ ఉచ్చులో పడేసింది. ఆఫ్ స్పిన్నర్ విల్ జాక్స్ దెబ్బకు బ్యాట్స్‌మెన్ పెవిలియన్‌కు క్యూ కట్టారు. లంక ఓపెనర్లు పథుమ్ నిశాంక(9), కమిల్ మిషారా(6) లను పేసర్ జోఫ్రాఆర్చర్ అవుట్ చేసి తొలి దెబ్బ తీశాడు. ఆతర్వాత విల్ జాక్స్ వంతయింది. విల్ జాక్స్ ఆఫ్ బ్రేక్‌లకు శ్రీలంక 34 పరుగులకే సగం వికెట్లు కోల్పోయింది. డాసన్, అదిల్ రషీద్ రెండేసి వికెట్లు.. జేమీ ఓవర్టన్ ఒక వికెట్ తీయడంతో శ్రీలంక 16.4 ఓవర్లలోనే 95 పరుగులకు కుప్పకూలింది. లంక ఇన్నింగ్స్‌లో దాసున్ షనక సాధించిన 30 పరుగులే టాప్ స్కోరు.

అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 146 రన్స్ చేసింది. జాస్ బట్లర్, జాకబ్ బెతెల్, టామ్ బాంటన్ సింగిల్ డిజిట్‌కే అవ్వుటైనా ఇంగ్లాండ్‌ను ఫిల్ సాల్ట్(40 బంతుల్లో 62 రన్స్) ఆదుకున్నారు. లంక బౌలర్లపై బౌండరీలు, సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు. మిగతా వారిలో విల్ జాక్స్ 21 రన్స్ చేశాడు. లంక బౌలర్ల లో దునిత్ మూడు, దిల్షాన్ 2, తీక్షణ 2 వికెట్లు పడగొట్టారు.

**సంక్షిప్త స్కోర్లు**

**ఇంగ్లాండ్-146/9**(20 ఓవర్లలో) (ఫిల్ సాల్ట్ 62, విల్ జాక్స్ 21, దునిత్ 3/26, మధుశంక 2/25, తీక్షణ 2/21); **శ్రీలంక-95 ఆలౌట్**(16.4ఓవర్లలో) (దాసున్ షనక 30, విల్ జాక్స్ 3/22, జోఫ్రా ఆర్చర్ 2/20, డాసన్ 2/27, అదిల్ రషీద్ 2/13)

## విమెన్స్ వండర్స్ : ఆసియాకప్ కైవసం




**బ్యాంకాక్:** మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్‌ను డిఫెండింగ్ ఛాంపియన్ భారత్-ఎ నిలబెట్టుకుంది. బ్యాంకాక్ వేదికగా జరిగిన ఫైనల్లో బంగ్లాదేశ్‌పై 46 పరుగుల తేడాతో గెలుపొంది వరుసగా రెండోసారి కప్ అందుకుంది.

టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్ చేసిన భారత్-ఏ మహిళల జట్టు నిర్ణీత 20ఓవర్లలో7 వికెట్ల నష్టానికి 134 రన్స్ చేసింది. 44 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన తేజల్ హసబ్నిస్(34 బంతుల్లో 51) అర్ధ సెంచరీతో ఆదుకుంది. రాధా యాదవ్ (36 రన్స్)తో కలిసి అయిదో వికెట్‌కు 69 పరుగులు జోడించింది. బంగ్లా బౌలర్లలో ఫహిమా ఖాతూన్ నాలుగు వికెట్లు పడగొట్టింది.

135 పరుగుల లక్ష్యంతోబ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్‌ను భారత మహిళలు కుప్పకూల్చారు. ప్రేమా రావత్ మూడు వికెట్లు.. సోనియా, తనుజా చెరో రెండు వికెట్లు తీయడంతో బంగ్లాదేశ్ 88 పరుగులకు ఆలౌటైంది. ఆ జట్టులో సుల్తానా చేసిన 20 పరుగులకే టాప్ స్కోరు. హాఫ్ సెంచరీతో రాణించిన తేజల్.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచింది.




## ప్రొ హాకీ లీగ్ : భారత్ షూటౌట్

**హోబర్ట్:** ఎఫ్‌ఐహెచ్ ప్రొ లీగ్‌లో భారత హాకీ జట్టు ఓటములు కొనసాగుతున్నాయి. సొంతగడ్డపై నిరాశపరిచిన భారత్... ఆస్ట్రేలియా అంచె ప్రొలీగ్ తొలి మ్యాచ్‌లోనే షూటౌట్ ఓటమి ఎదురైంది. ఈ మ్యాచ్‌లో భారత హాకీ వీరులు 45వ నిమిషం వరకు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. ఆట 14వ నిమిషంలో అమిత్ రోహిదాస్ గోల్ చేసి 1-0 ఆధిక్యం అందించగా, 43వ నిమిషంలో జుగ్రాజ్ సింగ్ గోల్‌తోఆధిక్యం 2-0కు చేరుకుంది. గెలుపు బాటలో ఉన్న భారత్ ఆశలపై నీళ్ల చల్లుతూ ఆస్ట్రేలియా చివరి నిమిషాల్లో వేగంగా రెండు గోల్స్ చేసింది. 47వ నిమిషంలో, 56వ నిమిషంలో జోయెల్ రింటాలా చేసిన గోల్స్‌తో ఆస్ట్రేలియా 2-2తో సమవుజ్జీగా నిలిచింది. పూర్తి సమయం ముగిసే సరికి రెండు జట్లు 2-2తో సమానంగా నిలవడంతో ఫలితం తేల్చడానికి పెనాల్టీ షూటౌట్ నిర్వహించారు. షూటౌట్‌లో మాత్రం ఆస్ట్రేలియా 5-4 తేడాతో విజయం సాధించింది.

## కొడుక్కి హార్దిక్ 4కోట్ల కారు గిఫ్ట్

**ముంబై:** టీమిండియా స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్య.. తన కొడుకు అగస్త్యకు 4కోట్ల ఖరీదైన కారును గిఫ్ట్ ఇచ్చాడు. ముంబైలోని ఓ కార్ల షోరూమ్‌లో ల్యాండ్ రోవర్ డిఫెండర్ కారు కీని తన తల్లి నటాషాతో కలిసి అగస్త్య అందుకున్నాడు. దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. హార్దిక్ పాండ్య, నటాషా 2020లో పెళ్లి చేసుకున్నారు. వీరి సంతానమే అగస్త్య. మనస్పర్థలతో 2024లో విడాకులు తీసుకున్నారు. నటాషా సంరక్షణలోనే అగస్త్య ఉంటున్నాడు. అధికారికంగా విడిపోయిన తర్వాత కూడా హార్దిక్, నటాషా... తమ కుమారుడి విషయంలో ఎక్కడా రాజీ పడటం లేదు. ప్రస్తుతం మోడల్ మహికా శర్మతో హార్దిక్ పాండ్య చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నాడు. తామిద్దరం రిలేషన్‌లో ఉన్నట్లు పాండ్య అధికారికంగా వెల్లడించాడు. స్విమ్మింగ్ పూల్‌లో వీరిద్దరి రొమాన్స్ హాట్ టాఫిక్‌గా నిలిచింది.







## వాణిజ్య బ్యాంకుల నికర లాభాలు రూ.లక్ష కోట్లు!

**ముంబయి, ఫిబ్రవరి 22:** ప్రభుత్వరంగ బ్యాంకులు రికార్డుస్థాయిలోమూడో త్రైమాసికంలో నికరలాభాలు చవిచూసాయి. మొత్తం షెడ్యూల్డు వాణిజ్య బ్యాంకులు కలిపి రూ.లక్ష కోట్లు రూపాయలు అధిగమించాయి.

బ్యాంకింగ్‌చరిత్రలోనే మొట్టమొదటిసారిగా ప్రైవేటు బ్యాంకులకంటే ప్రభుత్వ రంగ బ్యాంకులు నికరలాభాలను పెంచుకోగలిగాయి నికరలాభాలు 10.6శాతం వార్షికపద్ధతిలో పెరిగాయి.

అలాగే ఇతర ఆదాయవనరులపరంగా కూడా రెండంకెల వృద్ధి కొంత కలిసొచ్చింది. దీనితో బ్యాంకుల మార్జిన్లు మెరుగుపడ్డాయి. స్థిరాస్తిప్రమాణాలు పటిష్టం అయ్యాయి. రుణాల్లోకూడా పెరుగుదల కనిపించింది. అయితే నిర్వహణ ఖర్చులుమాత్రం పెరగడం కొంత నిరాశకలిగించింది. ప్రభుత్వరంగ బ్యాంకుల నికరలాభాలు 17.5శాతం పెరిగి0.55 లక్షలకోట్లుగా ఉంటే ప్రైవేటురంగ బ్యాంకులు 3.2శాతం మాత్రమే వృద్ధిని నమోదుచేసి 0.45 లక్షలకోట్లు ఆర్జించాయి.

కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ నివేదిక ప్రకారం ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఎక్కువగా ట్రెజరీ లబ్ధిపెరిగింది. రికవరీలు మెరుగుపడ్డాయి. సాంకేతికంగా రద్దుచేసిన ఖాతాలుకూడా తగ్గాయి. విభిన్న కేటగిరీల్లో రుణాలు కూడాపెరిగాయి. ఇక బ్యాంకింగ్ ఆస్తులపై రిటర్నులు షెడ్యూల్డు వాణిజ్య బ్యాంకుల్లో స్వల్పంగా ఒక బేసిస్‌పాయింట్‌పెరిగి వార్షికవృద్ధి ప్రాతిపదికన 1.34శాతానికి చేరింది. కేటాయింపులు ఎక్కువగా ఉండటం వల్ల ప్రభుత్వరంగ బ్యాంకుల్లో రిటర్న్ ఆన్ అసెట్స్ ఆర్వోయే స్వల్పవృద్ధి మాత్రమే ఉన్నట్లు బ్యాంకింగ్‌ర ంగనిపుణులు అంచనావేసారు.




**వాణిజ్యం**

## ఐడిఎఫ్‌సి బ్యాంకులో రూ.590 కోట్ల మోసం!

**ఛండీఘర్, ఫిబ్రవరి 22:** ప్రైవేటురంగ బ్యాంకింగ్ సంస్థ ఐడిఎఫ్‌సి ఫస్ట్‌బ్యాంకు రూ.590 కోట్లుమేర మోసం జరిగినట్లు గుర్తించింది. హర్యానా రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఖాతాల్లో ఛండీఘర్ బ్రాంచ్‌లో ఈ మోసం జరిగిందని, ఇందుకు సంబంధజంచి నలుగురు ఉద్యోగులను కూడా సస్పెండ్‌చేసినట్లు ప్రకటించింది. ప్రభుత్వశాఖల్లో ఒకటి ఐడిఎఫ్‌సి ఫస్ట్‌బ్యాంకులో తమ ఖాతాలను మూసివేసి మరో బ్యాంకుకునిధులను మళ్లించేందుకు నిర్ణయించింది. అయితే ఆ ప్రభుత్వశాఖ వెల్లడించిన మొత్తానికి, ఖాతాలో ఉన్న మొత్తానికి పొంతన లేకుండా ఉంది. కేటాయింపులపరంగా బ్యాంకు కొంతమూలధనం పక్కకకు పెట్టాల్సి ఉంటుంది. ఒకసారి మోసం గుర్తించిన వెంటనే కేటాయింపులు జరపాలి. బ్యాంకు ప్రాథమికంగా గుర్తించినమోసం డిసెంబరులో బ్యాంకు ఆర్జించిన రూ.503 కోట్లకంటే ఎక్కువగా ఉంది. స్టాక్ ఎక్ఛేంజిలకు ఇచ్చిన నివేదికల్లోకూడా బ్యాంకు వాస్తవాలను తెలిపింది. ఫోరెన్సిన్ ఆడిట్‌కోసం బయటి సంస్థలకు బాధ్యతలిచ్చినట్లు ప్రకటించింది. అనధికారిక, మోసపూరిత లావాదేవీలుజరిగినట్లు ముంబయి కేంద్రంగా ఉన్న ఈబ్యాంకు గుర్తించింది. ఒక్క శాఖలోనే వెల్లడి కావడంతో ఇతర ప్రభుత్వసంస్థలు కూడా తమతమ ఖాతాల వివరాలు వెల్లడించాలని కోరాయి. బ్యాంకు రికార్డుల్లోను, ప్రభుత్వశాఖల నివేదికల్లోను తేడాలున్నాయి. ప్రాథమికంగా మోసం జరిగినట్లు తేలడంతో బ్యాంకు నలుగురు ఉద్యోగులను సస్పెండ్‌చేసింది. మోసం చేసిన మొత్తం రూ.590 కోట్లవరకూ ఉంటుందని బ్యాంకు తన ఫైలింగ్‌లో వెల్లడించింది. పోలీసులకు కూడా ఫిర్యాదుచేసామని, ఇతర ఫిర్యాదులను కూడా చట్టపరమైన సంస్థలకు అందచేస్తున్నట్లుప్రకటించింది. దర్యాప్తుసంస్థలకు పూర్తి సహకారం అందిస్తామని ప్రకటించింది.

## గ్రీన్ అడ్వాన్స్ పోర్టుపోలియో 10%కి పెంచుతున్న ఎస్‌బిఐ




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:** ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్‌బ్యాంకు గ్రీన్ అడ్వాన్సుల పోర్టుఫోలియోను 7.5 నుంచి 10శాతానికి పెంచాలనినిర్ణయించింది. కేంద్రం నిర్దేశించిన కర్బన ఉద్గారాల తగ్గింపు విధానానికి అనుగుణంగా హరిత రుణాలను పదిశాతానికి పెంచేందుకునిర్ణయించింది. ఈ రుణాల్లో 25శాతం పూర్తిగా కేటాయించిన గ్రీన్‌డెట్ కౌంటర్లనుంచే అందించడం జరుగుతుంది. మొత్తం అడ్వాన్సుల్లో హరిత రుణాల పోర్టుఫోలియో 1.56శాతంగా నిలిచింది. ఇప్పటికే బ్యాంకు పునరుత్పత్తి విద్యుత్, విద్యుత్‌మొబిలిటీ, గ్రీన్‌హైడ్రోజెన్ రంగాలకుగాను చక్రా కౌంటర్ ప్రారంభించింది. పర్యావరణ ఫోకస్ ఉన్న పరిశ్రమలకు సత్వర రుణసాయం అందించేందుకు ఈ హరిత రుణ విధానం అనుసరించనున్నట్లు చెపుతోంది. ఎస్‌బిఐ ఇప్పటికే గ్రీన్‌మారథాన్ ఆరో ఎడిషన్‌నిర్వహించింది. రన్‌ఫర్‌ల గ్రీనర్ ఇండియా నినాదంతో ముంబయిలో ఐదు, 10, 21 కిలోమీటర్ల కేటగిరీలో రన్‌నిర్వహించింది. ప్రాధాన్యతా కేటగిరీలో వ్యవసాయ రంగానికి ఎక్కువ కేటాయింపులు జరిపిన ఎస్‌బిఐ ఇపుడు క్లీన్ ఎనర్జీ ఉత్పాదక రంగాలను కూడా ఎంపికచేసింది. ఇందులోభాగంగానే పునరుత్పాదక విద్యుత్‌ప్రాజెక్టులు ఈ హరిత రుణ కేటాయింపులపరిధిలోకి వస్తాయి.

## మార్కెట్లకు ట్రంప్ 15% సుంకాల ఎఫెక్ట్

### జిడిపి డేటా, ఎఫ్అండ్ఒ ముగింపు ఈవారం కీలకం






**ముంబయి, ఫిబ్రవరి 22:** ఈక్విటీ మార్కెట్లకు ఈ వారంలో ట్రంప్ కొత్త సుంకాల ప్రభావం పడుతుందన్న అంచనాలుపెరిగాయి. సుప్రీంకోర్టు ట్రంప్ విధించిన ట్యారిఫ్‌లు చెల్లవనిప్రకటించిన క్రమంలో వెనువెంటనే 10శాతం సుంకాలు వేస్తామని, కొన్ని గంటల తర్వాత 15శాతానికి సుంకాలు ప్రపంచ వ్యాప్తంగా 150 రోజులపాటు అమలులో ఉండేటట్లు అమలుచేస్తామని ప్రకటించడంతో ఎగుమతి ఆధారిత కంపెనీల షేర్లపై ఈప్రభావం పడనున్నది. వీటికితోడు ప్రభుత్వం కూడా నాలుగో త్రైమాసిక జిడిపి గణాంకాలను వెల్లడించనున్నది. వీటితోపాటు ఫ్యూచర్స్ ఆప్షన్స్ కాంట్రాక్టులు కూడా ముగింపు ఈ వారంలోనే ఉండటంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించే అవకాశం ఉంది.

దేశీయంగా ఇన్వెస్టర్లు కీలక జిడిపి గణాంకాలపై ఆసక్తిచూపిస్తారు. విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల కార్యకలాపాలు, ట్రేడర్ల అంచనాలు ముడిచమురుధరలు, ఎంసిఎక్స్‌లో పసిడిధరలు, డాలరుతో రూపాయి మారకం విలువలు వంటివి ఈ వారం మార్కెట్లను ప్రభావితం చేస్తాయని అంచనా. ఈనెల 27వ తేదీ 4వ త్రైమాసిక జిడిపి డేటాను ప్రభుత్వం విడుదలచేస్తుంది. అలాగే 24 వతేదీతోనే నెలవారీ ఎఫ్అండ్ఒలు ముగుస్తాయి. ఇప్పటివరకూ ఫిబ్రవరిలో ఎఫ్‌పిఐలు కొనుగోళ్లు ముమ్మరంగానే జరిపారు. వీటితోపాటే ఆసియా, యూరోప్, అమెరికా మార్కెట్లధోరణులను కూడా ఇన్వెస్టర్లు గమనిస్తూట్రేడింగ్ చేస్తారు.

వీటన్నింటికీ మూలం 15శాతం సుంకాలేనన్నది తెలిసిందే. విదేశీ కరెన్సీ నిల్వలు, ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులుకూడా కీలకం అవుతాయని అంచనా. విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు ఈనెలలో 14,177 కోట్ల పెట్టుబడులు కుమ్మరించారు. అదనంగా ఎఫ్‌పిఐలు ప్రైమరీ మార్కెట్లలో రూ.2733.89 కోట్లు పెట్టుబడులుపెట్టారు. మొత్తంగా ఫిబ్రవరిలో పెట్టుబడులు రూ.16,911.55 కోట్లవరకూ ఉన్నాయి. ప్రస్తుతం నెలకొన్న పరిణామాల దృష్ట్యా మార్కెట్లలో అనిశ్చితి తప్పదని, అయితే ఎంపికచేసిన రంగాల్లో కొనుగోళ్లు ఉంటాయని స్టాక్ నిపుణులు చెపుతున్నారు.

## టాప్ ఆరు కంపెనీల్లో రూ.64 వేల కోట్లు పెరిగిన ఎంక్యాప్



**ముంబయి, ఫిబ్రవరి 22:** మార్కెట్లలో ఉన్న టాప్ పది అత్యధిక విలువలున్న కార్పొరేట్ కంపెనీల్లో ఆరు కంపెనీల విలువలు రూ.63,478.46 కోట్లు పెరిగాయి. వీటిలో ఎల్అండ్‌టి, భారతీయ స్టేట్‌బ్యాంకులు భారీగా లబ్ధిపొందాయి. ఎల్అండ్‌టి మార్కెట్ విలువలు రూ.28,523.31 కోట్లు పెరిగి రూ.6,02,552.24 కోట్లకుచేరితే ఎస్‌బిఐకి రూ.16,015.12 కోట్లుపెరిగి రూ.11,22,581.56 కోట్లకు చేరింది హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు రూ.9617.56 కోట్లుపెరిగి రూ.14,03,239.48 కోట్లకు చేరింది. ఎల్ఐసి కూడా రూ.5977,12కోట్లుపెరిగి రూ.5,52,203.92కోట్లకు చేరింది. బజాజ్‌ఫైనాన్స్ రూ.3142.36 కోట్లుపెరిగి రూ.6,40, 387కోట్లకు చేరితే రిలయన్స్ గ్రూప్ 202.99 కోట్లుపెరిగి రూ.19,21,678.78 కోట్లకు చేరింది. ఇకభారతి ఎయిర్‌టెల్ మార్కెట్ విలువలు రూ.15,338.66 కోట్లు క్షీణించి రూ.11,27,705.37 కోట్లకు చేరింది. ఐసిఐసిఐబ్యాంకు కూడా రూ.14,632.10 కోట్లు క్షీణించి రూ.9,97చ346.67 కోట్లకు చేరింది.

ఇన్ఫోసిస్ ఎంకాప్ రూ.6791.58 కోట్లు క్షీనించి రూ.5,48,496.14 కోట్లకు చేరితే టిసిఎస్ కూడా రూ.1989.95 కోట్లు క్షీణించి రూ.9,72,053,48 కోట్లకు చేరింది. అయితే ఎప్పటిలాగే రిలయన్స్ టాప్ వన్‌గా నిలిస్తే ఆ తర్వాత స్థానాల్లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, భారతీయ స్టేట్‌బ్యాంకు, ఐసిఐసిఐబ్యాంకు, టిసిఎస్, బజాజ్‌ఫైనాన్స్, ఎల్అండ్‌టి ఎల్ఐసి, ఇన్ఫోసిస్ కంపెనీలు నిలిచాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.